జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

రంగారెడ్డి | గురువారం 11 సెప్టెంబర్ 2025 | సంపుటి : 15 | సంచిక : 263 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం



- రామరాజ్యం లక్ష్యంగానే కూటమిపాలన
- రాయలసీమ ను రతనాల సీమ చేస్తా
- అనంతలో అధరహో అనిపించిన సూపర్ సిక్స్ సభ
- ప్రజల దీవెనలతో హిట్ కూటమి కాంబినేషన్
- ఎప్పుడు ఎన్నికలు పెట్టినా ఒన్ సైడ్ గా గెలిపించండి
- సూపర్ సిక్స్ విజయోత్సవ వేదికగా ఆటో డ్రైవర్లకు కానుక
- దసరాకు ఆటో డ్రైవర్లకు రూ.15వేల ఆర్థిక సాయం చేస్తాం

**అనంతపురం**

కూటమి పార్టీలు తొలిసారిగా ఉమ్మడిగా అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్-సూపర్ హిట్ విజయోత్సవ సభ అదరహో అనిపించింది. బహిరంగ సభకు భారీ సంఖ్యలో జనం, పార్టీ శ్రేణులు హాజరయ్యారు. ప్రజల ఆశీర్వాదంతో తమ హిట్ కాంబినేషన్ కొనసాగుతుందని కూటమి నేతలు సభా వేదికగా ప్రకటించారు. - మిగతా3లో



### మన రాజ్యాంగం చూసి గర్విస్తున్నాం

- పొరుగు దేశాల్లో పరిస్థితి చూడండి
- కొన్ని నెలల క్రితం బంగ్లాదేశ్‌లోనూ ఇదే పరిస్థితి
- ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా..
- దేశాన్ని వీడి భారత్‌లో తలదాచుకుంటున్నారు.
- ఓ కేసు విచారణ సమయంలో భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు

## జగన్ పాలనలో రైతుల నరకం

- వ్యవసాయ శాఖ, రైతాంగం అభివృద్ధిపై జగన్ ఓపెన్ డిబేట్‌కి సిద్ధమా?
- సవాల్ విసిరిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన మార్పులను రాష్ట్ర ప్రజలముందు బహిర్గతం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం
- కూటమి ప్రభుత్వంపై జగన్ ఆరోపణలు చేయడం విచిత్రంగా ఉంది
- రైతు పేరు చెప్పడానికి జగన్ అర్హుడు కాదు.. రైతు కష్టాన్ని దోచుకొని, రైతు కన్నీటి మీద రాజకీయాలు చేసిన వ్యక్తి జగన్
- వైసీపీ పాలనలో రైతాంగాన్ని మోసం చేసి, నేడు తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్న జగన్

**విజయవాడ**

రైతాంగం అభివృద్ధి, వ్యయసాయ శాఖలో చేసిన సంస్కరణలు, రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఓపెన్ డిబేట్‌కు సిద్ధమా? అని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వైసీపీ అధినేత జగన్‌కు సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం ఏం చేస్తుందో, వ్యయసాయ రంగంలో తీసుకొచ్చిన మార్పులు ఏవో రాష్ట్ర ప్రజలముందు బహిర్గతం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఒక ప్రకటనలో తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులకు మోసపూరిత వాగ్దానాలు తప్ప ఇంకేమీ ఇవ్వలేదని, మద్దతు ధరలు కోత - మిగతా3లో



## జేఈఈ అడ్వాన్స్‌డ్ లేకుండానే.. ఐఐటీలో అడ్మిషన్!

- ప్రతి విద్యార్థి ఐఐటీలో అడ్మిషన్ పొందడం కోసం ప్రయత్నాలు
- జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ లేకుండానే ఐదుగురికి విద్యార్థులకు కాన్పూర్ ఐఐటీలో ప్రవేశం లభించినట్టు ఇండియా టుడే వెల్లడి
- ఎంపికైన విద్యార్థులలో ఇద్దరు ఇంటర్నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ ఒలింపియాడ్ శిక్షణ శిబిరంకు చెందినవారు.



## సూపర్ సిక్స్ అట్టర్ ప్లాప్ సినిమాకు బలవంతపు విజయోత్సవాలు

- బ్లాక్ మార్కెట్‌కు చంద్రబాబే భాగస్వామి
- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్.
- సీఎం సొంత జిల్లా, కుప్పంలో కూడా రైతులు ఆగచాట్లు పడుతున్నారు
- కూటమి ప్రభుత్వ పాలనలో సూపర్ సిక్స్.. అట్టర్‌ఫ్లాప్ సినిమా
- చంద్రబాబు అబద్ధాలు, మోసాలు ఒక స్థాయిలోనే ఉంటాయి
- కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పే వ్యక్తి చంద్రబాబు
- ఎన్నికలకు ముందు ఇచ్చిన అడ్వర్‌టైజ్‌మెంట్.. ఇది ఏ లెవల్ మోసమో.. వాళ్ల అనుకూల మీడియాలో వచ్చిన అడ్వైర్‌టైజ్‌మెంట్లను చూడండి
- 50 ఏళ్ల వాళ్లకు పెన్షన్ తీసేశారు. ఆడబిడ్డ నిధి ఎగిరిపోయింది



**తాడేపల్లి**

ఏపీలో ఎరువులు దొరక్క రైతులు అవస్థలు పడుతుంటే మీకు పట్టదా చంద్రబాబు అని ప్రశ్నించారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్. సమయానికి ఎరువులు అందిస్తే రైతులు రొడ్డెక్కాల్సిన పరిస్థితి ఎందుకొస్తుంది?. సీఎం సొంత జిల్లా, కుప్పంలో కూడా రైతులు ఆగచాట్లు పడుతున్నారు. దీనిపై చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం చెప్పాలన్నారు. బ్లాక్ మార్కెట్‌కు చంద్రబాబే భాగస్వామి అని చెప్పుకొచ్చారు. ఏపీలో యూరియా కొరత, రైతుల అవస్థలపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ట్వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో రైతులు రోడ్డెక్కడం ఎక్కడైనా చూశారా?. మా హయంలో రైతులకు ఇబ్బంది అనేదే రాలేదు. - మిగతా3లో




### దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్'కు సన్నాహాలు.. ఈసీ కీలక భేటీ

- ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే
- ఈక్రమంలో దీన్ని దేశవ్యాప్తంగా చేపట్టేందుకు ఎన్నికల సంఘం సిద్ధమయ్యింది
- బిహార్ తర్వాత దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహిస్తామని ఈసీ ఇప్పటికే పేర్కొన్న సంగతి తెలిసిందే

## నేపాల్ నుంచి ప్రత్యేక విమానంలో ఏపీ వాసులను తీసుకొస్తాం

- "సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నేపాల్‌లో ఉన్న వారిని తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం
- అక్కడ ఉన్న రాష్ట్ర వాసులతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నాం
- ఏపీ భవన్‌లో టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి నేపాల్‌లోని తెలుగువారిని గుర్తించాం.



**అమరావతి**

నేపాల్ అల్లర్ల నేపథ్యంలో అక్కడ చిక్కుకుపోయిన ఏపీ వాసులను సురక్షితంగా వారి స్వస్థలాలకు తీసుకొస్తామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. నేపాల్‌లోని తెలుగువారి పరిస్థితులపై మంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. "సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నేపాల్‌లో ఉన్న వారిని తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. - మిగతా3లో



### ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారు

- సెప్టెంబర్ 12వ తేదీన సీపీ రాధాకృష్ణన్ 15వ భారత ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు.
- రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి.
- మరోవైపు మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా

## దిగొస్తున్న అమెరికా

- రెండు దేశాల మధ్య వాణిజ్య అవరోధాలను పరిష్కరించడానికి, వాణిజ్య ఒప్పందం కోసం తమ ప్రభుత్వం భారతదేశంతో చర్చలు
- చైనాకు భారతదేశాన్ని కోల్పోయానని కామెంట్ చేసిన కొన్ని రోజులకే భారత్ తో ట్రేడ్ డీల్ కోసం చూస్తున్నట్లు ట్రంప్ ప్రకటన
- భారత ప్రధాని మోదీతో మాట్లాడేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతా ట్రూత్ సోషల్ లో ఒక పోస్ట్
- "చాలా మంచి స్నేహితుడు అయిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో త్వరలో మాట్లాడటానికి ఎదురు చూస్తున్నాను
- ఈ చర్చలు రెండు దేశాలు కోరుకున్న ఫలితాన్ని ఇస్తాయనే నమ్మకం ఉందన్నారు.



**న్యూఢిల్లీ**

భారత్ మీద 50 శాతం టారిఫ్ అమలుచేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాల మధ్య వాణిజ్య అవరోధాలను పరిష్కరించడానికి, వాణిజ్య ఒప్పందం కోసం తమ ప్రభుత్వం - మిగతా3లో



### ట్రంప్ టారిఫ్‌ల వేళ.. భారత్-రష్యా 'ఎక్సర్‌సైజ్ జాపడ్'

- 16 వరకు భారత్-రష్యా బలగాలు ఆపరేషన్ జాపడ్ పేరిట సంయుక్తంగా సైనిక విన్యాసాలు
- సంప్రదాయ యుద్ధరీతులు, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాల కోసం మారుతున్న పరిస్థితులకు తగ్గట్టుగా సరికొత్త వ్యూహాలను మార్చిడి చేసుకుంటాయని భారత రక్షణశాఖ వెల్లడి

# జేఈఈ అడ్వాన్స్‌డ్ లేకుండానే.. ఐఐటీలో అడ్మిషన్!



ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో ప్రవేశం కోసం దేశవ్యాప్తంగా ఏటా లక్షలాది మంది విద్యార్థులు పోటీ పడుతుంటారు. జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ)లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఐఐటీలో సీటు సంపాదించాలని విద్యార్థులు కోరుకుంటారు. ఇంజనీరింగ్ చేయాలనుకునే దాదాపు ప్రతి విద్యార్థి ఐఐటీలో అడ్మిషన్ పొందడం కోసం ప్రయత్నాలు చేస్తుంటారు. ఐఐటీలో సీటు రావాలంటే జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌లో అత్యుత్తమ మార్కులు సాధించాల్సి ఉంటుంది. అయితే జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షలు రాయకుండానే ఐదుగురు విద్యార్థులు ఐఐటీ అడ్మిషన్ సాధించారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ లేకుండానే ఐదుగురికి విద్యార్థులకు కాన్పూర్ ఐఐటీలో ప్రవేశం లభించినట్టు ఇండియా టుడే వెల్లడించింది. బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్), బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ (బీటెక్)లో ఈ ఐదుగురు సీట్లు దక్కించుకున్నారని తెలిపింది. ఒలింపియాడ్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా వీరిని 2025- 26 సెషన్‌కి ఎంపిక చేసినట్టు పేర్కొంది. ఐదుగురు విద్యార్థులు కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్‌లో సీఎస్ఈ ఎంచుకున్నారు. వీరికి సంబంధించిన వ్యక్తిగత వివరాలను కాన్పూర్ ఐఐటీ వెల్లడి చేయలేదు. ఎంపికైన విద్యార్థులలో ఇద్దరు ఇంటర్నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ ఒలింపియాడ్ శిక్షణ శిబిరంకు చెందినవారు. మిగతా ముగ్గురు విద్యార్థులు ఇంటర్నేషనల్ మ్యాథమెటికల్ ఒలింపియాడ్ శిక్షణ శిబిరం నుంచి వచ్చారు. ఒలింపియాడ్‌లో సాధించిన విజయాలు, శిక్షణా శిబిరాలకు హాజరు వంటి అంశాలతో పాటు జేఈఈ అడ్వాన్స్‌డ్స్‌కు సమాన స్థాయి ప్రమాణాలతో వీరిని పరీక్షించారు. ప్రవేశ నిబంధనలకు అనుగుణంగానే వీరికి సీట్లు కేటాయించారు.

**రెగ్యులర్ విద్యార్థుల్లానే..**

ఒలింపియాడ్ ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులు నేరుగా రెగ్యులర్ కోర్సులో చేరతారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ద్వారా అడ్మిషన్ పొందిన విద్యార్థులతో కలిసి చదువుతారని అధికారులు వెల్లడించారు. వీరికి ప్రత్యేకంగా విద్యా సహాయం చేయడం అంటూ ఏమీ ఉండదని స్పష్టం చేశారు. అయితే ఒలింపియాడ్ ఎంట్రన్స్.. ఎంపిక చేసిన కొన్ని కోర్సులకు మాత్రమే పరిమితమని తెలిపారు.

**ఒలింపియాడ్ ఎంట్రన్స్ ఈ 5 కోర్సులకు మాత్రమే.**

1. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్
2. మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్
3. ఎకనామిక్ సైన్సెస్
4. బయోలాజికల్ సైన్సెస్ అండ్ బయో ఇంజనీరింగ్
5. కెమిస్ట్రీ

**ఎంపిక ఇలా?**

ఒలింపియాడ్స్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను రాత పరీక్షకు ఎంపిక చేస్తుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్ సిలబస్ ప్రకారమే వీరికి రాత పరీక్ష పెడతారు. వీటి ఫలితాలు ఆధారంగా కేంద్ర అడ్మిషన్ల కమిటీ ప్రవేశానికి ఎంపిక చేస్తుంది. మొత్తం ఈ ప్రక్రియ అంతా జేఈఈ అడ్వాన్స్‌డ్స్‌లో అర్హత సాధించిన వారికి సరి సమానంగా ఉంటుందని కాన్పూర్ ఐఐటీ తెలిపింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ విజేతలతో సమానమైన ప్రతిభ ఉన్న ఒలింపియాడ్ విజేతలకు ఐఐటీలో ప్రవేశానికి ప్రత్యామ్నాయ మార్గంగా దీన్ని చెప్పుకోవచ్చు. కాబట్టి తల్లిదండ్రులు ఇక నుంచి ఒలింపియాడ్స్‌పైనా ఫోకస్ చేయాల్సి ఉంటుంది.

**సీఎస్ఈవైపే మొగ్గు**

2025 జాయింట్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (జేఐసీ) నివేదిక ప్రకారం 27,285 మంది అభ్యర్థులు తమ ప్రాధాన్యత జాబితాలో ఐఐటి కాన్పూర్‌లో సీఎస్ఈని ఎంచుకున్నారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 23,254 ప్రాధాన్యతలతో రెండవ స్థానంలో ఉంది. మెకానికల్ ఇంజనీరింగ్ (20,261), సివిల్ ఇంజనీరింగ్ (15,846), కెమికల్ ఇంజనీరింగ్ విత్ పవర్ అండ్ ఆటోమేషన్ (15,758) తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

# భారత్, నేపాల్ సరిహద్దుల్లో ఉద్రిక్తత



**న్యూఢిల్లీ :** పొరుగు దేశం నేపాల్‌లో నెలకొన్న తీవ్ర రాజకీయ సంక్షోభం ప్రభావం భారత్‌పై పడింది. అవినీతి, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా యువత చేపట్టిన హింసాత్మక నిరసనలతో ఆ దేశం అట్టుడుకుతోంది. ప్రజాందోళనల ధాటికి ప్రధాని కేపీ శర్మ ఓలీ తన పదవికి రాజీనామా చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారత్ తన సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. నేపాల్‌లో అశాంతి పెరిగిపోవడంతో ఆ ప్రభావం మన దేశంపై పడకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. సుమారు 1,751 కిలోమీటర్ల పొడవైన భారత్-నేపాల్ సరిహద్దు వెంబడి హై అలర్ట్ ప్రకటించింది. సరిహద్దు భద్రతా దళమైన సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ)తో పాటు ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, సిక్కిం రాష్ట్రాల పోలీసులు గస్తీని ముమ్మరం చేశారు. "నేపాల్‌లో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సరిహద్దులో అప్రమత్తత ప్రకటించాం. ఎస్ఎస్‌బీ బృందాలు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి" అని ఓ ఉన్నతాధికారి ఏఎన్ఐ వార్తా సంస్థకు తెలిపారు. భద్రతా చర్యల్లో భాగంగా సరిహద్దుల్లో రాకపోకలపై కఠిన ఆంక్షలు విధించారు. ఉత్తర ప్రదేశ్‌లోని గౌరీఫాంటా సరిహద్దు వద్ద నేపాల్ పౌరులను భారత్‌లోకి అనుమతించడం లేదు. అదేవిధంగా, నేపాల్ కూడా భారత పౌరులను తమ దేశంలోకి రానివ్వడం లేదు. అయితే, తమ తమ దేశాలకు తిరిగి వెళ్లే పౌరులకు మాత్రం మినహాయింపు ఇస్తున్నారు. ఈ ఆంక్షల వల్ల పశ్చిమ బెంగాల్‌లోని పానీటంకీ వంటి ప్రాంతాల్లో వందలాది సరుకు రవాణా ట్రక్కులు నిలిచిపోయి వాణిజ్యం స్తంభించింది. భారత విదేశాంగ శాఖ మంగళవారం ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. నేపాల్‌లో ఉన్న భారత పౌరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించింది. ఇరు దేశాల మధ్య విమాన సర్వీసులను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు.

**నేపాల్‌లో అసలేం జరిగింది?**


నిరుద్యోగం, రాజకీయ అస్థిరత, అవినీతి వంటి సమస్యలతో విసిగిపోయిన నేపాల్ యువత, ప్రభుత్వం సోషల్ మీడియాపై నిషేధం విధించడంతో ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చింది. ఈ నిరసనలు హింసాత్మకంగా మారి, జరిగిన ఘర్షణల్లో 19 మంది పౌరులు, ముగ్గురు పోలీసులు మరణించారు. ఆందోళనకారులు పార్లమెంట్ భవనంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలకు నిప్పు పెట్టారు. ప్రధాని ఓలీ రాజీనామా చేసినప్పటికీ శాంతించకపోవడంతో, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు బుధవారం సైన్యం రంగంలోకి దిగి దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించింది. దీంతో ఖాట్మండు సహా ప్రధాన నగరాలన్నీ నిర్మానుష్యంగా మారాయి.

## ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారు..



**న్యూఢిల్లీ :** ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్ ఘన విజయం సాధించారు. ఆయన ఉపరాష్ట్రపతి బాధ్యతలు చేపట్టేందుకు ముహూర్తం ఖరారు అయిందని తెలుస్తోంది. సెప్టెంబర్ 12వ తేదీన సీపీ రాధాకృష్ణన్ 15వ భారత ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఉపరాష్ట్రపతి చేత భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అందుకోసం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. భారత ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ దన్‌ఖడ్ రాజీనామా చేశారు. దీంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. ఆ క్రమంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను రంగలోకి దింపారు. అలాగే ప్రతిపక్ష ఇండి కూటమి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డిని బరిలో దింపారు. సెప్టెంబర్ 9వ తేదీన జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ 148 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా.. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు పోలయ్యాయి. ఇక బీఆర్ఎస్, బీజేడీ, ఎస్ఎల్‌డీలు ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. మరోవైపు మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ మరికొన్ని గంటల్లో రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది.

# ట్రంప్ టారిఫ్‌ల వేళ.. భారత్-రష్యా 'ఎక్సర్‌సైజ్ జాపడ్'



ఇంటర్నెట్‌డెస్క్: తాను బెదిరించినా పట్టించుకోకుండా రష్యా నుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాల మోత మోగించిన సంగతి తెలిసిందే కానీ, భారత్ మాత్రం రష్యాతో ఉన్న తన చిరకాల స్నేహాన్ని కొనసాగిస్తోంది. ఈ తరుణంలో రెండు దేశాలు 'ఎక్సర్‌సైజ్ జాపడ్'ను నిర్వహిస్తున్నాయి. ఈ రోజు (సెప్టెంబర్ 10) నుంచి 16 వరకు భారత్-రష్యా బలగాలు ఆపరేషన్ జాపడ్ పేరిట సంయుక్తంగా సైనిక విన్యాసాల్లో పాల్గొంటాయి. సంప్రదాయ యుద్ధరీతులు, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాల కోసం మారుతున్న పరిస్థితులకు తగ్గట్టుగా సరికొత్త వ్యూహాలను మార్పిడి చేసుకుంటాయని భారత రక్షణశాఖ వెల్లడించింది. ఇందుకోసం భారత సైన్యానికి చెందిన 65 మందితో కూడిన బృందం మంగళవారం రష్యాకు వెళ్లింది. నిజ్నీ నగరంలోని ములినో ట్రైనింగ్ గ్రౌండ్‌లో ఈ విన్యాసాలు జరుగుతాయని తెలిపింది. వీటివల్ల ఇరుదేశాల మధ్య రక్షణ సంబంధాలు బలోపేతం అవుతాయని, స్నేహబంధం మరింత పటిష్టంగా మారుతుందని పేర్కొంది. పరస్పర సహకారం, విశ్వాసం మెరుగుపడుతుందని వెల్లడించింది. ఇప్పటికే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటంపై అసహనంగా ఉన్న ట్రంప్.. తన సహాయకుడు పీటర్ నవారోతో భారత్ గురించి ఇష్టారీతిగా మాట్లాడిస్తున్నారు. నవారో వ్యాఖ్యలను ఇప్పటికే ఖండించిన భారత్.. తన ప్రయోజనాలను కాపాడుకునే దిశగానే అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే ఎస్‌సీఓ సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ సమావేశమయ్యారు. ఇద్దరూ కలిసి కారులో ప్రయాణించి, తమ ఆలోచనలను పంచుకున్నారు. వీరిద్దరు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కలిసి ఒకే వేదికపై కనిపించారు. ఇది ట్రంప్ అక్కసుకు కారణమైంది. దాంతో ఐరోపా దేశాలు కూడా భారత్‌పై 100 శాతం సుంకాలు విధించాలని సూచించారు. మిత్రదేశాలను కట్టడి చేసి.. రష్యాపై ఒత్తిడి తెస్తేనే ఉక్రెయిన్‌లో త్వరగా శాంతి నెలకొంటుందని ఒక అసంబద్ధ ప్రచారానికి తెరతీసిన ట్రంప్.. ఇప్పుడు ఐరోపాను కూడా తోడు తెచ్చుకుంటున్నారు. ఈ ఒత్తిడికి తలొగ్గని భారత్.. రష్యాతో స్నేహబంధాన్ని కొనసాగించేందుకే మొగ్గు చూపుతోంది. అందుకు తాజా పరిణామం ఓ నిదర్శనం.

## సంజయ్ ఆస్తి కోసం కోర్టుకు పిల్లలు

**ముంబై :** దివంగత పారిశ్రామికవేత్త సంజయ్ కపూర్ కి చెందిన సుమారు రూ.30,000 కోట్ల ఆస్తి వివాదం తీవ్రరూపం దాల్చింది. తన ఆస్తి మొత్తం భార్య ప్రియా కపూర్‌కే చెందేలా సంజయ్ కపూర్ రాశారంటూ బయటపడిన వీలునామాను ఆయన మొదటి భార్య, నటి కరిష్మా కపూర్ పిల్లలు కోర్టులో సవాలు చేశారు. ఆ వీలునామా నకిలీదని, దానిని సృష్టించారని వారు ఆరోపించారు. ఈ మేరకు తమ తల్లి ద్వారా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సంజయ్ కపూర్ ఆస్తిలో తమకు ఐదో వంతు చొప్పున వాటా ఇప్పించాలని కుమార్తె సమైరా, మైనర్ అయిన కుమారుడు కియాన్ కోర్టును కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జ్యోతి సింగ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిల్లల తరపున న్యాయవాది మహేశ్ జెఠ్మలానీ వాదనలు వినిపిస్తూ, "సంజయ్ కపూర్ మరణించిన ఏడు వారాల వరకు ఎలాంటి వీలునామా లేదని ప్రియా కపూర్ చెప్పారు. కానీ జూలై 30న జరిగిన కుటుంబ సమావేశంలో ఉన్నట్టుండి ఓ వీలునామాను బయటపెట్టారు. రిజిస్టర్ కూడా కాని ఈ వీలునామా నకిలీది" అని ఆరోపించారు. ఈ ఆరోపణలను ప్రియా కపూర్ తరపు న్యాయవాది రాజీవ్ నాయర్ తీవ్రంగా ఖండించారు. "ఈ దావాకు విచారణ అర్హతే లేదు. ప్రియా కపూర్ చట్టబద్ధమైన భార్య. విడాకుల కోసం సుప్రీంకోర్టు వరకు వెళ్లిన వారికి ఇప్పుడు ప్రేమ, అభిమానం గుర్తుకొచ్చాయా? భర్త చనిపోయి బాధలో ఉన్న వితంతువుపై ఇలాంటి ఆరోపణలు చేయడం సరికాదు" అని ఆయన వాదించారు. అంతేకాకుండా, ఆర్కే ఫ్యామిలీ ట్రస్ట్ కింద పిల్లలకు ఇప్పటికే రూ.1,900 కోట్ల విలువైన ఆస్తులు అందాయని కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, వీలునామా కాపీని పిల్లలకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించింది. ప్రియా కపూర్‌కు నోటీసులు జారీ చేస్తూ, రెండు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. సంజయ్ కపూర్ మరణించిన జూన్ 12 నాటికి ఆయన పేరు మీద ఉన్న చర, స్థిరాస్తుల పూర్తి వివరాలను కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. అనంతరం తదుపరి విచారణను అక్టోబర్ 9కి వాయిదా వేసింది. గత జూన్ 12న ఇంగ్లండ్‌లో పోలో ఆడుతుండగా సంజయ్ కపూర్ కుప్పకూలి మరణించిన విషయం తెలిసిందే. ఆయన మరణానంతరం మొదలైన ఈ ఆస్తి వివాదం ఇప్పుడు కోర్టుకు చేరడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## మన రాజ్యాంగం చూసి గర్విస్తున్నాం



**ఇంటర్నెట్ డెస్క్:** నేపాల్‌లో యువత నిరసనలు హింసాత్మకంగా మారాయి. దీంతో అక్కడ రాజకీయ సంక్షోభం ఏర్పడింది. కొన్ని నెలల క్రితం బంగ్లాదేశ్‌లోనూ ఇదే పరిస్థితి. ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా.. దేశాన్ని వీడి భారత్‌లో తలదాచుకుంటున్నారు. ఈ పరిణామాల నడుమ ఓ కేసు విచారణ సమయంలో భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. నేపాల్, బంగ్లాదేశ్‌లోని పరిస్థితులను ఉటంకిస్తూ.. మన రాజ్యాంగం పట్ల గర్వపడుతున్నట్లు పేర్కొంది. రాష్ట్రాల బిల్లుల ఆమోదంలో న్యాయస్థానం తనకు గడువు నిర్దేశించడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కోరిన అభిప్రాయం అంశమై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు బుధవారం వాదనలు కొనసాగాయి. సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్. చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు. ఈక్రమంలోనే రాజ్యాంగాన్ని ప్రస్తావించిన సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్.. ప్రజాప్రాముఖ్యం కలిగిన లేదా ప్రజలను ప్రభావితం చేసే ఏదైనా చట్టంపై సుప్రీం కోర్టు సలహా కోరే హక్కు రాష్ట్రపతికి ఉందన్నారు. "మన రాజ్యాంగం చూసి గర్విస్తున్నాం. పొరుగుదేశాల్లో ఏం జరుగుతుందో చూడండి. నేపాల్‌లో పరిస్థితి గమనించండి" అని వ్యాఖ్యానించారు. "అవును.. బంగ్లాదేశ్‌లోనూ" అంటూ జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పందించారు. బిల్లులను నెల రోజులకు పైగా రిజర్వ్ చేసే విషయంలో గవర్నర్ల అధికారాలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమర్థించారు. అటువంటి కేసులు తక్కువే ఉన్నాయన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన అన్ని బిల్లుల్లో 90 శాతం బిల్లులకు గవర్నర్ నెలలోపే సమ్మతి తెలుపుతారని చెప్పారు. 1970 నుంచి 2025 వరకు తమిళనాడుకు చెందిన ఏడు బిల్లులు సహా కేవలం 20 బిల్లులు మాత్రమే రిజర్వ్‌లో ఉన్నట్లు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు

## దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్'కు సన్నాహాలు.. ఈసీ కీలక భేటీ




**ఇంటర్నెట్‌డెస్క్:** బిహార్‌లో ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో దీన్ని దేశవ్యాప్తంగా చేపట్టేందుకు ఎన్నికల సంఘం సిద్ధమయ్యింది. అందులోభాగంగా బుధవారం రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులతో సమావేశం జరపనుంది. ఈ సమావేశంలో ఎస్ఐఆర్‌పై సీనియర్ అధికారులు ప్రత్యేక ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బిహార్‌లో ఈ విధానం అమలు విషయాలను ఆ రాష్ట్ర ఎన్నికల అధికారి పంచుకోనున్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేశ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత సీఈవోలతో ఇది మూడో సమావేశం. బిహార్ తర్వాత దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహిస్తామని ఈసీ ఇప్పటికే పేర్కొన్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరిల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఈ ఏడాది చివర్లోనే ఈసీ ఈ ప్రక్రియ ప్రారంభించే సూచనలు కన్పిస్తున్నాయి.

అక్రమ వలసదారులను తొలగించడంతో పాటు ఓటరు జాబితాల సమగ్రతను కాపాడటమే లక్ష్యంగా ఈ చర్యలు ప్రారంభించినట్లు ఈసీ చెబుతోంది. ఇలాంటి సర్వేను 20ఏళ్ల క్రితం చివరిసారిగా చేశారు. అప్పటినుంచి అనుబంధ సవరణలు మాత్రమే చేపడుతున్నారు. బిహార్‌లో ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఈసీ ఈ ప్రక్రియ నిర్వహించడంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. దీనిపై అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) అనే స్వచ్ఛందసంస్థ సుప్రీంకోర్టు ను ఆశ్రయించగా.. అక్కడ ఈసీ చర్యను ధర్మాసనం సమర్థించింది. రాజ్యాంగం ప్రకారమే ఇది జరుగుతుందని పేర్కొంది.

# సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్ సినిమాకు బలవంతపు విజయోత్సవాలు

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు సొంత జిల్లాలోనే రైతులు ఆగచాట్లు పడుతున్నారు. మా పాలనలో.. ఇప్పుడూ అదే అధికారులు ఉన్నారు. అప్పుడు రాని సమస్య.. ఇప్పుడు ఎందుకు వచ్చింది?. జగన్ అనే వ్యక్తి రైతులకు ఇబ్బంది కలగకూడదని ఆలోచించారు. ఇప్పుడు ఎరువుల దగ్గర కూడా స్కామ్‌లకు పాల్పడుతున్నారు. ఖెన్ ప్రారంభంలోనే ఎంత విస్తీర్ణం సాగు అవుతుంది. ఎంత మొత్తంలో ఎరువులు కావాలో తెలియదా?. చంద్రబాబు చెప్పినట్టు యూరియా సరఫలా జరిగిందా.?

**రైతుల అవస్థలకు కారణం..**

ఆర్బీకేలను నిర్వీర్యం చేశారు. ఈ క్రాప్ వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. ప్రభుత్వం నుంచి వెళ్లాల్సిన ఎరువుల్ని టీడీపీ నేతలు దారి మళ్లించి.. అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. అధికంగా కేటాయించిన ఎరువుల్ని బ్లాక్ చేసి.. బ్లాక్‌లో అమ్మేసుకుంటున్నారు. చంద్రబాబే ఇందులో భాగస్వామి రైతులను పీడించి.. స్కామ్‌లు చేసి కింద నుంచి పైదాకా అందరూ పంచుకుంటున్నారు. దాచుకో.. దోచుకు. యూరియా విషయంలో రూ.250 కోట్ల స్కామ జరిగింది' అని ఆరోపించారు.

**చిత్తశుద్ధి లేని చంద్రబాబు వల్లే..**

మా హయాంలో గట్టి హెచ్చరికలు వెళ్లేవి. తప్పు చేయాలంటే భయపడేవాళ్లు. అందుకే ఇలాంటివి జరగలేదు. ఇప్పుడు చంద్రబాబే దగ్గరుండి స్కాంలు నడిపిస్తున్నారు. చంద్రబాబుకు రైతుల మీద చిత్తశుద్ధి లేదు. ఎవరి మీద చర్యలు లేవు. రైతుల జీవితాలతో చెలగాటమాడుతూ.. స్కాంలు చేస్తున్నారు.. వీళ్లు మనుషులేనా?. రైతులు ఇబ్బంది పడుతుంటే వాళ్ల తరఫున మాట్లాడకూడదా?. ఉల్లి, టమాటా, చీనీ పంటలకు గిట్టుబాటు ధర లేదు. రాష్ట్రంలో పరిణామాలు చూస్తుంటే అసలు ప్రభుత్వం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు సున్నా వడ్డీ పథకం ఎత్తేశారు అని ఆరోపించారు.

**చంద్రబాబు ఎంత దుర్మార్గుడు అంటే**

ప్రభుత్వ ఆసుప్రతులు లేకుంటే ప్రైవేటు దోపిడీని ఆపేది ఎవరు? అని చంద్రబాబు సర్కార్‌ను ప్రశ్నించారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్. చంద్రబాబు మూడుసార్లు సీఎం అయ్యారు. కనీసం ఒక్క ప్రభుత్వ ఆసుపత్రి అయినా తీసుకొచ్చారా?. మెడికల్ సీట్లు వద్దని లేఖ రాసిన ఏకైక ముఖ్యమంత్రి, దుర్మార్గుడు అయిన వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. 26 జిల్లాల్లో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉండాలని ప్రయత్నించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిది అని చెప్పుకొచ్చారు.

ఏపీలో మెడికల్ కాలేజీల అంశంపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ..'ప్రభుత్వ ఆసుపత్రులను నడపడం ప్రభుత్వం బాధ్యత. ప్రైవేటు దోపిడీకి చెక్ పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. వ్యవస్థలను ప్రభుత్వం పట్టించుకోకపోతే ప్రైవేట్ దోపిడీ విచ్చలవిడిగా జరుగుతుంది. ఆ దోపిడీని సామాన్యుడు భరించలేడు. అందుకే ప్రభుత్వం కొన్ని వ్యవస్థలను బాధ్యతగా తీసుకుంది. ప్రభుత్వ ఆస్పత్రులు, కళాశాలలు లేకపోతే పేదలు దోపిడీకి బలవుతారు. ఆర్టీసీ బస్సులను ప్రైవేట్ సంస్థలు నడిపిస్తే.. సామాన్యుడు బస్సు ఎక్కగలడా?. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు లేకపోతే పేదలు దోపిడీకి బలవుతారు. 2019కి ముందు చంద్రబాబు మూడుసార్లు సీఎం అయ్యారు. కనీసం ఒక్క ప్రభుత్వ ఆసుపత్రి అయినా తీసుకొచ్చారా?. 1923 నుంచి 2019 వరకు రాష్ట్రంలో మొత్తం 12 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవి. మేం వచ్చాక ప్రతీ జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ తేవాలని ప్రయత్నించాం. 26 జిల్లాల్లో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉండాలని ప్రయత్నించాం. ప్రభుత్వ మెడికల్ కాలేజీలతో.. ఉచితంగా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుంది. ప్రైవేట్ దోపిడీకి చెక్ పడుతుంది అని అన్నారు. చంద్రబాబు ఎంత దుర్మార్గుడు అంటే..

పులివెందుల మెడికల్ కాలేజీ 50 ఎంబీబీఎస్ సీట్లతో భర్తీకి అనుమతులు మంజూరయ్యాయి. చంద్రబాబు మాకు ఆ సీట్లు వద్దని లేఖ రాశారు. కేవలం పులివెందుల మెడికల్ కాలేజ్ అనే ఉద్దేశంతోనే అలా చేశారు. ఇలాంటి ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడైనా ఉంటాడా?. పేదవాళ్లకు, మధ్యతరగతి మంచి జరుగుతుందటే అడ్డుకుంటారా?. మానవత్వం ఉన్నోడెవడైనా ఇలా చేస్తాడా?. చం?ద్రబాబు సక్రమంగా పని చేసి ఉంటే.. ఈ ఏడాదిన్నర పాలనలో మరో నాలుగు మెడికల్ కాలేజీలు కూడా పూర్తి అయ్యేవి. రాబోయే విద్యా సంవత్సరానికి మరో నాలుగు కాలేజీలకు చెందిన పనులు దగ్గర పడి ఉండేవి

**వైఎస్సార్‌సీపీ హయాంలో 17 మెడికల్ కాలేజీలు..**

వైఎస్సార్‌సీపీ హయాంలో 17 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చాం. పేదలకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సేవలు అందించాలనుకున్నాం. ఇవి ప్రారంభమైతే.. పేద ప్రజలకు ఉచితంగా అత్యాధునిక వైద్యం అందుతుంది. మా హయాంలో ఒక్కొక్కటిగా తరగతులు ప్రారంభించాయి. ఎన్నికల నాటికే పాడేరు, పులివెందుల మెడికల్ కాలేజీలు ప్రారంభం అయ్యాయి. మా హయాంలో 17లో ఏడు మెడికల్ కాలేజీలను క్లాస్‌లతో సహా అందుబాటులోకి తెచ్చాం. ఏడు కాలేజీల్లో క్లాసులు ప్రారంభమయ్యాయి. 800 సీట్లు అప్పటికే భర్తీ కూడా అయ్యాయి అని చెప్పుకొచ్చారు.

కేవలం పులివెందుల అనే... మానవత్వం ఉన్నోడెవడైనా అలా చేస్తాడా?

**చంద్రబాబుకి సిగ్గుండాలి..**

ఆలోచన మాది.. ఆచరణ మాది.. భూముల, నిధుల సమీకరణ మాది.. అన్నీ రెడీ అయ్యాయి. మరి చంద్రబాబు ఎందుకు ముందుకు తీసుకెళ్లలేకపోతున్నారు?. మిగిలిన రూ.5 వేల కోట్ల పనులకు ఆర్థిక సాయం కూడా వచ్చింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో కొన్ని లక్షల మందికి మేలు జరిగేది కదా. వైద్య విద్య కోసం జార్జియా, ఉక్రెయిన్ లాంటి దేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చేది. సిగ్గుండాలి.. ప్రభుత్వ ఆస్తులను అమ్ముకోవడానికి!. మేం అధికారంలోకి వచ్చేనాటికి 2,360 సీట్లు ఉండేవి. కొత్త మెడికల్ సీట్ల ద్వారా 2550కు మెడికల్ సీట్లు పెంచే ప్రయత్నం చేశాం. మా హయాంలో 800 సీట్లు కొత్తగా తీసుకొచ్చాం. ఎక్కడ జగన్‌కు క్రెడిట్ దక్కుతుందో అని.. మెడికల్ కాలేజీల నిర్మాణాలను చంద్రబాబు ఇలా దెబ్బ తీస్తున్నారు' అని చెప్పుకొచ్చారు.

సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్ సినిమాకు బలవంతపు విజయోత్సవాలు: వైఎస్ జగన్

తాడేపల్లి: కూటమి ప్రభుత్వ పాలనలో సూపర్ సిక్స్.. అట్టర్‌ఫ్లాప్ సినిమా అని ఎద్దేవా చేశారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్. సూపర్ సిక్స్ అనే.. అట్టర్ ఫ్లాప్ అయిన సినిమాకు బలవంతపు విజయోత్సవాలు జరుపుతున్నారు. అనంతపూర్‌లో ఇవాళ ఇదే చెప్పబోతున్నారు అని చెప్పుకొచ్చారు. చంద్రబాబు అబద్ధాలు, మోసాలు ఒక స్థాయిలోనే ఉంటాయి. కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పే వ్యక్తి చంద్రబాబు అని సెటైరికల్ వ్యాఖ్యలు చేశారు. సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్ అని ప్రజలకు అర్థమైంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన అడ్వర్‌టైజ్‌మెంట్.. ఇది ఏ లెవల్ మోసమో.. వాళ్ల అనుకూల మీడియాలో వచ్చిన అడ్వైర్‌టైజ్‌మెంట్లను చూడండి. 50 ఏళ్ల వాళ్లకు పెన్షన్ తీసేశారు. ఆడబిడ్డ నిధి ఎగిరిపోయింది. మూడు వేల రూపాయల నిరుద్యోగ భృతి.. కనిపించడం లేదు. క్యాంటీన్లను ఇప్పుడు కొత్తగా సూపర్‌సిక్స్‌లో చేర్చారు. ఎన్నికలకు ముందు జగన్ ఇచ్చిన హామీలతో పాటు అదనంగా ఇస్తానని చంద్రబాబు వాగ్దానం చేశారు.

సూపర్ సిక్స్‌కు పొంతనేది..

ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్‌కు ఈరోజు సూపర్ సిక్స్ పొంతన లేదు. ఇప్పుడు ఇచ్చేది కాకుండా రైతులకు అదనంగా రూ.20వేలు ఇస్తామన్నారు. తల్లికి వందనం కింద ఆంక్షలు లేకుండా ప్రతీ బిడ్డకు రూ.15వేలు ఇస్తామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఏ ఊరికి పోవాలన్నా ఉచితం అని చెప్పారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. గతేడాది ఎన్ని ఇచ్చారు. ఇప్పటి వరకు ఎన్ని ఇచ్చారు. ఆడబిడ్డ ధి పేరుతో నెలకు రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్లలో ప్రతీ మహిళకు 36వేలు ఇచ్చారా?. నిరుద్యోగ భృతి కింద రెండేళ్లలో ఒక్కో నిరుద్యోగికి రూ.72వేలు బాకీ పడ్డారు. 50 ఏళ్లు దాటిన మహిళలకు గతేడాది 48వేలు, ఈ ఏడాది 48 వేలు పెన్షన్లకు ఎగనామం పెట్టారు. మేము దిగిపోయే నాటికి 66,34,742 మంది పెన్షన్‌దారులు ఉన్నారు. ఇప్పుడు 61,91,864 మంది పెన్షన్‌దారులు ఉన్నారు. ఇది మోసం కాదా? చంద్రబాబు అని అడుగుతున్నాను. పీఎం కిసాన్ కాకుండా అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఇస్తామన్నారు. గతేడాది, ఈ ఏడాది కలిపి రైతులకు రూ.40వేలు బాకీపడ్డారు. తల్లికివందనం కింద 15వేలు ఇస్తామన్నారు. రూ.8వేలు, 9వేలు, 13వేలు ఇచ్చిన మాట వాస్తవం కాదా?.

**బాబు సూపర్ సిక్స్ సూపర్ హిట్‌పై జగన్ అదిరిపోయే సెటైర్లు**

ఉచితం పేరిట..

ఇసుక దోపిడీ నడుస్తోంది. లిక్కర్ మాఫియా నడుస్తోంది. అమరావతి పేరిట మాపియా జరుగుతోంది. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం తగ్గుతోంది. చంద్రబాబు, ఆయన మాఫియాకు ఆదాయం పెరుగుతోంది. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి కనిపిస్తోంది. ప్రజల జీవితాలు తగలబడుతుంటే.. రోమన్ చక్రవర్తి నీరోలా చంద్రబాబు ఫిడేల్ వాయిస్తున్నారు. సూపర్‌సిక్స్ పేరిట బలవంతపు సంబురాలు చేయిస్తున్నాడు. రాష్ట్ర చరిత్రలో కనివినీ ఎరుగని అధ్యయం ఇది. చంద్రబాబు హయాంలో అప్పులు ఎగబాకాయి అని చెప్పుకొచ్చారు. చంద్రబాబు ప్రైవేటీకరణ నిర్ణయాలను అడ్డుకునేందుకు అన్నిరకాల పోరాటాలు చేస్తామన్నారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్. తాను కూడా పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటానానని వైఎస్ జగన్ తెలిపారు. ఇదేస సమయంలో పోలీసుల చేతనే రిగ్గింగ్ చేయిస్తున్నారు. అలాంటప్పుడు ఈవీఎంలు ఉంటే ఏంటి?.. పేపర్ బ్యాలెట్ పెడితే ఏంటి? అని ప్రశ్నించారు.

# సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం

-మొదటిపేజీ తరువాయి

అనంతపురంలోని ఇంద్రప్రస్తానగర్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్డీఏ కూటమి 15 నెలల పాలనా విజయాలపై ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ బంపర్ హిట్ అయ్యింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సహా టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఈ భారీ బహిరంగ సభకు హాజరయ్యారు. బుధవారం మద్యాహ్నం 3 గంటలకు సభా వేదికపైకి వస్తూనే కూటమి అగ్రనేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మాధవ్ లు సూపర్ సిక్స్ జెండాలతో ర్యాంప్ పైకి వెళ్లి పార్టీ శ్రేణులకు, ప్రజలకు అభివాదం చేశారు. జెండాలు ఊపుతూ ఉత్సాహ పరిచారు. ప్రతిగా ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి అమితమైన స్పందన కనిపించింది. ఈలలు వేస్తూ, జైసీబీఎన్, పవన్ కళ్యాణ్ అంటూ నినాదాలతో విజయోత్సవ సభా ప్రాంగణం మార్మోగింది. అనంతరం మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు రామరాజ్యం లక్ష్యంగానే కూటమి పరిపాలన సాగుతుందని ప్రకటించారు. సభా వేదిక నుంచి ఆటో డ్రైవర్లకు అనుకోని కానుకను ప్రకటించారు. దసరా రోజున ఆటో డ్రైవర్లందరి కి ఆర్థిక సాయం కింద రూ.15 వేల రూపాయల్ని అందిస్తామని స్పష్టం చేశారు. ఏటా ఈ మొత్తాన్ని ఆర్థికసాయంగా వారికి అందుతుందని స్పష్టం చేశారు. సీఎం మాట్లాడుతూ.. "అకుంఠిత దీక్షతో రాష్ట్రం కోసం పనిచేస్తున్నాం. ప్రజలకు న్యాయం చేయాలి.. రాష్ట్ర పునర్నిర్మాణం జరగాలన్నదే నా ఆలోచన పవన్ కళ్యాణ్ ఆలోచన. ప్రజల భవిష్యత్తే మాకు ముఖ్యం. రాష్ట్రానికి మంచి చేయాలనే మా సంకల్పానికి సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుంది. ప్రధాని నరేంద్ర మోదీ అన్ని విధాలలా అండగా ఉన్నారు. ఈ సభా వేదికగా ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మూడు పార్టీల కార్యకర్తలు, నేతలకు ఒకమాట చెపుతున్నా...మీరంతా కాలర్ ఎగరేసుకుని తిరిగేలా పాలన అందిస్తున్నాం. మనం పాలకులం కాదు. సేవకులం ..మనం పెత్తందారులం కాదు.. ప్రజల భవిష్యత్ కోసం పని చేసేవాళ్లం. అహంకారం, అవినీతి, అలసత్వం, అసంతృప్తి అనేది మన దరికి రానివ్వొద్దు. ఏ పొరపాటూ చేయొద్దు. జెండాలు మోసే మూడు పార్టీల కార్యకర్తలకు న్యాయం చేయడం మా బాధ్యత. ఐకమత్యంతో ఉండాలి...కలిసి ఉంటేనే మనకు బలం. పీ4 కార్యక్రమంలో అంతా భాగస్వాములు అవ్వాలని కోరుతున్నా...సమాజానికి కొంత తిరిగిద్దాం. రామరాజ్యం లాంటి పాలన ఇచ్చే బాధ్యత నాది, పవన్ కళ్యాణ్, మాధవ్ ది.

నా దృష్టిలో సీఎం అంటే చీఫ్ మినిస్టర్ కాదు...కామన్ మాన్. ఎమ్మెల్యేలు కూడా కామన్ మ్యాన్ లా ఉండాలి. ఎన్నికలకంటే మన పరపతి పెరిగింది.. ఇది శాశ్వతంగా ఉండాలి. లి ఎమ్మెల్యే తప్పు చేసినా.. కార్యకర్త తప్పు చేసినా... అధికారి తప్పు చేసినా... ప్రభుత్వానికే చెడ్డ పేరు. కూటమి పాలనలో సంక్షేమం సూపర్ హిట్..అభివృద్ధి సూపర్ హిట్. కలిసి పోటీ చేశాం. కలిసి గెలిచాం కలిసి పనిచేస్తాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

**సంక్షేమం అంటే ఓట్ల రాజకీయం కాదు**

గత పాలకులు ఓట్ల కోసమే సంక్షేమం చేశారని.. సంక్షేమం అంటే తాత్కాలిక అవసరం తీర్చడం కాదని సీఎం అన్నారు. ఈ విజయోత్సవ సభకు కారణమైన స్త్రీశక్తికి వందనం, యువత పోరాటాలకు వందనం, అండగా నిలిచిన అన్నదాతకు వందనం, ప్రతి తల్లికీ వందనం, కార్యకర్తల కష్టానికి, త్యాగానికి వందనం అని ముఖ్యమంత్రి అన్నారు. దీనిపై మాట్లాడుతూ" బాధ్యత గల ప్రభుత్వంగా ఇచ్చిన మాటను నెరవేర్చిందని చెప్పడానికే ఇక్కడకు వచ్చాం. నేపాల్ ఆందోళనల్లో 200 మంది తెలుగు వారు చిక్కుకుపోయారు. మంత్రి నారా లోకేష్ ఆర్టీజీఎస్ నుంచి పర్యవేక్షిస్తున్నందున సభకు రాలేకపోయారు. తెలుగువారిని స్వస్థలాలకు తీసుకవచ్చేలా ఆయన బాధ్యత తీసుకున్నారు. అన్ని వర్గాలతో చర్చించి 2024 ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలు తెచ్చాం. 2023, మే నెల 28న రాజమండ్రి మహానాడులో సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించాం. అదే సమయంలో కూటమి మేనిఫెస్టోతో ఎన్నికలకు వెళ్లి ప్రజా తీర్పు కోరాం. 2024 ఎన్నికలు చరిత్రను తిరగ రాశాయి. కనీ వినీ ఎరుగని రీతిలో 57 శాతం ఓట్ షేర్, 93 శాతం స్ట్రైక్ రేట్‌తో 164 అసెంబ్లీ సీట్లు గెలిపించారు. 21 లోక్‌సభ సీట్లు గెలుచుకున్నాం. ప్రతి పక్షానికి హోదా లేకుండా చేసిన మీకు అభినందనలు. గత ప్రభుత్వం ప్రజావేదిక కూల్చివేతతో పాలన మొదలు పెట్టి రాష్ట్రాన్ని అగాథంలోకి నెట్టివేసింది. రూ. 10 లక్షల కోట్ల అప్పులు, తప్పులు, పాపాలు, అక్రమాలు, వేధింపులు, దోపిడీలు, దౌర్జన్యాలు, మహిళలపై దురాగతాలు, అవినీతితో అంతటా అశాంతి, అభద్రత కలిగించారు. 93 కేంద్ర ప్రాయోజిత పథకాలు నిలిపివేశారు. నిరుద్యోగం, గంజాయి, డ్రగ్స్ తెచ్చిపెట్టారు. 15 నెలలుగా అనేక సవాళ్లను అధిగమించి ఒక్కో అడుగు వేస్తూ రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం. నిర్వీర్యమైన వ్యవస్థలను సరిదిద్ది...మాట ఇచ్చినట్లు అన్ని పథకాలు అమలు చేస్తున్నాం. అందులో భాగంగానే పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు మార్చే సూపర్ సిక్స్ అమలుచేశాం.అందరి సహకారంతో సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసి మాట నిలబెట్టుకున్నాం. "అని ముఖ్యమంత్రి అన్నారు. "సూపర్ సిక్స్ అంటే హేళన చేశారు. పింఛన్ల పెంపు అంటే అసాధ్యం అన్నారు. పిల్లలందరికీ తల్లికి వందనం అంటే ట్రోల్ చేశారు. మెగా డీఎస్సీ అవ్వదన్నారు... దీపం వెలగదన్నారు... ఫ్రీ బస్సు కదలదన్నారు. ఇవన్నీ నిజం చేశాం. కోట్ల మంది లబ్ది పొందారు. ఏ వ్యక్తి జీవితాన్ని అయినా, ఏ కుటుంబ స్థితిగతులను అయినా మార్చేది చదువు. ప్రతి పేద బిడ్డా చదవాలని 'తల్లికి వందనం' తీసుకువచ్చాం. ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా, పరిమితులు లేకుండా అందరికీ రూ. 15 వేలు చొప్పున అందించాం. 67 లక్షల మంది విద్యార్థుల చదువులకు ఒకేసారి రూ.10 వేల కోట్లు ఇచ్చాం. ఇది 10 వేల కోట్ల పథకం కాదు...మీ బిడ్డల బంగారు భవిష్యత్ కు ప్రభుత్వం పెడుతున్న పెట్టుబడి. తల్లుల నమ్మకాన్ని నిలబెట్టాం కాబట్టే 'తల్లికి వందనం' సూపర్ హిట్. నాడు బాబే మీ డ్రైవర్ అన్నాను. చెప్పినట్లు గానే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. నా తెలుగింటి ఆడబిడ్డల సంతోషమే నా సంతోషం. ఉపాధి, వైద్యం, కాలేజీ, ఆలయం... ఎక్కడికైనా నా ఆడబిడ్డలు దర్జాగా వెళ్లి రావొచ్చు. ఇప్పటివరకు 5 కోట్ల మంది ఫ్రీ బస్సు ఎక్కారు. రూ.175 కోట్ల మేర మహిళలకు ఆదా అయ్యింది. మీకు ఆర్థిక వెసులుబాటును, గౌరవాన్ని పెంచేందుకు తెచ్చిందే స్త్రీ శక్తి. ఫ్రీ బస్ జెట్ స్పీడుతో దూసుకెళ్తోంది కాబట్టే 'స్త్రీశక్తి' సూపర్ హిట్ అయ్యింది. రైతు బాగుంటేనే సమాజం బాగుంటుంది. ఎన్డీఏ కూటమికి రైతే రాజు. మనకు అన్నంపెట్టేది అన్నదాత. రైతన్నకు అండగా ఉండేందుకే అన్నదాత సుఖీభవ పథకం తెచ్చాం. కేంద్రంతో కలిసి ఏడాదికి 3 విడతల్లో రూ. 20 వేలు ఇస్తామన్నాం. తొలి విడతగా ఇప్పటికే రూ. 7 వేలు ఇచ్చాం. 47 లక్షల మంది రైతులకు రూ.3,173 కోట్లు జమ చేశాం. అనంతపురం రైతాంగానికి నీళ్లు అందాయి. ఏ రైతుకు యూరియా కొరత రానివ్వకుండా నేను బాధ్యత తీసుకుంటాను. కేంద్రం మన అవసరం మేరకు యూరియా అందిస్తోంది. ఆర్థిక కష్టాలున్నా...అండగా నిలిచాం కాబట్టే అన్నదాత సుఖీభవ సూపర్ హిట్ అయ్యింది. ఉమ్మడి రాష్ట్రంలో దీపం పథకం తెచ్చి మహిళల వంటింటి కష్టాలు తీర్చాం. నేడు మళ్లీ దీపం-2 పథకం ద్వారా ఉచితంగా ఏటా 3 సిలిండర్లు ఇస్తున్నాం. ఇప్పటికే రూ.1704 కోట్లు ఖర్చు చేసి... 2.45 కోట్ల ఉచిత సిలిండర్లు మహిళలకు ఇచ్చాం. ప్రతీ ఇంటా వెలుగులు నింపాం కాబట్టే... 'దీపం 2' సూపర్ హిట్ అయ్యింది. 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పాం. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులు ఏడాదిలోనే భర్తీ చేశాం. ఒక్క రూపాయి అవినీతి లేకుండా మెరిట్ ఆధారంగా ఇచ్చాం. యువత అండగా ఉంటే కొండలను బద్దలు కొడతాం. నైపుణ్య శిక్షణ ద్వారా 1 లక్ష మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చాం.

## నేపాల్ నుంచి ప్రత్యేక విమానంలో ఏపీ వాసులను తీసుకొస్తాం

-మొదటిపేజీ తరువాయి

అక్కడ ఉన్న రాష్ట్ర వాసులతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నాం. ఏపీ భవన్‌లో టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి నేపాల్‌లోని తెలుగువారిని గుర్తించాం. మా దగ్గర ఉన్న సమాచారం ప్రకారం.. వేర్వేరు ప్రాంతాల్లో 217 మంది రాష్ట్ర వాసులు ఉన్నారు. కాఠ్‌మాండూ నుంచి గురువారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో వారందరినీ రాష్ట్రానికి తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటాం. నేపాల్‌లో ఉన్న ప్రతి ఆంధ్రుడు ఏపీకి చేరేలా ప్రయత్నిస్తున్నాం. నేపాల్ నుంచి వచ్చే ప్రత్యేక విమానం విశాఖ, కడపకు చేరుకుంటుంది" అని మంత్రి వివరించారు.

## జగన్ పాలనలో రైతుల నరకం

-మొదటిపేజీ తరువాయి

పెట్టి, ఇన్సూరెన్స్ డబ్బులు ఆపేసి, పంటలు అమ్మకానికి రాకుండా చేసిన వైసీపీ వైఫల్యాలను ప్రజలు మరచిపోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు తోడుగా నిలబడి విత్తనాల నుంచి పంట అమ్మకాల వరకు పూర్తి సహకారం అందిస్తోందని అన్నారు. ఎరువులు, విత్తనాలు సమయానికి అందిస్తూ, పంటలకు రుణ సౌకర్యం కల్పిస్తూ, రైతు కుటుంబాలను రక్షించేలా పథకాలను అమలు చేస్తోందన్నారు. దీనిపై ధైర్యం ఉంటే జగన్ పబ్లిక్ డిబేట్‌కు రావాలని సవాల్ విసిరారు. ఎవరికి రైతుల పట్ల నిజమైన నిబద్ధతుందో ప్రజలే తీర్పు చెబుతారు అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతాంగానికి ఊరట కల్పించే విధంగా అద్భుతమైన నిర్ణయాలు తీసుకుంటూ, ఎరువుల సరఫరా, పంట కొనుగోళ్లు, మద్దతు ధరలు, రుణమాఫీ వంటి కీలక అంశాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్న కూటమి ప్రభుత్వంపై జగన్ ఆరోపణలు చేయడం విచిత్రమని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్, తన ఐదేళ్ల పాలనలో రైతాంగాన్ని మోసం చేసి, నేడు తప్పుడు ఆరోపణలు చేసి మళ్లీ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైతు సంక్షేమం అంటే జగన్ కు ఏమాత్రం పట్టులేదని ఆయన పాలనలోనే స్పష్టమైందన్నారు. ఎరువుల కొరత, నల్లబజారు, కొనుగోలు కేంద్రాల వద్ద నిర్లక్ష్యం, పంట బీమా చెల్లింపులలో మోసాలు ఇవన్నీ జగన్ పాలనలోనే జరిగాయని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల కోసం రాత్రింబవళ్ళు శ్రమిస్తుంటే, జగన్ మాత్రం ప్రతిదాన్నీ కుతంత్రం చేసి అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రైతుకు అందుతున్న ప్రతి సహాయం జగన్ కంటకంగా మారిందని మంత్రి అన్నారు. ధరల స్థిరీకరణ నిధి పేరుతో 3 వేల కోట్లు ఏర్పాటు చేశామని, 7,800 కోట్లు ఖర్చు పెట్టామని జగన్ చెబుతున్నారు. అసలు మార్కెట్‌లో ధరలు పడిపోకపోయినా 7,800 కోట్లు ఎక్కడికి పోయాయి? రైతులకు ఒక్క పైసా ఉపయోగం లేకుండా ఆ డబ్బు ఎవరెవరి జేబుల్లోకి వెళ్లింది? ఇవన్నీ పచ్చి అబద్ధాలు. వైసీపీ హయాంలో రైతుల ఉత్పత్తుల కొనుగోలు అనే మాటే లేదు. నిజంగా కొనుగోలు చేసి ఉంటే ఏ రైతు నుండి, ఏ పంటను, ఏ ప్రాంతంలో కొనుగోలు చేశారో కాగితాలతో చూపించగలరా? లేకపోతే అబద్ధాల గజిబిజి నుంచి బయటపడగలరా?" అని సవాల్ విసిరారు. %ఎణ% బర్లీ పొగాకు ధర పడిపోతే 271 కోట్లు వెచ్చించి 20,000 మిలియన్ కిలోలు కొనుగోలు చేసేందుకు నిర్ణయించి, ఇప్పటికే 16,000 మిలియన్ కిలోలు కొనుగోలు చేసామని తెలిపారు. ఇంకా మిగిలిన 4000 మిలియన్ కిలోలను కూడా కొంటామని, ఇంకో 60వేల మిలియన్ కిలోలను ప్రైవేట్ వర్తకుల ద్వారా కొనుగోలు చేయించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి 3 సందర్భాలలో టొమాటో ధర పడిపోతే, 4599 మెట్రిక్ టన్నుల టొమాటో పంటను కొనుగోలు చేసి 11.25 కోట్లు రైతులకు చెల్లించామని అన్నారు.

ఉల్లి ధరల విషయంలో మీరు ముసలి కన్నీరు కారుస్తున్నారు. మా ప్రభుత్వం మద్దతు ధరగా రూ.1200 ప్రకటించింది. ఈనాడు పత్రికలో వెలువడింది. కానీ మీరు ఒకవైపు రూ.1200 మద్దతు ధర అని చెబుతారు, మరోవైపు రూ.300కే కొనుగోలు జరుగుతోందని అంటారు... అసలు మద్దతు ధర విధానం మీకు తెలుసా? తెలుసుకునే తెలివి ఉన్నదా? మద్ధతు ధర కన్నా మార్కెట్ లో అమ్ముడుపోయినటువంటి విలువ తగ్గితే ఆ వ్యత్యాసాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. మార్కెట్ లో 300 రూ ట్రేడ్ అయితే మిగతా 900రూ ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ ప్రాథమిక జ్ఞానం కూడా లేని మీరు అసలు మాజీ ముఖ్యమంత్రివేనా?" అని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో రైతుల ధాన్యం కొనుగోలు చేసినా డబ్బులు ఇవ్వలేదు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బకాయి పడ్డ నగదును రైతులకు అందచేశామని, రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి, 24 గంటల్లోపే నగదు రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత మాది అని మంత్రి గుర్తుచేశారు. 2016లో ఉల్లి ధరలు పడిపోతే 7723 మంది రైతులనుండి 2.77 లక్షల క్వింటాళ్ళు కొనుగోలు చేసి 7కోట్ల రూపాయలు రైతులకు చెల్లించామని అన్నారు. 2018లో మరొక సారి 9740 మంది రైతుల నుండి 3.48 లక్షల క్వింటాళ్ళ ఉల్లి కొనుగోలు చేసి 6.45 లక్షలు చెల్లించామని, 2020 సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వంలో ఉల్లి ధరలు పడిపోతే, నామ మాత్రంగా క్వింటాకి రూ.770/-లు మద్దతు ధర ప్రకటించి, ఏ ఒక్కరి దగ్గరా ఉల్లి కొనుగోలు చేయకుండా, రైతులను మోసం చేసారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం క్వింటాకి రూ.1200/-లు మద్దతు ధర ప్రకటించి, ఇచ్చిన మాటకు కట్టుబడి, అదే ధరకు ఉల్లి కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కోకో ధరలు పడిపోతే 3776 మంది రైతుల నుండి కేజీకి రూ.50/- అదనంగా ఇచ్చి కొనుగోలు చేసాము. ఇందుకు గాను 11.8 కోట్లు చెల్లించాము. తోతాపురి మామిడి ధర పడిపోతే, 51వేల మంది రైతుల నుండి 4.3 లక్షల టన్నుల మామిడి కొనుగోలు చేసి కేజీకి రూ.4/-లు చొప్పున 171 కోట్లు చెల్లించాము. గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మిర్చీకి క్వింటాకి రూ.11,781/-లు మార్కెట్ జోక్యపు ధరను కల్పించాము. ప్రభుత్వం నుండి హామీ లభించటంతో మార్కెట్లో మిర్చీ ధర స్థిరీకరించబడి రూ.11,781/-లు కంటే అధికంగా ట్రేడ్ అయింది. దీంతో %వీ×ూ% పథకం అమలు చేయాల్సిన అవసరం రాలేదు. 2017లో మిర్చీ ధరలు పడిపోతే ప్రభుత్వం 55 వేల మంది రైతులకు క్వింటాకి రూ.1500/- చొప్పున 130 కోట్లు చెల్లించాము. అదే మీ ప్రభుత్వం హయాంలో 2020 సంవత్సరంలో మార్కెట్ ధర 12000/-లు ఉంటే మద్దతు ధర రూ.7000/-లు ప్రకటించి కొనడానికి ఒక్క పైసా కూడా కేటాయించలేదు. ఒక కార్పొరేట్ సీఎంకి సామాన్యుని తాలూకా కష్టాలు , సామాన్యులు ఉపయోగించే వస్తువుల తాలూకా రేట్లు తెలియాలి అనుకోవడం హాస్యాస్పదం. ఉల్లి ధర పడిపోయింది బహిరంగ మార్కెట్లో కేజీ 34 రూపాయలు ఉందని, ధనవంతులు ఉపయోగించే బిగ్ బాస్కెట్ లో ధరలు కనిపిస్తున్నాయి గాని సామాన్యుడు వాడేటటువంటి రైతు బజార్లో ఈ రోజు ఉల్లి ధర ఎంత ఉందనేది మాట్లాడి ఉంటే ప్రజలు సంతోషించేవారు. కేంద్ర ప్రభుత్వం యూరియా వాడకాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని చెప్పటం వలన పక్క రాష్ట్రాలలో యూరియా కొరత వలన పలు రాష్ట్రాలలో ఆందోళనలు చేయడం వలన ఏపీలో కూడా యూరియా దొరకదని భయంతో మూడు సీజన్లకు వాడాల్సిన యూరియాను ఒకే సారి రైతులు కొనుక్కోవాలి అన్న అభద్రతాభావం, యూరియా దొరకటం లేదని ఫేక్ ఫోటోలు పెట్టి రైతులు అదే నిజమనుకొని రబీ సీజన్ కు కావల్సిన యూరియాను ముందుగానే కొనుక్కోవాలని భయాన్ని వైసీపీ నేతలు సృష్టించారు. ఇటీవల ఒక నెల డ్రై స్పెల్ రావడం తరువాత విస్తారంగా ఒకే సారి వర్షాలు కురవడం వలన ఆగస్ట్ నెలలో ఒకే సారి రాష్ట్ర వ్యాప్తంగా వరి పంటను వేయడంతో ఒక 10 రోజులు రైతులు యూరియా దొరకదని భయభ్రాంతులకు గురయ్యేలా వైసీపీ వారు వాతావరణాన్ని సృష్టించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వద్ద రాష్ట్రానికి రావలసిన కేటాయింపు యూరియా కంటే అధిక మొత్తంలో అదనంగా యూరియాను కేటాయించుకొని జిల్లాలకు సరఫరా చేసి రైతులకు యూరియాను అందుబాటులో ఉంచాం. నేటికి యూరియా కొరత తీరిపోయింది. రబీ సీజన్ కు కావల్సిన 9.3 లక్షల మెట్రిక్ టన్నులను ముందస్తుగానే సిద్ధం చేసుకోవడం జరుగుతుంది. ఎరువులను బ్లాక్ మార్కెట్ కు తరలించే ఉద్దేశం కూటమి ప్రభుత్వానికి లేదు, గతంలో వైసీపీ నేతలు బ్లాక్ మార్కెట్ కు యూరియాను తరలించడంతో అందరూ అదే విధంగా వ్యవహరిస్తారని భావించడం వారి అజ్ఞానానికి నిదర్శనం అని అన్నారు. ఈ ప్రభుత్వ కాలంలో సహకార సంస్థలకు 70 % , ప్రైవేట్ వ్యాపారులకు 30 % యూరియాను కేటాయింపులు జరిపాం. గత ప్రభుత్వంలో 50-50 శాతం నిష్పత్తిలో యూరియాను పంపిణీ చేసి బ్లాక్ మార్కెట్ ను ప్రోత్సహించారని దుయ్యబట్టారు. ఆర్‌ఎస్కేలు మీ ప్రభుత్వంలో ఉన్న దాని కంటే ఈ ప్రభుత్వంలోనే ఆర్‌ఎస్కేలు ద్వారా పిఎసిఎస్ ద్వారా అధికంగా ఎరువులు వీటి ద్వారా అమ్మకాలు చేయడం జరిగింది. గత ప్రభుత్వంలో ప్రైవేట్ వ్యాపారుల దగ్గర లంచాలు తీసుకొని ఉంటారని, మీ సమయం లో కన్నా ఈ ప్రభుత్వ సమయంలోనే ఆర్‌ఎస్కే ల ద్వారా పిఎసిఎస్ ల ద్వారా అధికంగా ఎరువులు సప్లై చేసామన్న విషయాన్ని గ్రహించి మాట్లాడితే మాట్లాడితే మాజీ సీఎం జగన్ కు గౌరవం దక్కేది అని అన్నారు.

## సంపాదకీయం

# జీవవైవిధ్యానికి పుట్టిల్లు భారత్

భారత దేశం ప్రకృతి ప్రసాదించిన అరణ్య సంపదతో, జీవవైవిధ్యంతో, వన్య ప్రాణులతో విశిష్టమైన దేశంగా పేరుపొందింది. మన దేశ భూభాగంలో పర్వతాలు, నదులు, పచ్చని చెట్లు, ఔషధ మూలికలు, జంతువులు, పక్షులు సహజంగా లభించే ఈ అరణ్య సంపద మన పర్యావరణ సమ తౌల్యానికి, సాంస్కృతిక వారసత్వానికి, ఆర్థిక వ్యవస్థకు మూలం. అలాంటి అడవులను రక్షించడంలో తమ ప్రాణాలను అర్పించిన అటవీ సిబ్బందిని స్మరించుకోవడానికి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 11న జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం దేశ వ్యాప్తంగా జరుపుకుంటారు. ఈ దినోత్సవం ద్వారా వన రక్షకుల ధైర్యం, త్యాగం గుర్తు చేసుకుంటూ అడవుల విలువను జాతీయ స్థాయిలో ప్రతిపాదిస్తారు. అడవులను కాపాడటం కేవలం వృత్తిపరమైన విధి కాదు, అది ఒక సవాళ్లతో కూడిన కర్తవ్యం. అరణ్య సంపదను కాపాడే క్రమంలో ఫారెస్ట్ గార్డులు, రేంజర్లు, అధికారులు ప్రతిరోజూ అనేక కష్టసుఖాలు భరిస్తారు. వేటగాళ్లు, అక్రమ కలప మాఫియాలు, వన్యప్రాణి స్మగ్లర్లు వంటి నేరగాళ్లను అడ్డుకోవడంలో వారు నిరంతరం ప్రాణహానిని ఎదుర్కొంటారు. అనేక మంది తమ కర్తవ్యాలను నిర్వర్తించే క్రమంలో ప్రాణాలను త్యాగం చేశారు. అలాంటి వీరుల జ్ఞాపకార్థమే ఈ దినాన్ని పాటిస్తారు. ఈ దినోత్సవానికి వెనుక ఒక చారిత్రక సంఘటన ఉంది. 1730 సెప్టెంబర్ 11న రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ సమీపంలోని ఖేజర్లీ గ్రామంలో బిష్ణోయి తెగ ప్రజలు అమర త్యాగం చేశారు. అప్పటి రాజు అభయ్ సింగ్ తన రాజభవనం నిర్మాణం కోసం కలప సేకరించమని సైనికులకు ఆదేశించగా వారు ఆ గ్రామంలోని చెట్లను నరికేందుకు వచ్చారు. అప్పుడు అమృతా దేవి అనే బిష్ణోయి మహిళ చెట్లను రక్షించేందుకు అడ్డుపడింది. ఆమె ధైర్య సాహసాలను అనుసరించి గ్రామంలోని 363 మంది పురుషులు, మహిళలు, పిల్లలు చెట్లను హత్తుకొని నిలబడ్డారు. సైనికులు వారిని క్రూరంగా హత్య చేశారు. ఈ సంఘటనలో 363 మంది అమరుల త్యాగంతో చెట్లు రక్షించ బడ్డాయి. ప్రకృతిని కాపాడటానికి, పర్యావరణాన్ని నిలబెట్టడానికి ఈ బలిదానం ఎంత ముఖ్యమో ప్రపంచానికి ఈ సంఘటన చాటి చెప్పింది. ఈ స్ఫూర్తి దాయక చరిత్ర ఆధారంగానే 2001లో కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 11ను జాతీయ అటవీ అమర వీరుల దినోత్సవంగా పాటించాలని ప్రకటించింది. ఈ దినోత్సవం లక్ష్యాలు స్పష్టమైనవే. అటవీ సిబ్బంది చేసిన త్యాగాలను గుర్తించడం, వారికి గౌరవం ఇవ్వడం, అడవుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామిగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేయడం. కఠిన పరిస్థితుల్లో విధులు నిర్వహించే అటవీ సిబ్బందికి నైతిక మద్దతు ఇవ్వడం. అడవులు మన ఊపిరితిత్తులని, అవి లేకుండా మనుగడ అసాధ్యమని ప్రతీ ఒక్కరికి గుర్తు చేయడం. దేశవ్యాప్తంగా ఈ రోజు అనేక కార్యక్రమాలు జరుగుతాయి. అమర వీరుల స్మారక స్థలాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అటవీ శాఖలు ప్రత్యేక సభలు నిర్వహించి, త్యాగుల జాబితాను చదివి గౌరవం అర్పిస్తాయి. విద్యాసంస్థల్లో అరణ్య సంరక్షణ ప్రాముఖ్యతపై సదస్సులు, చర్చలు, ప్రదర్శనలు నిర్వహిస్తారు. వృక్షారోపణ కార్యక్రమాలు చేపట్టి కొత్త చెట్లను నాటుతారు. విద్యార్థులు, యువత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞలు చేస్తారు. పర్యావరణ సంఘాలు ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తాయి. ప్రస్తుతం దేశ భూభాగంలో సుమారు 21 శాతం మాత్రమే అరణ్య విస్తీర్ణం ఉంది. అది సరిపోదు. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు, వర్షాభావం, భూక్షయం పెరుగుతున్న ఈ కాలంలో అడవుల పరిరక్షణ అత్యవసరం. అటవీ అమరవీరుల త్యాగం మనకు శాశ్వత స్ఫూర్తి. ప్రకృతిని కాపాడటం అనేది మనందరి కర్తవ్యమని, మనం ప్రకృతిని రక్షిస్తేనే ప్రకృతి మనల్ని రక్షిస్తుందని ఈ దినోత్సవం మళ్లీమళ్లీ గుర్తుచేస్తుంది. కాబట్టి జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం ఒక స్మారకదినం మాత్రమే కాదు, పర్యావరణ జాగరణకు చిహ్నం. అరణ్యాలను రక్షించేందుకు, జీవ వైవిధ్యాన్ని నిలబెట్టేందుకు, వనరక్షకుల త్యాగాన్ని స్మరించేందుకు, భవిష్యత్తు తరాలకు ప్రకృతి సంపదను అందించేందుకు ప్రతి భారతీయుడి మనసులో దీపంలా వెలిగే స్ఫూర్తి. బిష్ణోయిాల త్యాగం, అటవీ సిబ్బంది ధైర్యం మనం మరవలేము. ఈ దినోత్సవం మనలో ప్రతి ఒక్కరినీ అడవులను రక్షించే కర్తవ్యానికి అంకితులను చేస్తూ, సహజ సంపద కాపాడే బాధ్యతను గుర్తు చేస్తుంది.

# సామాజిక అంతరాలపై గొంతెత్తిన గళం



ఆర్య సమాజ్ నేత, సామాజిక ఉద్యమ కారుడు స్వామి అగ్నివేశ్ (80) తెలంగాణ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇచ్చారు. దేశ వ్యాప్తంగా జరిగిన అనేక సామాజిక ఉద్యమాలకు, పోరాటాలకు వెన్నుదన్నుగా నిలిచారు. స్వామి అగ్నివేశ్ భ్రూణహత్యలు, వెట్టిచాకిరి, మహిళా సమస్యలపై, సామాజిక అంతరాలపై గొంతెత్తారు. ప్రధానంగా తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్ర సాధనకు సంపూర్ణ మద్దతు తెలపడమే కాకుండా, ఉద్యమ కార్యక్రమాలలో ప్రత్యక్షంగా పాల్గొని, ఉద్యమ కారులను బలం చేకూర్చారు. 1939 సెప్టెంబర్ 21న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళంలోని సనాతన బ్రాహ్మణ కుటుంబంలో 1939 సెప్టెంబర్ 21న జన్మించారు. ఆయన అసలు పేరు వేపా శ్యాంరావు. నాలుగేళ్లకే తండ్రి మరణించడంతో అనంతరం ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న శక్తి అనే రాజ్యంలో దివాన్ అయిన తన తాత వారింట పెరిగారు. కోల్‌కతా లోని సెయింట్ గ్జేవియర్ కాలేజీ న్యాయశాస్త్రం, వాణిజ్యంలో డిగ్రీలు సంపాదించారు. కోల్‌కతా లోని సెయింట్ జేవియర్స్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేశారు. సభ్యసాచి ముఖర్జీ అనే ప్రఖ్యాత న్యాయవాది వద్ద జూనియర్ లాయర్‌గా పనిచేశారు. ఆ తర్వాత సభ్యసాచి ముఖర్జీ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ అయ్యారు. ఆర్య సమాజ్ సూత్రాలతో 1970లో "ఆర్యసభ" అనే రాజకీయ పార్టీని స్థాపించారు. అంతేకాక, ఆయన ప్రముఖ న్యాయవాదిగా మత పరమైన సమస్యలపై మాత్రమే కోర్టులో వాదించే వారు. ఎన్నో సామాజిక సమస్యలపై పోరాటం చేశారు. ఆడపిల్ల అని తెలిస్తే భ్రూణ హత్యలు ఎక్కువగా చేయిస్తున్న రోజుల్లో అందుకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల హక్కులు, భ్రూణ హత్యలకు వ్యతిరేకంగా ఆయన పోరాటం చేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో మావోయిస్టులతో జరిగిన చర్చలకు ఆయన మధ్య వర్తిత్వం వహించారు. 1977లో హర్యానాలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అంతేగాక, మంత్రిగానూ ఆయన సేవలందించారు. విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 1981లో ఆయన మంత్రిగా ఉన్న సమయం లోనే బాలల వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించేందుకు "బాండెడ్ లేబర్ లిబరేషన్ ఫ్రంట్"ను స్థాపించారు. మాయిస్టులతో చర్చలు జరపడంలో కీలకంగ పాత్ర పోషించారు. శ్రమదోపిడీకి వ్యతిరేకంగా గళమెత్తారు. ముఖ్యంగా ఢిల్లీ చుట్టుపక్కల ఉండే క్వారీల్లో కార్మికుల శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాడారు. హత్యానేరం ఆరోపణల్లో 14 నెలలు జైలు శిక్ష కూడా అనుభవించారు. 2011వ సంవత్సరంలో దేశవ్యాప్తంగా జరిగిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో అగ్నివేష్ కూడా పాలు పంచు కున్నారు. కొందరు నిరసన కారులు తన మీద వ్యక్తిగత, రాజకీయ ఎజెండాలతో దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఆయన ఆందోళనల నుంచి విరమించు కున్నారు. 2011 సంవత్సరంలోనే మావోయిస్టులు కిడ్నాప్ చేసిన ఐదుగురు ఛత్తీస్‌గఢ్ పోలీసులను విడిపించడంలో మావోయిస్టులతో జరిపిన బృందంలో అగ్నివేష్ కూడా ఒకరు. 1970లో సన్యాసం స్వీకరించారు స్వామి అగ్నివేష్. అయితే, ఆయన మీద హిందూ వ్యతిరేక ముద్ర పడింది. ఒడిశాలోని పూరీ జగన్నాథ్ ఆలయాన్ని హిందుయేతరుల కోసం కూడా తెరవాలంటూ ఆయన డిమాండ్ చేశారు. హిందువులు అత్యంత పవిత్రంగా పూజించే అమర్‌నాథ్ శివలింగం కేవలం ఓ మంచు ముక్క అంటూ అగ్నివేష్ కామెంట్స్ చేయడంతో హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేశ్‌పై జార?ండ్ తదితర ప్రాంతాలలో ఆయనపై ఏబీవీపీ, బీజేవైఎం, బీజేపీ కార్యకర్తలు పలుమార్లు దాడులు కూడా చేశారు. అయితే, అగ్నివేష్ వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. కోట్లాది మంది మనోభావాలను దెబ్బ తీయడం సరికాదని స్పష్టం చేసింది. సెంటిమెంట్ మిళితమైన అంశాలపై మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. 2008లో ఢిల్లీలోని రామ్ లీలా మైదాన్‌లో జరిగిన జమైత్ ఉలేమా ఈ హింద్ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలకు హిందూ సంఘాల నుంచి ప్రతిఘటన ఎదురైంది. ఎవరో కొందరు ఉగ్రవాదులు చేసే తప్పుడు పనులకు మొత్తం మతాన్ని తిట్టడం సరికాదని ఆయన అన్నారు. అసలు అమెరికానే నెంబర్ వన్ టెర్రరిస్టు అని కూడా అన్నారు. అగ్నివేష్ బిగ్ బాస్‌లో కూడా పాల్గొన్నారు. 2011 సంవత్సరంలో నవంబర్ 8 నుంచి 11 వరకు హిందీ బిగ్ బాస్ హౌస్‌లో అతిథిగా ఉన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టులతో జరిగిన చర్చలకు ఆయన మధ్యవర్తిత్వం వహించారు. భిన్న మతాల మధ్య పలు అంశాలపై ఆయన వారధిగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమానికి స్వామి అగ్నివేష్ మొదటినుంచి సంపూర్ణ మద్దతుగా నిలిచి, ఉద్యమ సందర్భంలో జరిగిన సమావేశాలు, కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొన్నారు. కాలేయ సంబంధిత సమస్యతో ఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియరీ సైన్సెస్‌లో చేరి, శరీరంలో కొన్ని అవయవాలు విఫలం (మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్) చెందడంతో కొద్ది రోజులు ఆయన వెంటిలేటర్ పైనే చికిత్స పొందుతూ, 2020 సెప్టెంబర్ 11న శుక్రవారం మృతి చెందారు. ఆధ్యాత్మికం, మత పరమైన అంశాలపై స్వామి అగ్నివేశ్ పలు పుస్తకాలు కూడా రాశారు. రాజీవ్ గాంధీ నేషనల్ సద్భావనా అవార్డు, రైట్ లైవ్లీహుడ్ అవార్డులు ఆయనను వరించాయి.

# ఆల్‌ఖైదా ఉగ్రదాడి మరువగలమా!



సెప్టెంబరు 11 ఘటనగా పేరెన్నిక గన్న న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ మీద దాడి జరిగి నేటికి 24 ఏళ్లు గడిచింది. ఈ సంఘటన ద్వారా బిన్ లాడెన్ గురించి ప్రపంచానికి మొత్తం తెలిసింది. అయితే కార్యాన్ని తన చేతుల మీద నిర్వహించిన వ్యక్తి లాడెన్ కాగా దీనికి సూత్రధారి మాత్రం వేరే ఉన్నాడు. 2001 సంవత్సరం సెప్టెంబరు 11న మంగళ వారం ఉదయం 8.45కు అమెరికా దేశంలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ పైన లాడెన్ టీమ్ జరిపిన దాడులను చరిత్ర అంతత్వరగా మరవలేదు. ప్రపంచ దేశాలన్నీ ఒక్కసారిగా ఈ ఘటన కారణంగా ఉలిక్కి పడ్డాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాలపై ఆల్‌ఖైదా పక్కా వ్యూహంతో జరిపిన దాడులవి. ఆ రోజు ఉదయం 10 మంది ఆల్‌ఖైదా తీవ్రవాదులు.. వాణిజ్య సేవలందించే నాలుగు ప్రయాణికుల జెట్ విమానాలను దారి మళ్లించారు. హైజాకర్లు రెండు విమానాలను న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్(ప్రపంచ వాణిజ్య సంస్థ)కు చెందిన జంట సౌధాలను ఢీ కొట్టించారు. సౌదీ అరేబియా, ఇతర అరబ్ దేశాలకు చెందిన వారే ఈ ఘటనకు పాల్పడినట్లు తర్వాతి కాలంలో గుర్తించారు. ఈ బృందానికి అప్పటి ఆల్‌ఖైదా నాయకుడు ఓసామా బిన్ లాడెన్ నేతృత్వం వహించారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై జరిగిన దాడి ఘటనలో ప్రయాణికు లందరూ, భవనాల్లో పనిచేస్తున్న అనేక మంది ఇతరులు దుర్మరణం పాలయ్యారు. రెండు సౌధాలు(భవనాలు) అందరూ చూస్తుండగానే గంటల వ్యవధిలో కుప్పకూలి పోయాయి. సమీపంలోని భవనాలు ధ్వంసం అవడం, మరికొన్ని పాక్షికంగా దెబ్బతినడం జరిగింది. మూడో విమానాన్ని హైజాకర్లు వాషింగ్టన్ డీ సీ కి వెలుపల ఉన్న ఆర్లింగ్టన్, వర్జీనియాలోని పెంటగాన్ పైకి వదిలారు. నాలుగో విమానాన్ని అందులోని కొందరు ప్రయాణీకులు మరియు విమాన సిబ్బంది తిరిగి దానిని నియంత్రించే ప్రయత్నం చేసినప్పుడు, గ్రామీణ పెన్సిల్వేనియా లోని షాంక్స్ విల్లేకి సమీపంలో ఉన్న ఒక మైదానంలో అది కుప్ప కూలింది. దీనిని హైజాకర్లు వాషింగ్టన్ డీ సీ వైపుకు మళ్లించారు. విమానాల్లో ప్రయాణించిన ఏ ఎక్కరూ ప్రాణాలతో బయట పడలేదని వార్తా సంస్థలు నివేదించాయి. 2001 సెప్టెంబరు 11 దాడుల్లో 2763 మంది బాధితులు, 19 మంది హైజాకర్లు మరణించారు. న్యూయార్క్ ప్రభుత్వారోగ్య శాఖ నివేదిక ప్రకారం, జూన్ 2019 నాటికి అగ్నిమాపక దళ సిబ్బంది మరియు పోలీసులు సహా రక్షణ చర్యల్లో పాల్గొన్న 836 మంది మరణించారు. రెండు భవనాల్లో దుర్మరణం పాలైన మొత్తం బాధితుల్లో 343 మంది అగ్నిమాపక దళ సిబ్బంది, 23 మంది న్యూయార్క్ నగర పోలీసులు, 37మంది పోర్ట్ అథారిటీలకు చెందిన పోలీసు అధికారులు ఉన్నారు. ఇంకా పెంటగాన్ భవనంపై జరిగిన దాడుల్లో అమెరికన్ ఎయిర్ లైన్స్ కు చెందిన 64 మంది, భవనాన్ని ఢీ కొన్న అమెరికన్ ఎయిర్ లైన్స్ ఫ్లయిట్ లోని 77 మందితో సహా 189 మంది ప్రాణాలు కోల్పోయారు. పెన్సిల్వేనియాలో కుప్ప కూలిన ఫ్లయిట్ లోని 44 మంది ప్రాణాలు అనంత వాయువులలో కలిసి పోయాయి. మరణించిన వారిలో అత్యధికులు సాధారణ పౌరులే. వారిలో 78 కి పైగా ఇతర దేశాలకూ చెందిన వారున్నారు. సెప్టెంబర్ 11 దాడుల కుట్ర వెనుక ప్రధాన సూత్రధారి ఖలీద్ షేక్ మహ్మద్. 1996లో అతను తన వ్యూహాన్ని ఒసామా బిన్ లాడెన్‌కు వివరించాడు. ఆ సమయంలో, బిన్ లాడెన్ మరియు అల్ ఖైదాలు మార్పు దశలో ఉన్నాయి. సూడాన్ నుంచి తిరిగి ఆఫ్ఘనిస్తాన్‌కు మకాం మార్చు కున్నారు. 1998 ఆఫ్రికన్ దౌత్య కార్యాలయంపై బాంబు దాడులు మరియు బిన్ లాడెన్ యొక్క 1998 ఫత్వా ఒక మలుపును గుర్తించాయి. అంటే బిన్ లాడెన్... అమెరికా సంయుక్త రాష్ట్రాలపై దాడులకు కుట్ర పన్నే యోచనలో ఉన్నట్లు అర్థమైంది. 1998లో విమానాల దారి మళ్లింపుకు వ్యక్తులకు శిక్షణ ఇవ్వడం సహా యూ.ఎస్. ఏ లో దాడులకు అల్‌ఖైదా సన్నద్ధమవుతోందని అధ్యక్షుడు బిల్ క్లింటన్‌కు డైరెక్టర్ ఆఫ్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ తీవ్రవాద నిరోధన కేంద్రం తెలిపింది. అమెరికా రక్షణ శాఖ ఎంతో శక్తివంతమైనది, సీఐఏ ఎంతో ముందు చూపు కలిగి ఉన్నదైనప్పటికీ ఆల్‌ఖైదా టీమ్ పక్కా ప్రణాళికతో అనుకున్న విధంగా వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పైన దాడులు జరప గలిగింది. 9/11సంబంధిత కమిషన్ 2004 జూలై 22న సమర్పిత తమ నివేదికలో, దాడుల కుట్ర వెనుక ప్రధాన సూత్రధారి వ్యూహ కర్తగా, ఖలీద్ షేక్ మహ్మద్ అని పేర్కొంది. ఈ సంఘటనకు బాధ్యుడని ప్రకటించుకున్న బిల్ లాడెన్ మే 2, 2011 నాడు యూఎస్ బలగాలు, పాకిస్తాన్‌లో లాడెన్ తల దాచుకున్న స్థలాన్ని గుర్తించి, లాడెన్ ను హత మార్చాయి. వి7 బిలియన్ డాలర్ లను ఆ నాటి బాధిత కుటుంబాలకు 2001 నుండి 2004 వరకు అందజేశారు. 18, 2001 డిసెంబర్ 18న అమెరికన్ కాంగ్రెస్ సెప్టెంబర్ 11వ తేదీని ఆ నాటి మృతుల జ్ఞాపకార్థం దేశభక్తుల దినంగా ఆమోదించింది. 2009లో అమెరికన్ కాంగ్రెస్, సేవ మరియు జ్ఞాపక దినంగా ప్రకటించింది.

## చైనా-ఇండియా బంధం బలపడేనా?

ప్రపంచ రాజకీయ వాతావరణం వేగంగా మారిపోతున్న తరుణంలో, ఆసియాలోని రెండు అతిపెద్ద దేశాలైన భారతదేశం, చైనాల మధ్య సంబంధాలు కొత్త మలుపు తిరిగాయి. భారతీయ ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకంగా 50% టారిఫ్‌ల భారం మోపిన వేళ.. ఎస్‌సీఓ వేదికగా భారత్, చైనా మైత్రీబంధం బలపడటం వేగంగా మారుతున్న అంతర్జాతీయ పరిణామాలకు దర్పణం పట్టింది. దాదాపు ఏడేళ్ల తర్వాత మోడీ చైనాలో పర్యటించడం విశేషం. గల్వాన్ ఘటన తర్వాత ఉద్రిక్తతకు నిలయంగా మారిన సరిహద్దు సమస్యను పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వంతో పరిష్కరించుకునేందుకు భారత్, చైనా ముందుకొచ్చాయి. షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సు సన్నాహక భేటీలో భాగంగా భారత ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భారత్-చైనా సంబంధాల్లో పరస్పర మైత్రి బంధం బలపడడం ఆర్థిక స్వావలంబన, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి కోసం ఆసియా దేశాలు వెతుకుతున్న దారిని ప్రతిబింబిస్తుంది. భారతీయులకు టూరిస్ట్ వీసాలు జారీ చేయడానికి చైనా ముందుకు రావడం, నేరుగా విమాన సర్వీసులను పునరుద్ధరించే ప్రక్రియ మొదలవడం వంటి నిర్ణయాలు పటిష్ట ద్వైపాక్షిక సంబంధాలకు దోహద పడతా యి. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు సంకీర్ణ ప్రపంచ రాజకీయాల నడుమ భారత్-చైనా వ్యూహాత్మక భాగస్వా మ్యాన్ని బలపరుస్తున్నాయి. ఈ భేటీలో ఒక ముఖ్యమైన అంశం మూడో దేశ జోక్యాన్ని అనుమతించకుండా, పరస్పర వ్యూహాత్మక సార్వభౌమత్వాన్ని గౌరవించుకోవాలని ఇరుదేశాల మధ్య అంగీకారం ఏర్పడింది. ఇది భారతదేశం, చైనా రెండూ తమ స్వతంత్రతను కాపాడుకుంటూనే, పరస్పర ప్రయోజనాల కోసం కలిసి పని చేయాలన్న ధృఢ సంకల్పానికి సంకేతం. అలాగే ఈ సమావేశంలో చర్చకు వచ్చిన మరో అంశం, చైనా కంపెనీలకు భారత్‌లో అవకాశాలు కల్పించడం ద్వారా విద్యుత్ వాహన రంగాన్ని వేగంగా అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టడం. భారతదేశంలో పెరుగుతున్న ఇ-వాహన అవసరాన్ని తీర్చడంలో ఈ సహకారం కీలక పాత్ర పోషించగలదు. ఇరుదేశాల మధ్య పునర్నిర్మిత మైత్రి వాతావరణం, భారత్‌కు బ్రిక్స్, ఎస్‌సీఓ వంటి అంతర్జాతీయ వేదికలపై మరింత బలమైన నాయకత్వాన్ని అందించే అవకాశాన్ని తెలియజేస్తుంది. చైనా నుండి వస్తున్న మద్దతు, భారతదేశం విశ్వవ్యాప్తంగా ప్రభావాన్ని పెంచే అవకాశాలను ప్రసారం చేస్తోంది.

# మాయం అయి పోతున్నడమ్మా.. మనిషి అన్నవాడు.. మచ్చుకు అయిన లేడు చూడు మానవత్వం ఉన్నవాడు

**జి.కొండూరు:(సెప్టెంబర్ 10,ప్రజా జ్యోతి ప్రతి నిధి):** మాయం అయి పోతున్నడమ్మా.. మనిషి అన్నవాడు..! మచ్చుకు అయిన లేడు చూడు మానవత్వం ఉన్నవాడు, అనే ఈ పాట ప్రస్తుతం కాలానికి సరిగ్గా సరిపోతుంది. కొన్ని కొన్ని ఘటనలు చూస్తే, అది నిజమే అనిపిస్తుంది. కొంతమంది చేసే పనులకు మనం ఊర్లల్లో బతుకుతున్నమా..? అడవిలో బతుకతున్నామా అనే అనుమానం రాక మానదు..! .... నేటి కాలంలో కుటుంబంలో అయినా సమాజంలో అయినా... ఏమైనా ఆపద వస్తే మనిషికి మనిషికి తోడు ఉంటూ నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ వారికి ధైర్యం చెబుతూ... అండగా నిలిచేవారు. ఒకరికి ఒకరు గౌరవిస్తూ సమాజం పట్ల మంచి మార్గంలో నడుస్తూ... నేటి తరానికి ఆదర్శవంతులుగా నిలిచేవారు. కుటుంబంలో అమ్మా..... నాన్న....అక్క అనే బంధాలతో,ప్రేమగా ఆప్యాయతగా ఉండేవారు.అలాగే సమాజం పట్ల స్త్రీలను గౌరవిస్తూ... వారికి తగిన ప్రాధాన్యత కల్పించేవారు.అలాగే కష్టకాలంలో ఉంటే ఒకరికి ఒకరు తోడుగా చేయి....చేయి కలిపి భరోసా కల్పించేవారు. .......కానీ నేటి కాలంలో మనిషి మనుగుడా అనేది రాను....రాను దిగజారిపోతుందని అనడంలో ఆశ్చర్య పడక్కర్లేదు. స్వార్థం ....ద్వేషం... అసూయతో మనిషి నేటి కాలంలో జీవనం సాగిస్తున్నారు .ప్రేమ.... ఆప్యాయత బంధాలతో కాకుండా.. ..స్వార్థంతో ప్రపంచాన్ని ఏర్పరచుకొని మనిషి మృగంలా బతికేస్తున్నారు.సమాజం పట్ల ఏమాత్రం విలువలు లేకుండా, స్త్రీల పట్ల ఏమాత్రం గౌరవం లేకుండా, మంచి...చెడు ఆలోచించకుండా స్త్రీలపై అత్యాచారాలు చేస్తూ నిండు ప్రాణానికి బలికి కారణమవుతున్నారు. సమాజంలో ఎవరికైనా ఆపద వస్తే తన స్వార్థం వెతుక్కుంటూ.... కళ్ళ ఎదుటే అన్యాయాలు చేస్తున్న నిస్వార్థంగా పట్టించుకోకుండా ఉంటున్న వ్యక్తులు ఈ సమాజంలో ఉంటున్నారు.కుటుంబంలో అమ్మ... నాన్న... అక్క... చెల్లి...తమ్ముడు అనే బంధాలు చూడకుండా ఆస్తి కోసం,భూమి కోసం తనను తానే మోసం చేస్తూ బతికేస్తున్నాడు మనిషి .సమాజం పట్ల ఏమాత్రం కరుణ లేకుండా కఠినంగా తయారవుతూ,విలువల లేని బంధాలతో సమాజం పట్ల ఒంటరిగా మిగిలిపోతున్నాడు మనిషి!మంచి చేయాలనే ఆలోచన విధానం కంటే!చెడు మార్గంలోనే ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తూ ఆ మార్గంలోనే ప్రయాణం చేస్తూ, మాయమైపోతున్నాడమ్మ మనిషన్నవాడు అనే విధంగా మనిషి



నేటి కాలంలో జీవిస్తున్నాడనడంలో....సందేహం లేదు!

# సూపర్ సిక్స్ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత

**జి.కొండూరు:(సెప్టెంబర్ 10,ప్రజా జ్యోతి ప్రతి నిధి):** ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ బుధవారం అనంతపురం జరిగిన సూపర్ సిక్స్ సభలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ,గత ప్రభుత్వ విధ్వంసం నుంచి వికాసం వైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పీఎం మోడీ ఆశీస్సులతో దార్శనికులు సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అడుగులు వేస్తుందన్నారు. అలాగే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నట్లు పేర్కొన్నారు.ప్రతి రైతుకూ పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20,000ల ఆర్థిక సాయం, అలాగే తల్లికి వందనం ఇంట్లో ఎంత మంది చదువుతుంటే అంతమందికి ఏడాదికి రూ.15,000లు, దీపం 2.0 కింద ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు, రాష్ట్ర వ్యాప్తంగా 204 క్యాంటీన్లలో రూ.5కే టిఫిన్ భోజనం, ఎన్టీఆర్ భరోసా కింద నెలనెలా రూ.4 వేలు నుంచి రూ.15 వేల వరకు పింఛన్లు, స్త్రీ శక్తి కింద ప్రతి మహిళకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, యువతకు 8 లక్షల ఉద్యోగాలకు ఒప్పందాలు, మెగా డీఎస్సీ పోస్టుల భర్తీతో కూటమి ప్రభుత్వం ఏపిలో అభివృద్ధితో పాటు, పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే వసంత తెలిపారు.ఏపీలో కూటమి ప్రభుత్వానికి ప్రజల సంపూర్ణ మద్దతుకు నిదర్శనంగా ఈ సభ నిలిచిందని,ఈ సభకు తరలివచ్చిన అశేష జనవాహినికి కృతజ్ఞతలు తెలిపారు.



# మహిళల భద్రతసాధికారతపై సంకల్ప కార్యక్రమం


**మహిళల సాధికారత కోసమే మిషన్ శక్తి పథకం**
**జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్**


**అన్నమయ్య జిల్లా సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి రిపోర్టర్ రాణా ప్రతాప్)** మహిళల భద్రత మరియు సాధికారతను పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకాన్ని ప్రారంభించిందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి పథకంలో భాగంగా సంకల్ప కార్యక్రమాన్ని జిల్లాలో 2 సెప్టెంబర్ నుండి సెప్టెంబర్ 12 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా బుధవారం రాయచోటి కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ నందు నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళల భద్రత మరియు రక్షణ కోసం ప్రభుత్వం వివిధ రకాల పథకాలను, చట్టాలను, ఏర్పాటు చేయడం జరిగిందని వీటన్నింటి పై అవగాహన, సద్వినియోగం చేసుకోవడం కోసం మిషన్ శక్తి పథకంలో భాగంగా సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాల నందు బేటీ బచావో బేటీ పఢావో, మహిళల భద్రత, చట్టపరమైన అవగాహన, ఉన్నత విద్య, వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, మహిళలు కౌమార బాలికల ఆరోగ్యము, పోషకాహారం, సమాజంలో జరిగే క్రైమ్ లు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే సమాజంలో మన చుట్టూ మహిళలపై జరిగే అక్రమాలను ప్రశ్నించే విధంగా, చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా మహిళలు ముందుకు రావాలని కోరారు. అలాగే ఈ అవగాహన కార్యక్రమాల నందు సిడిపిఓలు,ఆశా వర్కర్లు, అంగన్వాడీలు ముందుగా పూర్తి అవగాహన కలిగి ఉండాలని అలాగే వారికి అవగాహన కల్పించే సమయంలో అందరికీ చేరే విధంగా వివిధ రకాల మాధ్యమాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిని హైమావతి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, సిడిపిఓలు,ఆశా వర్కర్లు, అంగన్వాడీ లు తదితరులు



పాల్గొన్నారు.

# చిల్లంగిలో డివిజన్ అధ్యక్షుడు కాళ్ల భద్రాచలం అధ్యక్షతన విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం





**కాకినాడ జిల్లా కిర్లంపూడి ప్రజా జ్యోతి రిపోర్టర్ స్వామి** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే త్వరలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మిరియాల బాలకాశీ,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు అన్నారు.కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం చిల్లంగిలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జగ్గంపేట డివిజన్ అధ్యక్షుడు కాళ్ల భద్రాచలం అధ్యక్షతన కాంట్రాక్ట్ ఉద్యోగులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర కార్యదర్శి మిరియాల కాశీ,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కాలం గడుస్తున్న రాష్ట్రంలో ఉన్న 26 వేల మంది విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు.నారా లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ సంస్థలో కాంట్రాక్ట్ కార్మికులను విలీనం చేసి రెగ్యులైజ్ చేయాలని డిమాండ్ చేశారు.కనీసం ప్రస్తుతానికి తెలంగాణ మాదిరిగా అయిన సంస్థలో విలీనం చేసి ఉపశమనం కలిగించాలని, షిఫ్ట్ ఆపరేటర్లకు సేఫ్టీ కిట్స్ ఇవ్వాలని అలాగే కాంట్రాక్ట్ ఉద్యోగి ఎవరైనా చనిపోతే వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు.రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకి ఉద్యోగ భద్రత కల్పించాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని అన్నారు.ఈ నెల 15న పవర్ జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టనున్న నిరసన కార్యక్రమంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరూ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యూనియన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, తాడేపల్లిగూడెం సెక్రెటరీ సత్యనారాయణ,జగ్గంపేట డివిజన్ ఉపాధ్యక్షుడు సాల్మన్ రాజు,ట్రెజరర్ రంగబాబు,దుర్గ రమేష్, సతీష్ కుమార్,గంగాధర్,రాజేష్,శివ గణేష్ తదితరులు సమస్యలపై మాట్లాడారు.

## పందులు బాబోయ్ పందులు



**ఎన్టీఆర్ జిల్లా సెప్టెంబర్ 10,ప్రజాజ్యోతి ప్రతినిధి,జి,** కొండూరు:ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు గ్రామంలో గవర్నమెంట్ హాస్పిటల్ వెళ్లే 7 వార్డ్ దారిలో పందులు విచ్చలవిడిగా.... స్వైరవిహారం చేస్తున్నాయి.కాలీ స్థలంలో పేరుకుపోయిన మురుగు నీరు-చెత్త వలన పందుల చేరడంతో దుర్వాసన వెలువడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పందుల కారణంగా దోమలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయని,వీటివలన సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పందులు ఇళ్లలోకి చొరబడి పిల్లలను గాయపరుస్తున్నాయని వాపోతున్నారు.అలాగే గవర్నమెంట్ హాస్పిటల్ కు వచ్చే-వెళ్లే వారు రోగులను పందులు ఇబ్బంది పెడుతున్నాయని,పందులు పెంపకం దారులు దగ్గర పందులు పెంచుకోకుండా, కాలి స్థలం లో వదిలేసారని,ఈ విషయమై ఉన్నత అధికారులుకు చెప్పిన గతంలో స్పందించలేదని స్థానికులు వాపోతున్నరు. ఇప్పటికైనా స్థానిక అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

## సూపర్ సిక్స్ సూపర్ హిట్ బహిరంగ సభకు భారీగా బయలుదేరిన గుంతకల్లు టిడిపి నాయకులు

**జండా ఊపి బస్సులను ప్రారంభించిన గుమ్మనూరు నారాయణస్వామి**



**గుంతకల్లు సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):** బుధవారం అనంతపురం పట్టణం నందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమానికి గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు మరియు గుంతకల్లు పట్టణ ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణంలోని నాలుగవ వార్డు మాజీ కౌన్సిలర్ ఎన్.ప్రమీల మ్మ, వార్డు ఇన్చార్జి ఎన్.రవి కుమార్ ఆధ్వర్యంలో నాలుగో వార్డు నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నగర్ నందు సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభకు బయలుదేరుతున్న మూడు బస్సులను గుమ్మనూరు నారాయణ స్వామి,ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బూచి రాంప్రసాద్ జండా ఊపి బస్సులను ప్రారంభించి సభకు బయలుదేరి వెళ్లారు. ఈ సభకు నాలుగో వార్డు నుండి ప్రజలు భారీ ఎత్తున బయలుదేరి వెళ్లారు.

## స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర పురోగతిని సమీక్షించిన జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్




**గుంతకల్లు సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):** స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర పురోగతిని సమక్షంలో భాగంగా బుధవారం జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ పట్టణం లోని భాగ్యనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు.ఈ పర్యటనలో ఆయన ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరు,రికార్డుల నిర్వహణ,రోగులకు అంది స్తున్న సేవలపై ఆరా తీశారు. ముఖ్యంగా,స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి సంబంధిం చిన పురోగతిని,దాని అమలు ను ఆయన నిశితంగా పరిశీలిం చారు.పట్టణ ఆరోగ్య కేంద్రం పరిసరాల పరిశుభ్రత,రికార్డు ల నిర్వహణను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి వైద్యులు, సిబ్బందితో మాట్లాడిన డాక్టర్ యుగంధర్,ప్రజల్లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించా ల్సిన ఆవశ్యకతను వివరించా రు.ఈ విషయంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని సూచించారు.హాజరు పట్టిక తో పాటు,ఇతర ముఖ్యమైన రికార్డులను కూడా ఆయన పరిశీలించారు.పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ,భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ప్రజలకు నిరంతరం మెరుగైన వైద్య సేవలు అందిం చాలని కోరారు.ఈ తనిఖీలో డాక్టర్ గంగాధర్,డాక్టర్ అరుణ,డాక్టర్ హరిత పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణ ఆరోగ్య కేంద్రం తిలక్ నగర్ మరియు సత్య నారాయణపేట ను సందర్శించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సజీవ్, ఫార్మసీ ఆఫీసర్లు, స్టాఫ్ నర్స్ లు, ల్యాబ్ టెక్నీషియన్ యం వో అసిస్టెంట్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మైలవరం నియోజకవర్గ అభివృద్ధి కోసం జనసేన పార్టీ ఎదుగుదల కోసం అక్కల గాంధీ నిరంతర కృషి



**జి.కొండూరు:(సెప్టెంబర్ 10,ప్రజా జ్యోతి ప్రతి నిధి):** ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజవర్గ జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గం ఇంచార్జ్ అక్క రామ్మోహన్ రావు(గాంధీ ) జనసేన పార్టీ ఎదుగుదల కోసం నిరంతరం కృషి చేస్తున్నారు.గత ఎన్నికల్లో నియోజవర్గంలో గ్రా, గ్రామాన తిరిగి, యువతను.. .మహిళలను, కలిసి జనసేన పార్టీ స్థితిగతుల గురించి అవగాహన కల్పించి,పార్టీ పెరుగుదలకు కృషి చేశారు. నియోజవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి అయిన.... 10 నుంచి 16 వేల వరకు ఎన్నికల్లో మెజార్టీ వచ్చిన సందర్భాలు ఉన్నాయి.కానీ గత ఎన్నికల్లో మాత్రం తెలుగుదేశం పార్టీ , జనసేన పార్టీ ,భారతీయ జనతా పార్టీ కూటమిగా ఏర్పడి,తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పోటీ చేసిన సమయంలో.... నియోజవర్గంలో జనసేన పార్టీ ఓటు బ్యాంకు వసంత వెంకటకృష్ణ ప్రసాద్ మెజార్టీకి ఎంతో దోహద పడిందని చెప్పవచ్చు. ఇటు శాసన సభ్యుడిగా వసంత వెంకటకృష్ణ ప్రసాద్ కూడా... నియోజవర్గంలో జనసేన పార్టీకి అధిక ప్రాధాన్యత ఇస్తూ.... నియోజవర్గంలో సహకార పరపతి సంఘ అభ్యర్థుల ఎంపిక లోను ,పలు నామినేటెడ్ పదవుల్లోనూ.... మైలవరం వ్యవసాయ మార్కెట్ యార్డు పదవిలోనూ.... జనసేన పార్టీ నాయకులకు ప్రాధాన్యత కల్పించి... గౌరపరిచారు.అలాగే ఇటు జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గ ఇంచార్జ్ అక్కల రామ్మోహన్రావు(గాంధీ),నిరంతరం మైలవరం నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం.... స్థానిక శాసన సభ్యుడితో అవగాహనతో అభివృద్ధికి తోడ్పడుతున్నారు.ఈ మధ్యకాలంలో జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విశాఖపట్నం వచ్చిన సందర్భంలో అక్కల రామ్మోహన్ రావు (గాంధీ),స్వయంగా పవన్ కళ్యాణ్ ని కలిసి మైలవరం నియోజకవర్గ సమస్యలపై పవన్ కళ్యాణ్ తో చర్చించారు. అలాగే నియోజవర్గంలో రోజు...రోజుకి జనసేన పార్టీ బలోపేతం అవుతుండడంతో నియోజవర్గంలో జనసేన పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజల భద్రత, రక్షణే ధ్యేయంగా విజిబుల్ పోలీసింగ్

**జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారి ఆదేశాలతో... ముమ్మరంగా వాహనాల తనిఖీలు.**



**(ప్రజా జ్యోతి న్యూస్) కర్నూలు సెప్టెంబర్ 10** జిల్లాలో ప్రజల భద్రత, రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం కర్నూలు పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ప్రతి రోజు సాయంత్రం జిల్లా అంతట విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా వాహనాల తనిఖీ లు చేపట్టారు. ప్రధానంగా రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన చేశారు. హెల్మెట్ / సీట్ బెల్టు ధరించాలని, డ్రంకన్ డ్రైవింగ్ లకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు సేఫ్టీ ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్నారు. విజిబుల్ పోలీసింగ్ లో వాహన చోదకులు ట్రిపుల్ రైడింగ్, వాహనానికి సరైన నెంబర్ ప్లేట్లు లేనివారిని, వాహన సంబంధిత రికార్డులు లేనివారిని, హెల్మెట్ లేకుండా మోటార్ సైకిల్ నడిపే వ్యక్తులను, సెల్ ఫోన్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిని గుర్తించి, రోడ్డు భద్రతా, మోటార్ వాహనాల చట్టం నియమ నిబంధనలు గురించి అవగాహన చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీసులు జాగ్రత్తల సూచనలు చేశారు. అదేవిధంగా గ్రామాలలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. గొడవలకు దూరంగా ఉండాలని , సైబర్ మోసాలు, మహిళలపై నేరాలు, బాల్యవివాహాలు, కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యత పై అవగాహన చేశారు. ,గంజాయి , మత్తు పదార్థాల వలన కలిగే అనార్థాల గురించి ప్రజలకు వివరించారు . అదేవిధంగా ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు సూచించారు.

# తోపుడుబండ్ల మీద చిన్న వ్యాపారస్తులను బ్రతకనివ్వండి




**(ప్రజా జ్యోతి న్యూస్) సెప్టెంబరు 10** కర్నూల్ : పండ్లు అమ్ముకుంటూ బతుకుతున్న మహిళాపై మున్సిపల్ అధికారి దౌర్జన్యం చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని కర్నూలు నగరానికి చెందిన సువర్ణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కర్నూలులో మీడియాతో మాట్లాడుతూ కమిషనర్ సార్ మమ్మల్ని బతకనివ్వండి. నగరంలోని సెంట్రల్ ప్లాజా ఎదుట పండ్లు అమ్ముకొని జీవనం సాగిస్తున్నాను. కానీ నేను మున్సిపల్ అధికారి అని నిరంతరం దుర్భాషలాడుతూ, మా దగ్గర ఉన్న పనులు లాక్కుంటూ, డబ్బులు దోచుకుంటూ, వ్యభిచారం చేసి బతకమంటూ వేధింపులకు పాల్పడుతున్నారు. మాపైన దాడులు చేస్తున్నారు. మేము ఎప్పుడూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా రోడ్డుపక్కన బండి మీద పండ్లు అమ్ముతుంటాం. అయినప్పటికీ నేను మున్సిపల్ అధికారి' అంటూ దౌర్జన్యాలు చేస్తున్నారు. నాకు తల్లిదండ్రులు లేరు. శరీరంలో ఒక కిడ్నీ కూడా లేదు. అయినా కష్టపడి జీవనం కొనసాగిస్తున్నా. కానీ మా మీద జూలుం ప్రదర్శిస్తున్నారు" అని సువర్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి అధికారిపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆత్మహత్య శరణం తప్ప వేరే మార్గం లేదని స్పష్టం చేశారు

# యూరియా సరఫరాకు సహకరించిన ప్రతి ఒక్క రైతు సోదరునికి ధన్యవాదాలు

**జె డి.హబీబ్ బాషా**



**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ సెప్టెంబర్ 10** పోలవరం మండలం ప్రగడపల్లి పాత పట్టి సీమ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కేంద్రం వద్ద నిన్న యూరియా కోసం రైతుల ఆందోళన తో వ్యవసాయ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జె డి హబీబ్ బాషా ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూరియా సరఫరాకు సహకరించిన ప్రతి ఒక్క రైతు సోదరునికి ధన్యవాదాలు తెలియజేశారు. రైతులు ఎవరు అధైర్య పడవద్దు అని , అందరికీ యూరియా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. వింజరం దగ్గర ఉన్న రైతు సేవ కేంద్రం వద్ద యూరియా పంపిణీ చేసామని, వర్షం కారణంగా రైతులు తక్కువ సంఖ్యలో వచ్చారని ఆయన అన్నారు, అదనంగా కూడా రైతులకు యూరియా అందిస్తామనన్నారు. రైతుల ఆందోళనతో యంత్రాంగాన్ని అప్రమత్తం చేసామని, నిన్న రాత్రి ఒంటి గంట వరకు వచ్చిన రైతులందరికీ యూరియా సరఫరా చేసామని అన్నారు. అహర్నిశలు కష్టపడిన తమ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి చర్యలు మరలా పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని జె డి హబీబ్ బాషా పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో ఏ.డి బుజ్జిబాబు, వ్యవసాయఅధికారి కే. రాంబాబు, అధికారులు, రైతులు వెంకటాచలం, విప్పర్తి. రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నిస్వార్థ సేవలకు రెడ్ క్రాస్ నిలువెత్తు నిదర్శనం







**ప్రజాసేవే నా ప్రాణం రెడ్ క్రాస్‌తో జీవితాంతం కృషి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ**

**బాపట్ల సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో బుధవారం రెడ్ క్రాస్ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి మాట్లాడుతూ,కృష్ణా వరద విపత్తు సమయంలో నిరాశ్రయులైన 30 వేల మందికి పది రోజుల పాటు ఆహారం, వైద్యం అందించి రెడ్ క్రాస్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. నిరుపేదలకు ఉచిత భోజన పంపిణీ, గర్భిణులకు కిట్లు, రక్తదానంలో ముందుండటం వంటి సేవలు ప్రశంసనీయమైనవి. రెడ్ క్రాస్ సేవలు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి అని అన్నారు. సమావేశంలో గత సంవత్సరం సేవా కార్యక్రమాలపై నివేదిక సమర్పించిన సంస్థ జిల్లా చైర్మన్ బి.ఎస్. నారాయణ బట్టు మరోసారి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. బి. రామ సుబ్బారావు వైస్ చైర్మన్‌గా, టీ. ప్రసాదరెడ్డి కోశాధికారిగా ఎన్నికయ్యారు. అనంతరం సేవలు అందించిన 18 మంది సభ్యులకు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. సమాజంలో సమస్యల పరిష్కారానికి రెడ్ క్రాస్ వేదికగా నిలుస్తోందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. రెడ్ క్రాస్ సేవలు నిజాయితీ, నిస్వార్థతకు ప్రతీక. జీవితాంతం కూడా ఈ సంస్థలో పనిచేయడం గర్వకారణం అని పేర్కొన్నారు. రాష్ట్ర కోశాధికారి పి. రామచంద్ర రాజు కూడా సంస్థ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏవో మల్లికార్జునరావు, కమిటీ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభకు బయలుదేరిన 22వ వార్డు కూటమి నాయకులు




**గుంతకల్లు సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):** అనంతపురం పట్టణం నందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమానికి గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు గుంతకల్లు పట్టణ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి ఆధ్వర్యం లో గుంతకల్లు పట్టణంలో స్థానిక పాత బస్టాండ్ మోమినాబాద్ 22.వ వార్డు నందు మూడు బస్సుల లో కూటమి నాయకులు పెద్ద ఎత్తున కార్యక్రమానికి బయలుదేరడం జరిగింది. 22వ వార్డుటిడిపి ఇంచార్జ్ లు నాయకులు మాజీ కౌన్సిలర్ గుత్తి యాస్మిన్.బిజెపి నాయకులు కొలిమి. రామాంజనేయులు.టిడిపి నాయకులు గాది లింగేశ్వర బాబు (పెద్దబాబు),గుజిరి మహమ్మద్ ఖాజా,కే వలీ భాష,షేక్ పజులు,గుజిరి సురేష్,మెకానిక్ మస్తాన్, టెంకాయలు యూసుఫ్.గుజిరి సైపుల్ల,జయరాములు, రహమతుల్లా.వాసం రవి బాబు,మరియు వార్డు సమైక్య లీడర్స్ బిసుజాత,పర్వీన్ భాను,కుర్షిత్ బేగం,సత్య,లక్ష్మి, మరియు కూటమి నాయకులు మహిళలు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున తరలి వెళ్లడం జరిగినది.

## ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్క ఆనందబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన...

**ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి**



**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ సెప్టెంబర్ 10** పోలవరం మండలం లో గోదావరి వృద్ధ ఆశ్రమంలో వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పుట్టినరోజు సందర్భంగా గోదావరి వృద్ధాశ్రమంలో ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి ఆధ్వర్యంలో ఆనంద్ బాబు పుట్టినరోజు ఘనంగా నిర్వహించారు అనంతరం కేక్ ను వృద్ధుల మధ్య కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. జగదీశ్వరి స్వయంగా వృద్ధులకు భోజనాలు వడ్డించారు. శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి మాట్లాడుతూ అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి, సంక్షేమ రాజ్యస్థాపన జరగాలి అని కలలు కన్న ప్రజానాయకుడు.ఆయన వేసే ప్రతి అడుగు ప్రజల కోసమే. ప్రతి నిమిషం ప్రజాసేవకే అంకితం చేసిన మనస్సున్న నాయకుడు నక్క ఆనంద్ బాబు పార్టీలు, కులం, మతం, ప్రాంతం వంటి రాగద్వేషాలకు అతీతంగా అందరినీ సమభావంతో ఆదరించి తన సేవలను అందించిన గొప్ప ప్రజానాయకుడు ఆనంద్ బాబు వేమూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక "మోడల్ నియోజకవర్గం"గా తీర్చిదిద్దాలని అనుక్షణం పరితపించిన నాయకుడు. ఎమ్మెల్యే,మాజీ మంత్రికి నక్క ఆనందబాబుకు ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చేగొండపల్లి పార్టీ క్యాంపు కార్యాలయంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడి వర్కర్ల హెల్పర్ల మినీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి.

**ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమల దేవి గారికి**




**(ప్రజా జ్యోతి న్యూస్) వెల్దుర్తి సెప్టెంబర్ 10** ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె లలిత, జిల్లా కౌన్సిల్ సభ్యురాలు షమీనాభాను లు పిడి విజయ మేడంగారు, ఈవో రాజేశ్వరి మేడం గారు, సిడిపిఓ లూక్ గారు, సూపర్వైజర్ పద్మ మేడం గారు వీరందరూ కలిసి, శాలువా పూలమాలతో సత్కరించడమైనది. జె లలిత ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా, రేషన్ షాప్ లో ప్రాబ్లమ్స్, మెనూ ప్రాబ్లమ్స్, కాంట్రాక్టర్ల ట్రాన్స్పోర్ట్ ల, ప్రాబ్లమ్స్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాల పెంపుదల గురించి, ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం గురించి, సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, అంగన్వాడి కేంద్రాలకు వంట పాత్రలు ఉచిత గ్యాస్ ఇవ్వాలని వీటన్నింటినీ సీఎం గారితో మామినిస్టర్ గారితో, మాట్లాడి మా సమస్యలు పరిష్కరించి, వేతనాలు పెంపుదల, ఈత సమస్యలన్నీ పరిష్కారం కోసం, తమరు కృషి చేయాలని, మేడం గారికి విజ్ఞప్తి చేయడం జరిగింది, మేడం గారు మాకు సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు, తప్పకుండా ప్రభుత్వం దృష్టికి, సీఎం,మినిస్టరు గార్ల దృష్టికి కంపల్సరీ తీసుకొని వెళ్తానని మేడం గారు తెలియజేశారు. మా అసోసియేషన్ నుండి మేడం గారికి అభినందనలు తెలియజేశాము.


## పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత

**లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నామన.పరమేశ్వరరావు**



**తాళ్లపూడి, సెప్టెంబర్10, ప్రజాజ్యోతి న్యూస్** పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా ప్రతి ఒక్కరూ సమష్టి కృషి చేయాలని పచ్చదనాన్ని కాపాడడం ప్రతిఒక్కరు బాధ్య తగా తీసుకోవాలని తాళ్లపూ డి మండల లయన్స్ క్లబ్ అధ్య క్షుడు నామన. పరమేశ్వరరా వు తెలిపారు. మండలం లో తిరుగుడుమెట్ట పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలను నాటే కార్యక్రమాన్నిచేపట్టారు. ఈసందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 10 వేల మొక్కలను నాటి వాటిని సంరక్షించి రక్షణ కల్పిం చే విధం గా లక్ష్యాన్ని నిర్దేశిం చామన్నారు. మండలం లో ఉన్న అన్ని గ్రామాల పాఠశా లలో, ప్రభుత్వ కార్యాలయా లు, రహదార్ల పక్కన మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కె. కృష్ణారావు, ఎల్లిన బ్రహ్మానందం, యనమ దల. సుబ్రమణ్యం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## గ్రామాల అభివృద్ధి మరియు పారిశుద్ధ్యం పై శిక్షణ కార్యక్రమం నిర్వహించిన ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి



**తాళ్లపూడి, సెప్టెంబర్10, ప్రజాజ్యోతి న్యూస్** గ్రామ అభివృద్ధి మరియు పరి శుభ్రత తదితరఅంశాలపైగ్రామ సర్పంచ్, పంచాయతీకార్యదర్శులు మరియు ఎంపీటీసీలకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం మండల కార్యాలయంలో ఎంపీ డీవో వేణుగోపాల్ రెడ్డి ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లా డుతూ గ్రామాల అభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని అన్నారు. అంతే కాకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి గ్రామాల ను పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. మారుతున్న కాలాలను బట్టి గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించాల ని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి. జొన్నకూటి పోసిరాజు, సర్పంచ్ కొమ్మిరెడ్డి. పరసరా మారావు, ఆర్డబ్ల్యూ ఎస్ ఏ.ఈ. సూర్జహాన్ హౌసింగ్ ఇన్చార్జి ఏ.ఈ. దాదా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

# అమరవీర జవాన్ అబ్దుల్ హమీద్ కు ఘన నివాళులర్పించిన పటాన్ రాజేష్

**బాపట్ల సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** భారతదేశ రక్షణ చరిత్రలో బంగారు అక్షరాలతో నిలిచిపోయిన అమరవీర జవాన్, పరమవీర చక్ర అవార్డు గ్రహీత అబ్దుల్ హమీద్ 60వ వర్ధంతి సందర్భంగా బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు గుంటూరు డివిజన్ రైల్వే బోర్డు మెంబర్ పటాన్ రాజేష్ బుధవారం ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పటాన్ రాజేష్ మాట్లాడుతూ, భారత తల్లి గర్భంలో పుట్టిన సాహసవీరులు దేశాన్ని కాపాడేందుకు తమ ప్రాణాలను అర్పించారు. వారిలో అబ్దుల్ హమీద్ త్యాగం మరువలేనిది. 1965 భారత్‌పాక్ యుద్ధ సమయంలో, అప్పటి ప్రధానమంత్రి నెహ్రూ మరణం తర్వాత ఏర్పడిన అనిశ్చితి వాతావరణంలో, పంజాబ్ రాష్ట్రం టాంకరన్ సమీపంలో దాగి, అకస్మాత్తుగా పాకిస్తాన్ సైన్యంపై దాడి చేసిన హమీద్ శత్రు సైన్యం యొక్క ఎనిమిది ట్యాంకులను ధ్వంసం చేసి, భారత భూభాగంలోకి పాకిస్తాన్ దళాలు చొరబడకుండా నిలువరించారు. దేశ రక్షణ కోసం ఆయన చేసిన ఆ ప్రాణ త్యాగం, ఆ ధైర్యసాహసం యావత్ భారత దేశానికి స్ఫూర్తిదాయకం పటాన్ రాజేష్ అని



పేర్కొన్నారు. అలాగే దేశ రక్షణ కోసం తలపెట్టిన వేలాది మంది జవాన్లు తమ ప్రాణాలను త్యాగం చేశారని, ప్రతి భారతీయుడు వారి త్యాగాన్ని ఎప్పటికీ మరవరాదని పటాన్ రాజేష్ అన్నారు. అబ్దుల్ హమీద్ వీరగాథ, త్యాగం ప్రతి భారతీయ యువతలో దేశభక్తి జ్వాలను రగిలించాలి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ రాము, నర్రా కొండలు, జి.కొండలు, కె.కొండలు, గేరా చార్లెస్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన ఢీ డాన్స్ స్టూడియో...



ఢీ డాన్స్ స్టూడియోను పామిడిలో ప్రారంభించిన మణికంఠ మాస్టర్, శ్రీ చైతన్య స్కూల్ సీఈవో సంతోష్ రెడ్డి చిన్నారులతో కలసి డాన్స్ చేసిన మణికంఠ మాస్టర్



**ప్రజా జ్యోతి రిపోర్టర్ మధు పామిడి...** మండల పరిధిలోని అమృత మార్ట్ పక్కన ఢీ డాన్స్ స్టూడియోను ప్రముఖ ఢీ డ్యాన్స్ షో మాస్టర్ మణికంఠ, పామిడి శ్రీ చైతన్య స్కూల్స్ సీ.ఈ.వో. సంతోష్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఢీ డ్యాన్స్ స్టూడియోను ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామిడి చుట్టుపక్కల ఉన్న చిన్నారుల ప్రతిభను వెలికి తీసేందుకే ఈ ఢీ డాన్స్ స్టూడియోను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం, శనివారం, ఆదివారం సాయంత్రం 5గంటల నుండి 8 గంటల వరకు డాన్స్ క్లాసులు ఉంటాయని, ఇందులో ప్రతిభ కనబరిచిన చిన్నారులను ఢీ డాన్స్ షోలకు కచ్చితంగా తీసుకెళ్తామని మణికంఠ మాస్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రముఖ డాన్స్ మాస్టర్లు రామ్ మరియు సురేష్ వీరి శిష్య బృందం, శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

# సైబర్ నేరాలు ,ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కార్యక్రమం

**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండలం కింతలి జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం నాడు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువతలో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో, ఎస్ ఎస్ టి స్వచ్ఛంద సంస్థ, డీఈఏ ఫండ్స్ సౌజన్యంతో కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇందులో భాగంగా విద్యార్థులకు పొదుపు యొక్క ప్రాముఖ్యత, బ్యాంక్ ఖాతాలు తెరవడం, మరియు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటం వంటి అంశాలపై వివరణాత్మక సూచనలు అందించారు.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్.డి.ఎం శ్రీనువాసు, పెనుబర్తి ఎస్.బి.ఐ బ్రాంచ్ మేనేజర్ భాస్కరరావు, తోలాపి ఏ.పి.జి.బి మనోహర్, కింతలి కెనరా బ్యాంక్ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు చిన్న వయసు నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఆర్థికంగా స్థిరపడటానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.? ఇటీవల కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల గురించి విద్యార్థులను అప్రమత్తం చేశారు. ఆన్‌లైన్ లావాదేవీలు



నిర్వహించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఏ.టి.ఎం పిన్, ఓ.టి.పి లాంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోకూడదని స్పష్టం చేశారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే ఫిర్యాదు చేయడానికి 1930 నెంబర్ ను సంప్రదించాలని సూచించారు. బ్యాంకింగ్ సేవలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఎదురైతే, బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్ నంబరు 14448 కు ఫోన్ చేయవచ్చని వివరించారు. ?ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, హరినాథ్, హరిబాబు, లక్ష్మణరావు, రామారావుతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించడంలో ఎంతగానో ఉపయోగపడింది.

# లయన్స్ క్లబ్ అఫ్ రాయచోటి టౌన్ వారి అధ్వర్యంలో రక్తదాన శిబిరం

ఘనంగా లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి
అధ్యక్షులు శ్యామ్ జన్మదిన వేడుకలు

**అన్నమయ్య జిల్లా సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి రిపోర్టర్ రాణా ప్రతాప్)** రాయచోటి పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ అధ్యక్షులు శ్యామ్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. వారి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని దీప బ్లడ్ బ్యాంకు నందు రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షులు శ్యామ్ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.వారి తో పాటు సుజుకి షోరూం యజమాని రమేష్ రాజు,కోశాధికారి మనోహర్ రాజు,లయన్స్ సభ్యులు సంసీర్ వలీ,సురేష్,నవీన్,నాగార్జున రెడ్డి లు రక్తదానం చేశారు.అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన కేకు కటింగ్ నిర్వహించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ షేక్ మహమ్మద్, మాజీ అధ్యక్షులు పెడబల్లి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధ్యక్షులు శ్యామ్ మాట్లాడుతూ నా జన్మదిన వేడుకలను పురస్కరించుకొని నా మిత్రులు రక్తదానం కార్యక్రమం నిర్వహించి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం చాలా సంతోషదాయకం అన్నారు.రక్తం ఎంతో ఉపయోగకరం అని దానిని గుర్తించి రక్తదానం చేయడం మరొకరికి ప్రణా దానం చేయడమే అని గుర్తు చేశారు.లయన్స్ క్లబ్ ద్వారా నియోజకవర్గం వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అటువంటి కార్యక్రమాలకు సహాయసహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరు పేరు న ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.శ్యామ్ ఇటువంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకునేలా వారికి వారి కుటుంబ సభ్యులకి భగవంతుని




ఆశీస్సులతో అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు తో పాటు వారి వ్యాపారం దిన దినాభివృద్ధి చెందాలని వారి మిత్రులు ఆకాక్షించారు.

## సమచారశాఖ జిల్లా ఏడి గా పి.వెంకటరమణ బాధ్యతలు స్వీకరణ



**బాపట్ల సెప్టెంబర్ 10: ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధి:** బాపట్ల జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ సహాయ సంచాలకులుగా పి.వెంకటరమణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ జె వెంకట మురళిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సమాచార శాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతపురం జిల్లాలో పౌర సంబంధాల అధికారిగా పని చేస్తున్న వెంకటరమణకు సహాయ సంచాలకులుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. పదోన్నతితో బాపట్ల జిల్లాకు బదిలీపై వచ్చిన ఆయన ప్రభుత్వ సేవలు అందించడంలో శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా జ్యోతి దినపత్రిక జిల్లా స్టాఫర్ ఆనంద్, సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేస్తామన్నారు. పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంలో సమాచార శాఖ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ప్రజలకు అందేలా చూస్తామన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల సమన్వయ సహకారంతో బాపట్లను ముందుకు తీసుకువెళ్లాలా కృషి చేస్తామన్నారు. సమాచారశాఖలో మీ సుదీర్ఘ అనుభవాన్ని మీడియా అభివృద్ధి కొరకు సహకరించాలని ప్రజా జ్యోతి ప్రతినిధులు కోరారు. మీ అనుభవంతో జిల్లాలో సమాచార శాఖ మరింత మెరుగులు దిద్దుకోనందుని ఆశాభావం వ్యక్తం చేశారు.

## దాతృత్వాన్ని చాటుకున్న రాష్ట్ర అటవీ అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్



**అన్నమయ్య జిల్లా సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి రిపోర్టర్ రాణా ప్రతాప్)** అన్నమయ్య జిల్లా,రాయచోటి నందు గౌ.రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రిమండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి క్యాంపు కార్యాలయం నందు రాయచోటి నియోజకవర్గం లో గల రెండు "అన్నా క్యాంటీన్ల" ల నిర్వహణ కు గాను 3లక్షల రూపాయలను రాయచోటి నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి గారికి విరాళంగా అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్న రాయచోటి నియోజక వర్గం లక్కిరెడ్డి పల్లె కు చెందిన రాష్ట్ర అటవీ అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డయ్య యాదవ్.ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ ను అభినందించిన రాయచోటి నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి

## గ్రామ అభివృద్దే ధ్యేయం

**- గత ఐదు రోజులుగా ముమ్మరంగా గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు**

**- తోలాపి సర్పంచ్ ప్రతినిధి పప్పల రాధాకృష్ణ**







**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** గ్రామ అభివృద్దే ధ్యేయంగా పొందూరు మండలం తోలాపి గ్రామంలో గత ఐదు రోజులుగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని సర్పంచ్ ప్రతినిధి పప్పల రాధాకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమం ఉప సర్పంచ్ పప్పల శ్రీనివాడ రావు , పంచాయతీ కార్యదర్శి జనార్ధన రావు సమక్షంలో వార్డు మెంబర్లు సహాయంతో జరుగుతుంది.పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న చెత్తను జేసీబీ సహాయంతో తొలగించి ట్రాక్టర్లతో డంపింగ్ చేశారు. వీటితో పాటు గ్రామంలో రోడ్లు వద్ద ,సచివాలయం వద్ద నుండి ప్రారంభించి పెద్దవీధిలో ఉన్న కూన వాని చెరువు వరకు జేసీబీ సహాయంతో ముమ్మరంగా పనులు చేయించారు. అనంతరం ఎస్సీ శ్మశాన వాటికలో కూరుకుపోయిన చెత్తను జేసీబీ తో శుభ్రపరిచే అవకాశం లేకపోవడంతో ఐదుగురు మనుషులతో శుభ్రపరిచారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గత ఐదు రోజులుగా శరవేగంగా పనులు చేపట్టడం జరిగిందన్నారు. పొందూరు మండలం లోనే తోలాపి గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

## ఉపముఖ్యమంత్రి పర్యటన బందోబస్తు బ్రీఫింగ్ నిర్వహించిన ఎస్పీ



**బాపట్ల, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈ నెల 11న బాపట్ల జిల్లా అడివిపాలెం పంచాయతీ పరిధిలో పర్యటించనున్న సందర్భంగా బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీస్ అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ బుధవారం నగరవనంలో బ్రీఫింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హెలిప్యాడ్, కాన్వాయ్, రోప్ పార్టీలు, చెకింగ్ పాయింట్లు, ట్రాఫిక్ మళ్లింపు ప్రదేశాలు, అమరవీరుల స్మారక స్థూపం, తాటి మొక్క నాటే ప్రదేశం తదితర ప్రాంతాల్లో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సంయమనం పాటిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్, ఎస్.బి ఇన్‌స్పెక్టర్ జి.నారాయణతో పాటు బందోబస్తు సిబ్బంది పాల్గొన్నారు.

## మండల కమిటీ లేక కృంగి నిరసించిపోతున్న అనంతగిరి మండల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు.

**అనంతగిరి మండలం.సెప్టెంబర్ 9. ప్రజా జ్యోతి న్యూస్ రిపోర్టర్. శంకర్.** సీతారామరాజు జిల్లా. అరకు నియోజకవర్గం. అనంతగిరి మండలం అంటేనే తెలుగుదేశం పార్టీకి వెన్నుముక లాంటిది అలాంటి వెన్నుముక గల అనంతగిరి మండలానికి నేటికీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పైబడిన మండల కమిటీ అనేది లేకపోవడం విచారించదగ్గ విషయం. మండల కమిటీ ఏర్పాటుకు సనహాలు చేస్తున్నారు. వాయిదా వేస్తున్నారు.దీంతో కార్యకర్తలలో ఉల్లాసం.ఉత్సాహం కృంగి కృషించి నీరసించి పోయిందని మండల కార్యకర్తలు ఆవేదనచెబుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఏర్పడింది.ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించే అవకాశం కార్యకర్తలకు కలిగిందని ఎంతో ఆశతో ఉన్నప్పటికీ మండల కమిటీ కార్యవర్గ సభ్యులు లేరుపార్టీని నడిపించే నాయకుడే లేడుకార్యకర్తలు ఏంచేస్తారని ప్రశ్నిస్తున్నారు. పార్టీ అధిష్టానానికి అనంతగిరి మండల కార్యకర్తలు.నాయకులు అవసరం లేనట్టుగా కనిపిస్తుందని మండలాన్ని ఇంత నిర్లక్ష్యంగా విడిచిపెట్టడం వల్లపార్టీకి తీవ్రమైన నష్టం కలుగుతుంది తప్ప కార్యకర్తలకు పోయేది ఏమీ లేదని బహిరంగ చెబుతున్నారు. పార్టీ నడవాలి పార్టీ కార్యకలాపాలు నడవాలి అంటే తప్పనిసరిగా మండల పార్టీ బాధ్యతలు ఎవరికో ఒకరికి అప్పగించాలి కానీ ఇలా విడిచి పెట్టడం వల్ల రానున్న పంచాయితీ. ఎం.పీ.టీ.సీ జడ్పి.టి.సి ఎన్నికలలో అపారమైన నష్టం జరిగే ప్రమాదంఉందని చెప్తున్నారు. ఏ పార్టీలోనైనా గ్రూపు రాజకీయాలు ఉంటాయి.గ్రూప్ రాజకీయాలు శృతిమించిపోతే పార్టీ కఠినమైన నిర్ణయాలు తీసుకొని కమిటీ ఏర్పాటు చేయాలి తప్ప ఏ నిర్ణయాలు తీసుకోకుండా అధిష్టానం మౌనంగా ఉండడం చాలా బాధాకరమైన విషయమని కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. కూటమిప్రభుత్వం ఏర్పడింది తప్ప.కూటమి నాయకులకు అధికారిక ఆహ్వానాలు కూడా మండల శాఖ అధికారులు అందించడం లేదని పరిస్థితి ఎంత దారుణంగా ఉందో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఒకసారి గమనించాలని కార్యకర్తలు విజ్ఞప్తి చేస్తున్నారు. కాలయాపన చేస్తే పార్టీ అనంతగిరి మండలంలో నామరూపాలు లేకుండా కనుమరుగవుతుందని కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటి కైనా పార్టీ పెద్దలు కార్యకర్తల బాధ.ఆవేదన గమనించి పార్టీ పరమైన నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ధైర్యశాలి సీఐ మద్దాల శ్రీనివాస్.

**అన్యాయాన్ని సహించే వ్యక్తి కాదు సీఐ మద్దాల శ్రీనివాస్. దేగల వేటాడి పకడ్బందీగా పట్టుకుని చట్టప్రకారం శిక్షించే నిజాయితీపరుడు.**

**పాలకొల్లు సెప్టెంబర్ 10 ప్రజాజ్యోతి ప్రతినిధి :** చట్టానికి న్యాయానికి ధర్మానికి కనిపించే మూడు సింహాలు ప్రతీక అయితే ఎక్సైజ్ శాఖలో కనిపించని నాలుగో సింహమే పాలకొల్లు ఎక్సైజ్ సిఐ మద్దాల శ్రీనివాస్. ఎక్సైజ్ శాఖ ఆయన పరిధిలో అన్యాయాన్ని సహించడు అక్రమాన్ని ప్రోత్సహించడు అక్రమ బెల్ట్ షాపులు నిర్వహించే దుకాణం దారులు పై ఉక్కు పాదం మోపి ఈయన కంట మీద కునుకు లేకుండా నిరంతరం పహారా కాస్తూనే ఉంటారు.అంతేకాదు ఎదుటి వారికి సహాయం చేయడంలో ముందుండే మంచి మనసున్న మహారాజు. ఈయన పరిధిలో నాటు సారా కాసిన, బెల్టు షాపులు ద్వారా అక్రమ మద్యాన్ని విక్రయించిన, మాదకద్రవ్యాలు సరఫరా చేసిన, అక్రమంగా మద్యాన్ని సొంతంగా తయారుచేసిన అలాంటి వారిని దేగల పకడ్బందీగా వేటాడి కటకటాల పాలు చేసే చట్టప్రకారం కఠినంగా శిక్షించే ధైర్యశాలి. నీతి ఈయన సొంతం, నిజాయితీ ఈయన ధైర్యం, అంతేకాకుండా ఎక్సైజ్ శాఖకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసే ప్రతి ప్రకటనను మీడియా ద్వారా ప్రజలకు చేరవేయటంలో ఈయనకు ఈయనే సాటి, యువత చెడు మార్గాలు పట్టి మాదకద్రవ్యాలతో జీవితాలను పాడు చేసుకోకుండా కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి అనర్గళంగా ప్రసంగించి యువతలో మార్పు తీసుకొచ్చి వారి జీవితాలకు మంచి బాటలు వేస్తున్న మంచి జ్ఞానవంతుడు.ఇలా ఈయన గురించి చెప్పుకుంటూ పోతే కాదు కాదు రాసుకుంటూ పోతే ఈయన సర్వీసు మొత్తంలో అనేక మార్గాల్లో ఈయన అందించిన ఉత్తమ సేవల గురించి, చేసిన మంచి గురించి నిజంగా రాయవలసి వస్తే కొన్ని పేజీలు సరిపోవు ఇలాంటి మంచి వ్యక్తి పాలకొల్లు ఎక్సైజ్ సీఏ గా పనిచేస్తున్న ఈయన పరిధిలో సీఐ మద్దాల శ్రీనివాస్ కి తెలియకుండా ఏవైనా అక్రమ కార్యక్రమాలు జరుగుతున్నాయా అంటే పెద్ద క్వశ్చన్ మార్కే వేసుకోవాలి.అసలు పాలకొల్లు పరిధిలో ఎక్సైజ్ శాఖలో ఎటువంటి అక్రమ కార్యక్రమాలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా జరుగుతున్నాయో అవి ఏ స్థాయిలో ఉన్నాయో మరలా ఒక మంచి న్యూస్ లో వివరించే ప్రయత్నం చేద్దాం



ఏది ఏమైనప్పటికీ సింహం లాంటి సి ఐ మద్దాల శ్రీనివాస్ పై ఎటువంటి అన్యాయపు అక్రమ మచ్చ ఆయనపై పడకుండా అక్రమార్కులను మాత్రమే పట్టించే ప్రయత్నం చేద్దాం.

# ఐలమ్మ వర్ధంతిని ఐలమ్మ కాలనీలో ఘనంగా నిర్వహించిన ప్రజా సంఘాలు.





**గోపవరం సెప్టెంబరు 10( ప్రజా జ్యోతి న్యూస్)** బుధవారము నాడు బద్వేల్ పట్టణం ఐలమ్మ కాలనీలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి ని ఘనంగా నిర్వహించిన ప్రజాసంఘాలు ప్రజలు. అక్కడ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆమె ధైర్యసహస్యాల గురించి మాట్లాడుతూ.నేటి మహిళలు ఐలమ్మ ధైర్య,సాహసాన్ని గుర్తుచేసుకొని ఆమె ఇచ్చిన ధైర్యస్ఫూర్తితో ప్రతి మహిళ ముందుకు సాగాలి అని కొనియాడారు. ఆమె తెలంగాణ సాయుధ పోరాట వీరనారేమనిఅని. ఆమెధైర్యసాహసాలతో తెలంగాణ పటేల్ రజాకారుల ఆగడాలను ఎదు రొడ్డి పోరాడిన ధైర్య సాహసి చాకలి ఐలమ్మని, ఆమె చేసిన పోరాటాలు ఆమె ధైర్యాన్ని కొనియాడిన ప్రజాసంఘాల నాయకులు. ఈ సందర్భంగా నాగ దాసరి ఇమ్మానియేల్ పడిగే వెంకటరమణ పొంగూరు నాగరాజు మాట్లాడుతూ 1948 లో సాయుధ తెలంగాణ పోరాటంలో తన భూమిని కాపాడుకోవడంలో తెగవను చూపించి కొంగు ను నడుముకు చుట్టి. కొడవలి చేత పట్టి పటేల్ రజాకారుల ఆగడాలను ఎదిరించిన ధీర వనిత అని నేటి మహిళలు ఆమె ధైర్య ని తెగువను. పునికి పుచ్చుకొని మతోన్మాదం, మహిళలపై జరుగుతున్న అరాచకాలను ఎదుర్కోవాలని వారు అన్నారు తను చనిపోయేంతవరకు మహిళల కోసం వారి సమస్యల కోసం పోరాడిన మహనీయురాలు ఐలమ్మని అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జ్యోతి .సుజాత ఓబులమ్మ శివ ప్రసాదు సుధాకర్ బ్రహ్మయ్య దేవి తిరుమల వీరయ్య ఓబులేసు రజక సంఘాలు ప్రజలు పాల్గొన్నారు.

# సంప్రదాయ సాహిత్యపు దివిటీ విశ్వనాథ సత్యనారాయణ.

**పోదూరు, సెప్టెంబర్ 10,ప్రజాజ్యోతి న్యూస్(రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి వేడుకలుఘనంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం విశ్వనాథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తెలుగు విభాగాధిపతి డా బూసి వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డా తిరువీధుల రాజరాజేశ్వరి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో అజరామంగా వెలుగొందిన కవివరేణ్యుడన్నారు. ఆధునిక సాహిత్యం కొత్త పుంతలు త్రొక్కుతున్నవేళ సంప్రదాయ కవిత్వాన్ని పెద్ద దిక్కయ్యి దివిటిగా మారి ప్రాచీన సాహిత్యపు సువాసనలను గుబాళింపజేసి కవితా వ్యవసాయ కావ్యవారాశిని పండించి, రామాయణ కల్పవృక్షం వంటి ఉత్తమోత్తమ సాహిత్యాన్ని అందించి, తెలుగులో మొట్టమొదట్ట నపీఠ్ అవార్డ్అందుకున్న కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ అని కొనియాడారు. ఆయన తెలుగు సాహిత్యంలో సృజించని సాహితీ ప్రక్రియలు లేవంటే అతిశయోక్తి కాదు. కావ్యాలు, కవితలు, నవలలు, నాటకలు, పద్యకావ్యాలు, ప్రయోగాలు, విమర్శలు, వ్యాసాలు, కథలు, చరిత్రలు వంటి ప్రక్రియల ద్వారా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసారన్నారు. అతని ప్రతిభా పాటవాలకు ఏన్నో



అవార్డులతో భారత ప్రభుత్వం సత్కరించిందన్నారు. విశ్వనాథ రచనల్లో ఆయన వ్యక్తిత్వం ప్రతిబింబిస్తుందని, వాక్కులో, వాక్యంలో, శబ్దంలో, సమాసంలో, భావంలో, భావనలో, దర్శనంలో, విమర్శనంలో, భాషణంలో, భూషణంలో ఒక విలక్షణమైన శైలి విన్యాసం కన్పిస్తుందని ఆమె తెలిపారు . దాదాపు లక్షపుటల కావ్యాలను రాసిన అలుపెరుగని అవిశ్రాంత కవి శ్రామికుడని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి కృష్ణ, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ యామిని, ఐ క్యు ఏ సి కొఆర్డినేటర్ భద్రాచలం,జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం రామకృష్ణ, అర్ధశాస్త్ర విభాగాధిపతిజి డా సిహెచ్ ఉషారాణి, అధ్యాపకులు వంశీ సుబ్బరాయన్ ,పి శ్రీనివాసరావు,డా వి విజయలక్ష్మి,జి డి శ్రీనివాసరావు, రవికుమార్ , రమేష్ బాబు,శివకృష్ణ, మన్మధరావు,పార్ధసారధి, శ్రీదేవి, ఆశాజ్యోతి, దుర్గేశ్వరి,స్వర్ణలత,మహేష్ ,రోహిత్ ,యం శిరీష,జ్యోష్న, హెప్సిబా,రామలక్ష్మి ,విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రైస్ కార్డుదారులతో అవగాహన కార్యక్రమం

- రేషన్ పంపిణీలో మరింత పారదర్శకత
- షాపు డీలర్ పనితీరుపై ప్రత్యేక శ్రద్ధ
- రేషన్ షాపు నందు క్యూ ఆర్ కోడ్ ఆధారిత బోర్డు తప్పనిసరి
- ప్రతీ ఒక్క కార్డుదారుడు రేషన్ షాపుకు మొబైల్ ఫోన్ తీసుకువెళ్ళాలి
- షాపు డీలర్ ,పంపిణీ విధానం పై తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి క్యూ ఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలి
- జిల్లా పౌర సరఫరాల అధికారి జి సూర్య ప్రకాశరావు

**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** రేషన్ పంపిణీ విధానంలో పారదర్శకతను పెంచేందుకు స్మార్ట్ రైస్ కార్డులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జిల్లా పౌర సరఫరాల అధికారి జి సూర్య ప్రకాశరావు అన్నారు. పొందూరు మండల కేంద్రంలో బుధవారం నాడు నాలుగు డిపోల రేషన్ కార్డు లబ్దిదారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు పలు సూచనలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్క రేషన్ షాపు నందు క్యూ ఆర్ కోడ్ ఆధారిత బోర్డు తప్పనిసరిగా షాపు గోడకు బయట ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా కార్డు ఉన్న లబ్ధిదారులు ఈ క్యూ ఆర్ కోడ్ ఆధారంగా రేషన్ షాపు డీలర్ పనితీరుపై ప్రభుత్వానికి తెలుపడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. లబ్ధిదారులు రేషన్ షాపు నందు పొందుపరిచిన క్యూ ఆర్ కోడ్ ను తమ తమ మొబైల్ ఫోన్లు ద్వారా గూగుల్ ఓపెన్ చేసి సెర్చ్ కు ఎదురుగా ఉన్న స్కాన్ ఆప్షన్ మీద క్లిక్ చేసి షాపు నెంబర్ అందులో నమోదు చేయడం ద్వారా రేషన్ షాపుకు సంబంధించిన కొన్ని ప్రశ్నలు అందులో వస్తాయని తెలిపారు. ప్రతీ ఒక్క ప్రశ్న లబ్ధిదారుల సౌకర్యార్థం తెలుగులోనే ఉంటుందని అందులో అడిగిన ప్రశ్నలకు అవును లేదా లేదు అనే సమాధానం ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు. ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన తరువాత సబ్ మిట్ మీద క్లిక్ చేసి కార్డుదారుని మొబైల్ ఫోన్ కు లింకు కాబడిన నెంబర్ ను నమోదు చేయాలని సూచించారు. అనంతరం కార్డు దారుని మొబైల్ కు ఆరు అంకెల ఓటీపీ వస్తుందని ,ఆ ఓటీపీ నమోదు చేస్తే సబ్మిట్ విజయవంతంగా అవుతుందన్నారు. ఈ ప్రక్రియ కొరకు ప్రతీ ఒక్క కార్డుదారుడు రేషన్ షాపు వద్దకు తమ మొబైల్ ఫోన్ తీసుకు రావాల్సి ఉంటుందన్నారు. షాపు డీలర్లు కూడా కనీసం ప్రతీ నెల వంద మందితో ఈ ప్రక్రియ చేయించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ ద్వారా రేషన్ షాపు డీలర్ పనితీరులో ఎటువంటి అవకతవకలు ఉన్నా , రేషన్ సరిగ్గా అందకపోయినా అందుకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ,ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సి.ఎస్.డి.టి మధు , టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి చిన రంగ , నాలుగు రేషన్ షాపు డీలర్లు , లబ్ధిదారులు పాల్గొన్నారు.




## బిసి రైతు భూమి ఆక్రమణ చేసిన వారి పై చట్ట ప్రకారం పోలీసులు చర్య తీసుకోవాలి.

**ముఖ్యమంత్రి కి ప్రజా గ్రీవెన్స్ లో పిర్యాదు.**

**గుంతకల్లు సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు మండలం లోని తిమ్మాపురం గ్రామంలో బీసీ రైతు స్వర్గీయ సందే పోతుల రాజు కు చెందిన వ్యవసాయ భూమిఒక ఎకరం ఆక్రమణ చేసిన ఆయుష్ కళాశాల నిర్వాహకులు డాక్టర్ వెంకటేశ్వరరావు పైన గతంలో ఎమ్మార్వో నివేదిక ప్రకారం పరిశీలించి వారిపైన చట్ట ప్రకారం చర్యలు తీసుకొని ఆ పొలం నందు వ్యవసాయ పనులు చేసుకొనుటకు పోలీసు వారి ద్వారా రక్షణ కల్పించి సహాయం చేయగలరని బుధవారం జరిగిన ముఖ్యమంత్రి సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ నందు ఫిర్యాదు చేసినట్లు సంబంధిత వ్యక్తి డాక్టర్ సందే మాధవ రావు తెలిపారు.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులో భాగంగా ఆక్రమణ చేసిన వారిపైన ఎండార్స్మెంట్ ఇవ్వడం అభినందనీయం. అయితే పోలీసు వారు వీటిపై నిర్లక్ష్యం వహించకుండా బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఈ సందర్భంగా తెలియజేసి,లేనిపక్షంలో బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు అందరూ కలిసి ఆందోళనకు సిద్ధమవుతారని తెలియజేశారు.

## అకారణంగా మృత్యువాత పడుతున్న గేదెలు



**తాళ్లపూడి, సెప్టెంబర్10, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం లోని పెద్దేవం గ్రామంలో గత కొద్ది రోజులుగా చిన్న పెద్ద తేడా లేకుండా గేదెలు మరణిం చడం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. మందులు వేసి కొద్ది రోజులు మాత్రమే ప్రాణాలు నిలపగ లుగుతున్నా మని రైతులు కన్నీరు పెట్టు కుంటున్నారు. కలుషితమైన నీరు త్రాగితే రోగాలు బారిన పడతా యని, ముఖ్యంగా లివర్, కిడ్నీలు దెబ్బ తింటున్నాయని వెటర్నరీ డాక్ట ర్ బాలాజీ అన్నా రు. గేదెలకు నల తగా అనిపిస్తే వెంటనే డాక్టర్ ను సంప్రదించాలని రైతులకు తెలియ జేశారు. గేదెలకు వచ్చిన వ్యాధు లపై అబ్జర్వేషన్ చేస్తామని అన్నారు. రక్త నమూనాలను టెస్టింగ్ కోసం పంపించామని అన్నారు

## గవర్నర్ చేతుల మీదుగా ఫస్ట్ ర్యాంక్ గోల్డ్ మెడల్ మరియు సిల్వర్ మెడల్ అవార్డు

**తీసుకోనున్న వీరభద్ర స్వామి దేవస్థానం కార్య నిర్వహణ అధికారి కుమార్తె దేవి రెడ్డి శ్రావ్య**



**అన్నమయ్య జిల్లా సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి రిపోర్టర్ రాణా ప్రతాప్** అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం, అప్ప కొండయ్య గారి పల్లి గ్రామం నివాసి క్రీఃఎఃశేఃఎః శ్రీ దేవిరెడ్డి రామచంద్రా రెడ్డి పెద్ద కుమారుడైన టువంటి శ్రీ దేవిరెడ్డి వెంకట రమణా రెడ్డి కార్యనిర్వాహణాధికారి, శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం, రాయచోటి వీరి చిన్న కుమార్తె వీరి కాలేజీ ద్వారా ఆంధ్రప్రదేశ్ స్టేట్ 1 ర్యాంక్ వచ్చిన సందర్భంగా గోల్డ్ మెడల్ సిల్వర్ మెడల్ అవార్డు వచ్చిన సందర్భంగా అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణము నందు వెలసిన శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి ఆశీస్సులతో శ్రీ దేవిరెడ్డి వెంకట రమణా రెడ్డి కార్యనిర్వాహణాధికారి వీరి చిన్న కుమార్తె అయినటువంటి లేట్ డాఃఎః .గాంధీ గోల్డ్ మేడల్ మరియు డాఃఎః పాటూరు రామచంద్రా రెడ్డి మెమోరియల్ మెడల్ డాఃఎః దేవిరెడ్డి శ్రావ్య అను ఈమె డెంటల్ నందు ఓరల్ సర్జరీ ఫైనల్ 2021 సంవత్సరమునకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ లో 1 ర్యాంకు వచ్చినందున డాఃఎః మెడికల్ యూనివర్సిటీ తుమ్మల పల్లి వారి కాలక్షేత్రం నందు. 09.09.2025 న ఉదయం 11 గంటలకు ఆంధ్రప్రదేశ్ గౌరవనీయులు శ్రీ డాఃఎః . అబ్దుల్ నజీర్ , గవర్నర్ వారి ఆధ్వర్యమున సంబంధిత డాఃఎః యాదవ్ చీఫ్ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మరియు చీఫ్ కార్డియాక్ సర్జన్ నేషనల్ హార్ట్ సర్జన్ , న్యూ డిల్లి ప్రొఫీసర్, శ్రీ డాఃఎః పి. చంద్రశేఖర్ , వైస్ చాన్సలర్ , విజయవాడ వీరి ఆధ్వర్యంలో డెంటల్ ఫైనల్ బిడియస్ నందు ఓరల్ సర్జరీ నందు ఆంధ్రప్రదేశ్ స్టేట్ లో 1 ర్యాంక్ సాధించినందున గోల్డ్ మెడల్ మరియు సిల్వర్ మెడల్ అవార్డు తీసుకొన్నందున వీరి కుటుంబమంతయు మరియు తల్లి దండ్రులు సంతోషం వ్యక్తం చేసి ఉన్నారని తెలియ జేయుచున్నాను.శ్రీ డి. వి. రమణా రెడ్డికార్యనిర్వాహణాధికారి శ్రీ వీరభద్రస్వామి దేవస్థానము, రాయచోటి.

## అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి గా నాగరాజు, ఝాన్సీ రాణి

**అన్నమయ్య జిల్లా సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి రిపోర్టర్ రాణా ప్రతాప్)** ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు రాష్ట్రం లోని అన్ని జిల్లాల స్కూల్ గేమ్స్ కార్యదర్శుల నియామక పత్రాన్ని రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ విజయరామరాజు నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు అన్నమయ్య జిల్లా విద్యా శాఖ అధికారి కె. సుబ్రమణ్యం తెలిపారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం సిటిఎం జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు వై నాగరాజు, కలకడ మండలం కోన జిల్లా పరిషత్ హైస్కూల్ లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు ఝాన్సీరాణిని ఎంపిక చేసి ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె. సుబ్రహ్మణ్యం తెలిపారు. వీరు పాఠశాల క్రీడా సమాఖ్య కు సంబంధించిన అండర్ 14, అండర్ 17 విభాగాల బాల బాలికల క్రీడల నిర్వహణ లో, జట్ల ఎంపిక, స్కూల్ గేమ్స్ లో పాల్గొనే విధంగా తమ విధులు నిర్వర్తిస్తారని తెలియ జేశారు. మొట్టమొదటి సారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాలికల భద్రత సంరక్షణ దృశ్య క్రీడలలో పాల్గొన్నప్పుడు మహిళల స్కూల్ గేమ్స్ కార్యదర్శిని నియమించి వారి భద్రతకు ఎక్కువ శాతం ప్రాధాన్యత ఇస్తూ క్రీడల్లో పాల్గొనేందుకు తీసుకునే చర్యలో భాగంగా మహిళా సెక్రటరీని నియమించడం జరిగిందని రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి బాను మూర్తి రాజు, కమిషనర్ విజయరామరాజు తెలియ జేశారు.

## మానవత్వం చాటుకున్న రాయచోటి దూరదర్శన్ రిపోర్టర్ భరత్

**మతిస్థిమితం లేని బాలుడిని స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్లో అప్పగించిన దూరదర్శన్ విలేఖరి**

**తక్కువ వ్యవధిలోనే కుటుంబ సభ్యుల వద్దకు చేర్చిన అర్బన్ సీఐ బి.వి చలపతి**




**రాయచోటి సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి రాణా ప్రతాప్)** అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో మతిస్థిమితం లేక సంచరిస్తున్న ఒక బాలుడు ని గుర్తించిన దూరదర్శన్ విలేఖరి భరత్ అతనిని గుర్తించి స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్లో అప్పగించారు. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ బీ.వి చలపతి గారు అతి తక్కువ వ్యవధిలోనే మతిస్థిమితం లేని బాలుడిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. వార్త సేకరణ కాకుండా మానవ సేవలో ముందుండి తన వంతు ప్రయత్నించి బాలుడిని తమ కుటుంబ సభ్యులకు చేర్చడంలో కృషిచేసిన దూరదర్శన్ విలేఖరి భరత్ ని సిఐ అభినందించారు.

# అన్నమయ్య జిల్లాకు స్వచ్ఛంద్ర అవార్డులు తీసుకురండి

అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**అన్నమయ్య జిల్లా సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి రిపోర్టర్ రాణా ప్రతాప్)** రాష్ట్ర ప్రభుత్వం పరిశుభ్రతకు అగ్రస్థానం ఇస్తున్న నేపథ్యంలో స్వచ్ఛంధ్ర రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డుల ఎంపికలో నిర్దేశించిన ప్రతి పారామీటర్‌లో 100 శాతం అభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్సు ద్వారా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తో కలిసి స్వచ్ఛంధ్ర అవార్డులపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ స్వచ్ఛంధ్ర రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డుల ఎంపికలో ప్రతి పారామీటర్‌లో 100 శాతం అభివృద్ధి అవసరమని, నిర్దేశించిన పనిలో వెనుకబడితే సంబంధిత శాఖలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవార్డులకు లక్ష్యంగా విధించిన మొత్తం 13 కేటగిరీల్లో ఎంపిక చేసిన గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, అంగనవాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రైతు బజార్లు, బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో రాష్ట్రస్థాయి బృందాలు వివిధ పారామీటర్ల మేరకు పరిశీలించడం జరుగుతుందని ఈ మేరకు అధికారులు సిద్ధం కావాలన్నారు. ఇందుకోసం నియోజకవర్గ స్పెషల్ అధికారులు నిర్దేశించిన పారామీటర్లపై పారిశుద్ధ్య లోటుపాట్లను గుర్తించి సంబంధిత శాఖలకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. క్రింది స్థాయి సిబ్బందికి పనులు అప్పగించామన్న రీతిలో కాకుండా దగ్గరుండి పనులు చేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అంగనవాడీ కేంద్రాలు, పాఠశాలల్లో త్రాగునీటి సదుపాయం, ట్యాప్ కనెక్షన్, టాయిలెట్లు, రీడింగ్ రూమ్, స్వచ్ఛత క్లబ్, పరిసర పరిశుభ్రత వంటి అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వస్తున్న రోగులకు అవసరమైన మందులు, పరికరాలు, టాయిలెట్ల పరిశుభ్రతపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత శాఖలు పోటీ తత్వంతో, కాలక్షేపంగా కాకుండా ఉత్సాహంగా పనిచేస్తే ముఖ్యమంత్రి నుండి అవార్డు పొందే అవకాశం ఉంటుందని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖలు, అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పని చేసి స్వచ్ఛ అన్నమయ్య జిల్లాకు శ్రీకారం చుట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఓ,డిఈఓ,ఐసిడిఎస్ పిడి, డిపిఓ డిఎంహెచ్వో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సంతలో పశువులను అమ్మినట్లుగా ఆర్,సి,యం ఎయిడెడ్ పోస్టులను అమ్ముకున్న డీజీఎం జాన్సన్ చేట్టూరి పై చర్యలు తీసుకోవాలి



**వైయస్సార్ కడప జిల్లా సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి** కడప నగరంలోని ప్రకాష్ నగర్ నందు గల ఎస్సీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్,యన్ రాజా ప్రోగ్రెసివ్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొడవటికంటి నాగరాజు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో జరిగిన ఉపాధ్యాయ ఉద్యోగ నియమకాలలో ప్రభుత్వ ఉత్తర్వులను, విద్యాశాఖ వారి ఉత్తర్వులను మరియు హైకోర్టు ఉత్తర్వులను పెద్ద ఎత్తున ఉల్లంఘించి ఆర్,సి,యం మేనేజ్మెంట్ వారు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను దళారులుగా నియమించుకొని ఒక్కొక్క పోస్టును 25 నుండి దాదాపు 40 లక్షలకు అమ్ముకున్నారని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. నిరుద్యోగ అభ్యర్థులైన వారి దగ్గర నుండి సుమారు 6 కోట్ల రూపాయల వరకు వసూలు చేసుకుని లక్షల రూపాయలు జిల్లా విద్యాశాఖ అధికారుల వారికి వారి కార్యాలయ సిబ్బందికి, గతంలో పనిచేసిన డీఈవోలు అనురాధ మరియు మీనాక్షి డిప్యూటీ డిఇఓ రాజగోపాల్ రెడ్డి మరియు ఆర్జెడి, ఏడి మునీర్ ఖాన్ లు ఆర్.సి.యం యాజమాన్యంపై విచారణ జరిపి వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు అంతేకాకుండా రోస్టర్ పాయింట్ లో బీసీ-సీ అభ్యర్థులు దొరకనప్పుడు ఈ ఉద్యోగాల కొరకే మతమార్పిడులు ప్రోత్సహించి ఇద్దరికి ఉద్యోగాల అవకాశాలు కల్పించిన విషయాన్ని కూడా మీ ముందు ఉంచుతున్నామని అత్యంత ప్రధానమైన విషయం ఏమనగా ఈ జిల్లా విద్యాశాఖ అధికారులు కానీ ఆర్జెడి కానీ సెలెక్ట్ అయినటువంటి అభ్యర్థికి ఏ పాఠశాలలో కేటాయించకుండా కేవలం వారి ఉత్తర్వులలో రోస్టర్ పాయింట్లు వారు పేర్లు మాత్రమే ప్రచురించి ఉత్తర్వులు మేనేజ్మెంట్ వారికి అందించడం జరిగినదని ఇదే అదునుగా అవకాశం గా తీసుకొని మేనేజ్మెంట్ వారు వారి చేతివాటం ప్రదర్శించి వారికి అనుకూలమైనటువంటి వ్యక్తులకు అనుకూలమైన పాఠశాలను కేటాయిస్తూ తప్పుదోవ పట్టిస్తూ సొంత ఆర్డర్లను తయారు చేసుకొని ఈ సొంత ఆర్డర్ల మీద కొంతమంది ఎంఈఓ లు మరియు హై స్కూల్ పాఠశాల ఉపాధ్యాయ సర్వీస్ కమిషన్ ఓపెన్ చేసి ఆ రిజిస్టర్ ప్రకారం కూడా పొజిషన్ ఐడీలను క్రియేట్ చేసి తద్వారా సబ్ ట్రెజరీల ద్వారా జీతాలు పొందుతున్నారంటే ఎంత అవినీతి జరిగింది ఉంటుందో అర్థం చేసుకోవచ్చు అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా పోరామిళ్ళ మండలం అక్కల్ రెడ్డి పల్లి గ్రామానికి నూతన ఉత్తర్వులు పొందుండగా అక్కడ విద్యార్థులు లేని కారణంగా పాఠశాలలు మూసి వేయడం జరిగినది కానీ ఆ పాఠశాలకు నూతన ఉపాధ్యాయ పోస్టులు కేటాయించి ఎక్కడో ఉన్న అన్నమయ్య జిల్లా రామాపురం మండలం ఆర్,సి,యం స్కూల్ నందు జీతభత్యాలు చెల్లిస్తూ తప్పుడు దారిలో జీతాలు పొందుతూ ఇలాంటి మరెన్నో దారుణాలు ఆర్,సి.యం యాజమాన్యం చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు మేము ఒకటే డిమాండ్ చేస్తున్నాం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు విద్యాశాఖ సెక్రటరీ గారు వెంటనే స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మేము ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం లేనిపక్షంలో రాబోయే కాలాలలో విద్యార్థి యువజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాం ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎదురు బాబు జిల్లా అధ్యక్షుడు కొట్టం సుబ్బారావు రెవల్యూషనరీ యువజన సంఘం కడప జిల్లా అధ్యక్షుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు

# వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి

**గోపవరం సెప్టెంబర్ 10( ప్రజా జ్యోతి న్యూస్)** బుధవారం నాడు బద్వేల్ పట్టణంలో వృద్ధుల అసోసియేషన్ కార్యాలయం నందు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సామాజిక పింఛన్ దారు ల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పడిగా వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి. వృద్ధులకు 6000 వికలాంగులకు10000పింఛన్ఇవ్వాలి. రాష్ట్రంలోవృద్ధులువితం తువులు,ఒంటరి మహిళలు, విభిన్న ప్రతిభావంతులు సంక్షేమానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 13% పైగా 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు జీవిస్తున్నారని, వీరుగాక తీవ్ర అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ అందిస్తున్న పదిహేను వేలు నెలసరి పెన్షన్ పొందుతున్న వారితోపాటు విభిన్న ప్రతిభావంతులు వితంతువులు సుమారు 80 లక్షల పైగా రాష్ట్రంలో ఉన్నారని, అరకొర వస్తున్న 4000 పింఛన్ కొంత ఉపశమనం, ఆత్మస్థైర్యం కలిగించడానికి తోడ్పడిందని అయితే అది పూర్తిస్థాయిలో వృద్ధులకు 6000 వికలాంగులకు 10000 ఇచ్చి తోడ్పాటు అందించాలని ఆయన కోరాడు. రాష్ట్రంలో వృద్ధులు వికలాంగులు, వితంతువులు వివిధ అనారోగ్య కారణాలతో బాధలనుభవిస్తున్న వారు చాలామంది ఉన్నారు, వారికి నిరంతరం సంక్షేమం అమలు జరుపుటకు ఒక ప్రత్యేక రాష్ట్ర స్థాయి కమిషన్ ఏర్పాటు చేసి సంక్షేమ పెన్షన్ నిబంధనలను తరలించి అర్హత కలిగి ఉన్న భార్యాభర్తలు కి పింఛన్ మంజూరు చేసి న్యాయం చేకూర్చాలని,ప్రతి జిల్లాలో ప్రభుత్వపరంగా వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలని, ఔత్సహికులు ఏర్పాటు చేసి వృద్రాసమాలకు తగిన గ్రాంట్లు ప్రోత్సాహాలను అందించాలని, వృద్ధులకు అవసరమైన నిత్యవసర వస్తువులు సివిల్ సప్లై శాఖ ద్వారా అందించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఆయా వృద్ధా ఆశ్రమాలలో నివసిస్తున్న వారికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందించాలని అన్ని రకాల రైళు బస్సులు సీనియర్ సిటిజనులకు 50 శాతం రాయితీపై ప్రయాణ సదుపాయాన్ని కల్పించాలని సీనియర్ సిటిజెన్ల పిల్లలు సరిగా చూడని పరిస్థితిలో ఏర్పడినప్పుడు బహుమతిగా ఇచ్చిన ఆస్తులు తిరిగి తమ దగ్గర ఉంచుకునేలా ప్రత్యేక జీవో తేవాలని బ్యాంకుల్లో రివర్స్ మార్ట్ గేజ్ స్కీం అమలుకు



అవకాశం కల్పించాలని సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి రాష్ట్రస్థాయి కమిటీ తోపాటు, ప్రత్యేక డిపార్ట్మెంట్ ను అన్ని జిల్లా సీనియర్ అధికారితో కూడిన వ్యవస్థ ఏర్పాటు చేయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వయోవృద్ధుల విభిన్న ప్రతిభావంతుల వితంతువులు, వ్యాధిపీడతల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలపై రేడియో టీవీలో మీడియా ద్వారా ప్రజల కు అవగాహన కల్పించాలని ఆయన కోరాడు.

## తల్లి ఆత్మహత్య..

## గుక్కపెట్టి ఏడ్చిన చిన్నారులు

**కరీంనగర్** : ఎల్లారెడ్డిపేటలో రమ్య అనే మహిళ తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన ఆమె ముగ్గురు పిల్లలు, తల్లిని విగతజీవిగా చూసి 'లే మమ్మీ' అంటూ కన్నీరుమున్నీరయ్యారు. కృష్ణహరి, రమ్య దంపతులకు లాస్య(5), ప్రణవ్(6), నిషాల్ (5) సంతానం. రెండేళ్ల క్రితం భర్త కృష్ణహరి దుబాయ్ వెళ్లగా, రమ్య పిల్లలతో కలిసి ఇంట్లో ఉంటోంది. అత్తామామలతో జరిగిన చిన్న ఘర్షణతో మనస్తాపం చెంది రమ్య ఈ దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. పిల్లల రోదన చూపరులను కంటతడి పెట్టించింది.

## రైతు వేదిక వద్ద క్యూలో నిలబడిన రైతులు:

**మానకొండూరు** : రాజన్న సిరిసిల్ల జిల్లా మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని రైతు వేదిక వద్ద బుధవారం (10/09/2025) వందలాది మంది రైతులు ఉదయం నుండే క్యూ కట్టి నిలబడ్డారు. భార్యాపిల్లలతో సహా వచ్చిన రైతులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెస్తానన్న మార్పు ఇదేనా అని ప్రశ్నిస్తున్నారు.

## చాకలి ఐలమ్మ ఘన నివాళి

**హుజూరాబాద్** : రాజన్న సిరిసిల్ల జిల్లా మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలంలో బుధవారం, 10 సెప్టెంబర్ 2025న, చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట గ్రామ రజక సంఘం అధ్యక్షుడు లింగంపల్లి రవీందర్, తెలంగాణ శీను, రాజు, అజయ్ పాల్గొన్నారు.

## యంగ్ డైనమిక్ లీడర్ రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు



**రాయచోటి సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి** మాటకు కట్టుబడి నైజం కార్యకర్తలకు అండదండగా ఉండి ప్రజల బాగోగుల కోసం అనుక్షణం పోరాటం చేసే నాయకుడు ప్రజల మనిషి అన్నమయ్య జిల్లా ముద్దుబిడ్డ రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు మీరు ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి నిండు నూరేళ్లు వర్ధిల్లాలని శ్రీ వెంకటేశ్వర స్వామిని వేడుకుంటున్నాను.రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్

## రామసముద్రం మండలం మినికి గ్రామంలో యూరియా నిల్వలు మరియు యూరియా పంపిణీని ఆకస్మిక తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ కళ్యాణి



**రామసముద్రం, సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి** రామసముద్రం మండలం మినికి గ్రామంలో యూరియా నిల్వలు మరియు రైతులకు యూరియా పంపిణీ ని మదనపల్లి సబ్ కలెక్టర్ కళ్యాణి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండించే ప్రతి ఎకరాకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. సాగు చేస్తున్న ప్రతి రైతుకు యూరియా అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారికి ఇతర సిబ్బందికి తగు సూచనలు చేశారు.

## హనుమాన్ ఆలయంలో సంకష్టహర చతుర్థి పూజ

**ఆదిలాబాద్** : ఆదిలాబాద్ పట్టణంలోని తిలక్ నగర్ కాలనీలో ఉన్న శ్రీ పంచముఖి హనుమాన్ ఆలయంలో సంకష్టహర చతుర్థి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి శివ శ్రీ రామగిరి చంద్రకాంతయ్య ఆధ్వర్యంలో ఉదయం నుండి అర్చన, అభిషేక, వస్త్రాలంకణన, పుష్పం ధారణ, అష్టోత్తరాలు, హారతి, ఆశీర్వచనము, తీర్థ ప్రసాద వితరణ వంటి పూజాది కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్పూర్తిని చాటిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**బోథ్** : భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నేరడిగొండ మండలం తేజపూర్ గ్రామంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఐలమ్మ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రజక సంఘం సభ్యులతో కలిసి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ అండగా ఉంటుంది:

**ఖానాపూర్** : ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్ ఛార్జ్ జాన్సన్ నాయక్, అనారోగ్యంతో మృతి చెందిన పెంబి మండలంలోని అంకేన గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు లావుడ్య శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీనివాస్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని జాన్సన్ నాయక్ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లి కృష్ణారావు బాసర పర్యటన

**ముథోల్** : బాసర మండలంలోని జ్ఞాన సరస్వతి దేవాలయాన్ని సందర్శించిన జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు, ముథోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు శ్రీ భోస్లె నారాయణ్ రావు పటిల్ చేత స్వాగతం అందుకున్నారు. మంత్రి బాసరలో వరద ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలించి, ట్రిబుల్ ఐటీ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం, బాసరలో 30 పడకగదుల ఆసుపత్రికి శంకుస్థాపన చేశారు.

## చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి

**నిర్మల్** : నిర్మల్ జిల్లా మామడ మండలంలోని కొరటికల్ గ్రామంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బడుగు బలహీన వర్గాల కోసం ఆమె చేసిన పోరాటాన్ని, భూమికోసం భుక్తి కోసం రజకారులకు వ్యతిరేకంగా పోరాటం చేసి అసువులు బాసిన ఆమె స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. తమ జాతితో పాటు అణగారిన వర్గాలకు చెందాల్సిన ప్రతిఫలాలను ప్రభుత్వం చే అందేలా కృషి చేస్తామని రజక సంఘం మామడ మండల అధ్యక్షుడు ఏటి రాజేశ్వర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పల్లి రాజేశ్వర్, నర్సరాజు, మామడ రవీందర్, పల్లి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరు స్పూర్తిగా తీసుకోవాలి

**వేములవాడ** : రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ సముదాయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొని, ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఐలమ్మ ఒక గొప్ప పోరాట యోధురాలని, ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ అన్నారు.

## బంగారం ధరల పెరుగుదలతో అప్పుల బాధ:

**సిరిసిల్ల** : రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం ఓగులాపూర్ గ్రామానికి చెందిన 53 ఏళ్ల ముందరాయి సత్యం, అవుసుల పని చేస్తూ సిద్దిపేటలో కుటుంబంతో నివసిస్తున్నాడు. బంగారం ధరలు విపరీతంగా పెరగడంతో పనిలేక, అప్పుల బాధతో, కుటుంబ పోషణ భారమై గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు విచారణ ప్రారంభించారు.



# వంకాయతో ఈ సమస్యలకు చెక్ !

వంకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఉండే ఫ్రీరాడికల్స్ ను నశింపజేసి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా కాపాడడంలో సహాయపడతాయి. వంకాయలో పిండి పదార్థాలు, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. వంకాయలోని పొటాషియం శరీరంలోని హైడ్రైట్లను తొలగించి గుండె సమస్యలను నివారిస్తుంది. వంకాయ శరీరంలో కొవ్వులను కరిగిస్తుంది. వంకాయ ఆరోగ్యానికి చాలా మంచిది. విటమిన్లు, ఖనిజాలతో నిండి ఉంది. పలు రకాల ఆరోగ్య సమస్యలు రాకుండా చెక్ పెట్టొచ్చునని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. వంకాయ తినటం వల్ల గుండె సమస్యలకు అడ్డుకట్ట వేయవచ్చు. ఇది కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లను తగ్గిస్తుంది. గుండె జబ్బులకు ప్రధాన కారణమయ్యేవాటి నుంచి కాపాడుతుంది. వంకాయలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. వంకాయ తీసుకోవటం వల్ల గ్లూకోజ్ శోషణను నెమ్మదిస్తుంది. రక్తంలో చక్కెర అకస్మాత్తుగా పెరగదు. మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ ఆహారంలో వంకాయను చేర్చుకుంటే మంచి ఫలితాలు పొందొచ్చు. వంకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఉండే ఫ్రీరాడికల్స్ ను నశింపజేసి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా కాపాడడంలో సహాయపడతాయి. వంకాయలో పిండి పదార్థాలు, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. వంకాయలోని పొటాషియం శరీరంలోని హైడ్రైట్లను తొలగించి గుండె సమస్యలను నివారిస్తుంది. వంకాయ శరీరంలో కొవ్వులను కరిగిస్తుంది. వంకాయలోని ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ బీ3, బీ6, బీటా కెరోటిన్, యాంటీఆక్సిడెంట్లు తదితర పోషకాలు గుండెపోటు ముప్పును తగ్గిస్తాయి. రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తాయి. వంకాయ తినడం బరువు తగ్గడానికి చాలా మంచిది. ఇది కొవ్వు బర్నింగ్ రేటును మరింత పెంచుతుంది. టైప్-2 మధుమేహం రోగుల రక్తంలోని చక్కెర్ల (గ్లోకోజ్) స్థాయిని తగ్గించడంలో వంకాయ బాగా పనిచేస్తుంది. రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది.

# అదే పనిగా ఆవలింతలు వస్తున్నాయా?



ఆవలింత అనేది సాధారణంగా అందరికీ ఉంటుంది..కానీ, ఇది ఎప్పుడు, ఎందుకు వస్తుందోనని మీరెప్పుడైనా ఆలోచించారా? సాధారణంగా ఎవరైనా ఆవలిస్తే అది నిద్రకు సంకేతంగా భావిస్తారు. మీ పక్కన ఉన్నవారు ఆవలించినా మీకు ఆవలింతలు వస్తాయి. అలాగే, కొంతమందికి తరచుగా ఆవలింతలు వస్తుంటాయి.  అలసట ఎక్కువగా ఉండటం వల్ల ఆవలింతలు వస్తాయి. తగినంత విశ్రాంతి లేకపోవడం, బాగా అలసిపోవడం కారణంగా నిరంతరం ఆవలింతలు వస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.. నిద్రలేమి కూడా ఆవలింతలు రావడానికి కారణం. మీకు నిరంతరం ఆవలింతలు వస్తున్నాయంటే మీ శరీరం మరింత విశ్రాంతి కోరుకుంటుందని అర్థం. స్లీప్ ఆప్నియా, నార్కొలెప్సీ వంటి నిద్ర సమస్యల వల్ల సరిగా నిద్రపట్టదు. దీని వల్ల ఆవలింతల ఎక్కువగా వస్తాయి. ఆందోళన, డిప్రెషన్ వంటి మానసిక సమస్యల వల్ల కూడా ఆవలింతలు ఎక్కువగా వస్తాయని నిపుణులు అంటున్నారు.. కాబట్టి ఆందోళన, కుంగుబాటుతనం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. ఒత్తిడి వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. ఒత్తిడి అధికంగా ఉన్నప్పుడు ఆవలింతలు ఎక్కువగా వస్తాయి. అంతేకాదు..నాడీ సంబంధిత సమస్యల వల్ల కూడా ఆవలింతలు ఎక్కువగా వస్తాయని నిపుణులు చెబుతున్నారు.. మీకు అదే పనిగా ఆవలింతలు వస్తే నాడీ వ్యవస్థను కాపాడుకోవాలని సూచిస్తున్నారు. ఎక్కువగా వచ్చే ఆవలింతలు గుండె సమస్యలకు సంకేతంగా ఉంటాయి. ఛాతీ నొప్పితో పాటు ఆవలింతలు ఉంటే వైద్యుడ్ని కలవండి. రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గడం వల్ల కూడా ఆవలింతలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి రక్తంలో సరైన చక్కెర స్థాయిలను మెయింటేన్ చేయండి. అలాగే, సరిపడా నీరు తాగకపోవడం వల్ల కూడా ఆవలింతలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు.. డీహైడ్రేషన్ వల్ల అదేపనిగా ఆవలింతలు వస్తాయని అంటున్నారు.. ఇలాంటప్పుడు ఎక్కువగా నీరు తాగాలని సూచిస్తున్నారు.

# తాటి మిఠాయి ఆరోగ్య ప్రయోజనాలు



ఆసియా, ఆఫ్రికా, అమెరికాలోని కొన్ని ప్రాంతాలలో ఉపయోగించే తాటి బెల్లం ప్రధానంగా అనేక ఆహార పదార్థాలలో ఉపయోగించబడుతుంది. ఒకప్పుడు అందరి వంటగదిలో బెల్లం దొరికేది. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన ఈ బెల్లం నేటికీ దాని డిమాండ్ తగ్గలేదు. కానీ నేటి తరానికి దాని గురించి తెలియదు. తాటి బెల్లం అద్భుతమైన రుచిని కలిగి ఉంటుంది. తాటి బెల్లం తయారీ ప్రక్రియలో ఎటువంటి రసాయనాలను ఉపయోగించరు. కాబట్టి, ఇది సహజ చక్కెర. ఇందులో చక్కెర కంటే తక్కువ చక్కెర ఉంటుంది. తాటి బెల్లం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. బెల్లం రక్తహీనతకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని చాలా మందికి తెలియదు. బెల్లంలో ఉండే ఐరన్ కంటెంట్ రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని నిర్వహించడానికి సహాయపడుతుంది. కంటి చూపు మెరుగుపడటానికి బెల్లం పాలలో కలిపి తినండి. కాల్షియం, పొటాషియం పుష్కలంగా ఉండే తాటి బెల్లం పాలు ఎముకలు, దంతాలను బలోపేతం చేస్తుంది. బెల్లం తినడం వల్ల కలిగే మరో ముఖ్యమైన ప్రయోజనం ఏమిటంటే జీర్ణ రుగ్మతల నుండి ఉపశమనం కలిగించే సామర్థ్యం దీనికుంది. ఇది జీర్ణ ఎంజైమ్‌లను సక్రియం చేయడమే కాకుండా ప్రేగు కదలికలను నియంత్రిస్తుంది. మలబద్ధకం, అజీర్ణం నుండి ఉపశమనం కలిగిస్తుంది. చాలా మంది పిల్లలు నోటి పూతలతో బాధపడుతున్నారు. గాయం మీద ఏలకులు, బెల్లం పొడి పూయడం వల్ల నొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది. నోటి పూతలు కూడా తగ్గుతాయి. గతంలో, జలుబు ఉన్న పిల్లలకు మందు ఇవ్వడానికి బదులుగా, వారు వారికి బెల్లం తినిపించేవారు. ఇది జలుబు నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఇది శ్లేష్మాన్ని మృదువుగా చేస్తుంది. పేరుకుపోయిన శ్లేష్మాన్ని తొలగిస్తుంది. నల్ల మిరియాలు, నెయ్యితో బెల్లం కలిపి తాగడం వల్ల గొంతు నొప్పి తగ్గుతుంది. తాటి బెల్లం తరచూ తినడం వల్ల ఇది కాలేయాన్ని శుభ్రపరుస్తుంది. మీ శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపుతుంది. రక్తాన్ని శుభ్రపరుస్తుంది. శరీరానికి అవసరమైన రోగనిరోధక శక్తిని పెంచుతుంది. తాటి బెల్లం మీ పొట్టను శుభ్రపరుస్తుంది. పేగులు బాగా పనిచేయడానికి సహాయపడుతుంది.

# సరిగ్గా ఆకలిగా వేయట్లేదా? ఆ వ్యాధికి సంకేతం కావచ్చు

సరిగ్గా ఆకలి వేయకపోవడం, కొద్ది తిన్నా కడుపు నిండినట్లు అనిపించడం వంటి సమస్యలను ఈ మధ్యా చాలా మంది ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య వెనుక అనేక కారణాలు ఉన్నప్పటికీ, విటమిన్ బి1 (థియామిన్) లోపం ప్రధాన కారణాలలో ఒకటి అని ఆరోగ్య నిపుణులు, యుఎస్ నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్ నివేదికలు చెబుతున్నాయి. శరీరంలో జీవక్రియ సరిగ్గా జరగడానికి విటమిన్ బి1 చాలా అవసరం. మనం తినే ఆహారాన్ని శక్తిగా మార్చడంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. శరీరంలో ఈ విటమిన్ స్థాయి తగ్గినప్పుడు, జీవక్రియ మందగిస్తుంది. దీనివల్ల ఆకలి లేకపోవడం, అలసట, బలహీనత వంటి సమస్యలు వస్తాయి. అలాగే విటమిన్ బి1 లోపం ఆకలిని తగ్గించడమే కాకుండా, శరీరంలోని నాడీ వ్యవస్థ, జీర్ణవ్యవస్థ, కండరాల పనితీరును కూడా ప్రభావితం చేస్తుంది. ఇది మానసిక గందరగోళం, చిరాకు మరియు ఏకాగ్రత లేకపోవడం వంటి సమస్యలకు దారితీస్తుంది. ఈ సమస్య ఎక్కువగా వృద్ధులలో కనిపిస్తున్నప్పటికీ, యువతలో కూడా దీని ప్రభావం పెరుగుతోంది. విటమిన్ బి1 లోపాన్ని అధిగమించడానికి సరైన ఆహారాన్ని తినడం చాలా ముఖ్యం. దీని కోసం, మీ రోజువారీ ఆహారంలో ఈ క్రింది పదార్థాలను చేర్చండి. తృణధాన్యాలు, చిక్కుళ్ళు: ఇవి విటమిన్ దీ1 యొక్క మంచి వనరులు. ఆకుకూరలు: పాలకూర, బ్రోకలీ వంటి ఆకుకూరల్లో థయామిన్ పుష్కలంగా ఉంటుంది వీటిని ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఈ లోపాన్ని దూరం చేయవచ్చు గింజలు, ఎండిన పండ్లు: విటమిన్ బి1 వాల్‌నట్స్, వేరుశెనగలు, పొద్దుతిరుగుడు విత్తనాలలో లభిస్తుంది. మాంసాహారం: ఈ విటమిన్ లోపాన్ని చేపలు, చికెన్ వంటి మాంసాహార ఆహారం ద్వారా కూడా భర్తీ చేయవచ్చు గమనిక: ఈ సమస్య డైట్ పాటించడం ద్వారా తగ్గకపోతే, మీరు వైద్యుడిని సంప్రదించి సప్లిమెంట్లు తీసుకోవచ్చు. అయితే, వైద్యుడిని సంప్రదించకుండా మీరు మీరే ఎటువంటి సప్లిమెంట్లను తీసుకోకూడదు. సరైన జీవనశైలి, ఒత్తిడిని తగ్గించడం, తగినంత నిద్రపోవడం కూడా ఆకలిని పెంచడానికి సహాయపడుతుంది. మీకు ఈ సమస్యలు చాలా కాలంగా ఉంటే, నిపుణుడిని సంప్రదించడం మంచిది.



## బిజినెస్

### భారత్‌లో 100 మంది ఉద్యోగులను తొలగించిన ఒరాకిల్




టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెటా సహా పలు కంపెనీలు పెద్ద ఎత్తున లేఆఫ్‌లు ప్రకటించాయి. ఇందులో భాగంగా ఒరాకిల్ కూడా భారత్‌లో ఉద్యోగులను తొలగించింది. పునర్నిర్మాణంలో భాగంగా కంపెనీ భారత్‌లోని 100 మందికి పైగా ఉద్యోగులకు లేఆఫ్‌కు సంబంధించి లేఖలు పంపినట్టు సమాచారం. ఈ తొలగింపులు క్లౌడ్ విభాగంతో పాటు అన్ని విభాగాల్లోని ఉద్యోగులపై ప్రభావం చూపాయి. సంస్థాగత మార్పులలో భాగంగా ఈ తొలగింపు నిర్ణయం తీసుకునాం. తొలగించిన ఉద్యోగులకు 15 రోజుల జీతంతో పాటు ఏడాది వరకు వైద్య బీమా కవరేజీ అందిస్తామని కంపెనీ లేఖలో పేర్కొంది. ఈ లేఆఫ్‌లో 15-20 ఏళ్ల అనుభవం ఉన్న ఉద్యోగులు కూడా ఉండటం గమనార్హం. కంపెనీ నిర్ణయాన్ని కొందరు ఉద్యోగులు ఆకస్మిక నిర్ణయమని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఏఐ వినియోగం పెరగడం, కంపెనీ ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నాల్లో ఉండటం లాంటి మార్పుల కారణంగా ఈ నిర్ణయం తీసుకుందని కొందరు ఉద్యోగులు పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు(ఏఐ), సామర్థ్యాన్ని పెంచుతున్నందున ఒరాకిల్ ప్రపంచవ్యాప్తంగా 3,000 మందికి పైగా సిబ్బందిని తొలగించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం భారత్‌లో కంపెనీకి 30 వేల మంది ఉద్యోగులున్నారు.

### వారంలో మూడు రోజులు ఆఫీసుకు రావాల్సిందే..




వర్క్ ఫ్రమ్ హోమ్‌కు స్వస్తి పలుకుతూ ఐటీ కంపెనీలు ఉద్యోగులను కార్యాలయాలకు రప్పించే పనిలో పడ్డాయి. తాజాగా అందులో టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ కూడా చేరింది. ఉద్యోగులు వచ్చే ఏడాది నుంచి వారంలో కనీసం మూడు రోజులైనా ఆఫీసుకి రావాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈ మేరకు బ్లాగ్‌లో ఓ పోస్టు పెట్టింది. ఈ విధానాన్ని మూడు దశల్లో అమలుచేయనున్నట్లు మైక్రోసాఫ్ట్ చీఫ్ పీపుల్ ఆఫీసర్ అమీ కోల్‌మాన్ బ్లాగ్‌లో పేర్కొన్నారు. తొలుత వాషింగ్టన్, రెడ్‌మండ్ కంపెనీ ప్రధాన కార్యాలయంలోని ఉద్యోగులతో దీన్ని మొదలుపెట్టనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్యాలయాల్లో ఇదే విధానం అమలవుతుందని వెల్లడించారు. కంపెనీ ప్రధాన కార్యాలయం నుంచి 50 మైళ్ల దూరంలో నివసించే ఉద్యోగులకు 2026 ఫిబ్రవరి చివరి నుంచి ఈ విధానం అమలుకానున్నట్లు వివరించారు. ఈ క్రమంలో అమెరికాలోని మిగిలిన ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగులు కార్యాలయాలకు వచ్చే విషయానికి సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. మహమ్మారి సమయంలో మొదలైన వర్క్ ఫ్రం హోమ్ కల్చర్ నుంచి దాదాపు అన్ని కంపెనీలు బయటకు వస్తున్నాయి. తమ ఉద్యోగుల్ని తిరిగి ఆఫీసులకు రప్పించేందుకు ఐటీ సంస్థలు అనేక చర్యలు చేపడుతున్నాయి. హెచ్‌సీఎల్, అమెజాన్, ఇన్ఫోసిస్, టీసీఎస్‌వంటి కంపెనీలు ఇప్పటికే ఉద్యోగులను ఆఫీసుకు వచ్చి పనిచేసేలా ప్రోత్సహిస్తున్నాయి.

# ధరలు తగ్గించిన మరిన్ని వాహన తయారీ కంపెనీలు

తగ్గిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేట్ల ప్రయోజనాలను వినియోగదారులకు అందించడానికి కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే పలు వాహన తయారీ కంపెనీలు తగ్గింపు ధరల వివరాలను ప్రకటించాయి. మంగళవారం మరిన్ని టూ-వీలర్, కార్ల తయారీ కంపెనీలు ధరల వివరాలను వెల్లడించాయి. అందులో ప్రముఖ బజాజ్ ఆటో జీఎస్టీ సంస్కరణల ఫలాలను పూర్తిగా వినియోగదారులకు బదిలీ చేస్తామని స్పష్టం చేసింది. పన్ను రేట్ల తగ్గింపు బజాజ్, కేటీఎం మోటార్‌సైకిళ్లు, స్కూటర్లపై రూ. 20,000, త్రీ-వీలర్లపై రూ. 24,000 వరకు తగ్గిస్తున్నట్టు తెలిపింది. మరో టూవీలర్ కంపెనీ యమహా సైతం అన్ని మోడళ్లపై రూ. 17,581 వరకు తగ్గిస్తున్నామని చెప్పింది. సవరించిన ధరల ప్రకారం, ఆర్15 మోటార్‌సైకిల్ రూ. 2.12 లక్షల నుంచి రూ. 1.94 లక్షలకు, రేజర్ బైక్ రూ. 7,759 తగ్గి రూ. 93,760కే అందుబాటులో ఉంటుందని కంపెనీ వివరించింది. ఇదే బాటలో కార్ల తయారీ కంపెనీలు కూడా తగ్గింపు ధరలను ప్రకటించాయి. హోండా కార్స్ ఇండియా తమ అన్ని కార్లపై రూ. 95,500 వరకు తగ్గించామని పేర్కొంది. కాంపాక్ట్ సెడాన్ అమేజ్ కారుపై రూ. 95,500, సిటీ కారుపై రూ. 57,500, ఎలివేట్ రూ. 58,400 వరకు తగ్గుతాయని వెల్లడించింది. మరో కంపెనీ జీప్ ఇండియా కూడా తమ కార్లపై మోడల్, వేరియంట్‌ని బట్టి రూ. 1.26 లక్షల నుంచి రూ. 4.8 లక్షల వరకు తగ్గుతాయని వెల్లడించింది. ప్రీమియం కార్ల కంపెనీ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) తన అన్ని మోడళ్లపై రూ. 4.5 లక్షల నుంచి రూ. 30.4 లక్షల వరకు తగ్గింపు అమలు చేస్తామని తెలిపింది. అలాగే, వోల్వో కార్ ఇండియా కూడా అన్ని మోడళ్లపై రూ. 6.9 లక్షల వరకు తగ్గిస్తామని పేర్కొంది.



### ఐఫోన్ 17 సిరీస్ విడుదల చేసిన యాపిల్



ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూసే టెక్ దిగ్గజం యాపిల్ ఐఫోన్ కొత్త సిరీస్ లాంచ్ మంగళవారం జరిగింది. 'ఆ.. డ్రాపింగ్' పేరుతో యాపిల్ పార్క్‌లో ఈవెంట్ నిర్వహించింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 10.30 గంటలకు జరిగిన కార్యక్రమంలో యాపిల్ తన కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించింది. ఐఫోన్ 17 సిరీస్‌లో భాగంగా కంపెనీ కొత్తగా ఐఫోన్ ఎయిర్ మోడల్‌ను తీసుకొచ్చింది. ఐఫోన్ 17, ఐఫోన్ 17 ప్రో, ఐఫోన్ 17 ప్రో మాక్స్, ఐఫోన్ ఐఫోన్ ఎయిర్ పేర్లతో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈసారి ప్లస్ మోడల్‌కు బదులుగా ఎయిర్‌ను తీసుకొచ్చింది. వీటితో పాటు యాపిల్ ఎయిర్‌పాడ్స్ ప్రో3, యాపిల్ వాచ్ అల్ట్రా 3, యాపిల్ వాచ్ సిరీస్ 11, యాపిల్ వాచ్ ఎస్‌ఈలను విడుదల చేసింది. ఏ19 చిప్‌సెట్ ద్వారా పనిచేసే కొత్త ఐఫోన్ ఐఓఎస్ 26తో, విజువల్ ఇంటెలిజెన్స్, లైవ్-ట్రాన్స్‌లేషన్ ఫీచర్స్ కలిగి ఉంది. ఈసారి ఈవెంట్‌లో యాపిల్ నుంచి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సూపర్ స్లిమ్ ఐఫోన్ 17 ఎయిర్‌ను 5.5ఎంఎం మందంతో విడుదల చేసింది. ఈ పరికరం ఏ19 ప్రో చిప్‌సెట్, 6.6-అంగుళాల సూపర్ రెటినా ఎక్స్‌డీఆర్ డిస్‌ప్లేతో వస్తుంది. ది ఎయిర్ కొత్త ఎన్1 చిప్ ద్వారా అప్‌గ్రేడ్ చేసిన వైఫై7, బ్లూటూత్6తో లభిస్తుంది. అంతేకాకుండా 48ఎంపీ డ్యూయల్-కెమెరా సిస్టమ్‌తో వచ్చే ఐఫోన్ ఎయిర్ రోజంతా బ్యాటరీ వాడేలా 40 గంటల వరకు వీడియో ప్లేబ్యాక్ చేయొచ్చని, ప్రత్యేకంగా ఈ ఫోన్‌లో ఈ-సిమ్ సౌకర్యం ఉంటుందని కంపెనీ వెల్లడించింది. కొత్త ఐఫోన్ 17 సిరీస్ కోసం సెప్టెంబర్ 12 నుంచి ప్రీ-బుకింగ్ ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 19 నుంచి డెలివరీలు అందిస్తామని కంపెనీ తెలిపింది.

### జీఎస్టీ సంస్కరణలు, ట్రంప్ టారిఫ్‌కు సంబంధం లేదు




వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణలకు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన అధిక సుంకాలకు ఎలాంటి సంబంధం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.మంగళవారం జాతీయ మీడియా నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థిక మంత్రి.. ట్రంప్ టారిఫ్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకునే జీఎస్టీ రేట్ల తగ్గింపు నిర్ణయం వెలువడిందనే ఊహాగానాలను కొట్టిపారేశారు. ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీ మినహాయింపు మొదలుకొని జీఎస్టీ శ్లాబుల తగ్గింపు వరకు గడిచిన 18 నెలలుగా చర్చలో ఉన్నాయి. గతేడాది కేంద్ర బడ్జెట్‌కు ముందు నుంచే ఈ సంస్కరణల రూపకల్పన జరుగుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సామాన్యులకు ఉపశమనం అందించాలని నాకు గుర్తు చేస్తూనే ఉన్నారని వివరించారు. అమెరికా ఎగుమతి అయ్యే 48 బిలియన్ డాలర్ల నష్టాన్ని భర్తీ చేసేందుకే జీఎస్టీ పన్ను తగ్గింపు నిర్ణయం తీసుకున్నారనే చర్చ జరుగుతోంది. ఆ రెండింటికి సంబంధం లేదు. సంస్కరణల ప్రతిపాదనల సిద్ధం చేసేందుకు సమయం పట్టింది. ఈ ఏడాది మే నెలలోనే ప్రధాని ఈ విషయంపై సంప్రదించానని చెప్పారు. సంస్కరణల గురించి అంతర్గతంగా చర్చించి, ఆపై జీఎస్టీ కౌన్సిల్ ముందుకు తీసుకెళ్లామని స్పష్టం చేశారు.

## స్పోర్ట్స్

# చరిత్ర సృష్టించిన అఫ్గన్ ప్లేయర్.. ఆల్‌టైమ్ రికార్డు!



ఆసియా కప్-2025 టోర్నమెంట్‌ను అఫ్గనిస్తాన్ క్రికెట్ జట్టు ఘన విజయంతో ఆరంభించింది. హాంకాంగ్‌ను 94 వికెట్ల తేడాతో చిత్తు చేసి ఈ టోర్నీలో తొలి గెలుపు నమోదు చేసింది. అబుదాబి వేదికగా మంగళవారం మొదలైన ఈ టీ20 ఈవెంట్ తొలి మ్యాచ్‌లో గ్రూప్- 'బి'లో భాగమైన అఫ్గనిస్తాన్- హాంకాంగ్ తలపడ్డాయి. టాస్ గెలిచిన అఫ్గన్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుని.. నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 188 పరుగులు సాధించింది. ఓపెనర్ సెదీఖుల్లా అజేయ అర్ధ శతకం (52 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లు)తో అద్భుత ప్రదర్శన కనబరచగా.. నాలుగో స్థానంలో వచ్చిన మహ్మద్ నబీ (26 బంతుల్లో 33) ఫర్వాలేదనిపించాడు.

ఆకాశమే హద్దుగా.. ఇరవై బంతుల్లోనే

ఇ?క లోయర్ ఆర్డర్‌లో అఫ్గన్ ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం ఇరవై బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మొత్తంగా 21 బంతులు ఎదుర్కొన్న ఈ కుడిచేతి వాటం బ్యాటర్.. 53 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో రెండు ఫోర్లతో పాటు ఏకంగా ఐదు సిక్సర్లు ఉన్నాయి.

**సూర్య రికార్డు బద్దలు.. సరికొత్త చరిత్ర**

ఈ క్రమంలోనే ఒమర్జాయ్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఆసియా కప్ టీ20 టోర్నీలో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డు సాధించాడు. టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను వెనక్కి నెట్టి ఈ ఘనత సాధించాడు. కాగా ఆసియా కప్-2022 సందర్భంగా సూర్య హాంకాంగ్‌పై 22 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. ఒమర్జాయ్ తాజాగా ఈ రికార్డును బద్దలు కొట్టాడు. అంతేకాదు అఫ్గన్ తరఫున ఫాస్టెస్ట్ టీ20 ఫిఫ్టీ సాధించిన ఆటగాడిగానూ నిలిచాడు.

**కేవలం 94 పరుగులే చేసి..**

ఇదిలా ఉంటే.. అఫ్గన్ విధించిన 189 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో పసికూన హాంకాంగ్ విఫలమైంది. ఓపెనర్లు జీషన్ అలీ (5), అన్షుమన్ రథ్ (0) నిరాశపరచగా.. నిజఖత్ ఖాన్ (0), కించిత్ షా (6), ఐజాజ్ ఖాన్ (6), ఎషాన్ ఖాన్ (6) పూర్తిగా తేలిపోయారు. ఆఖర్లో ఆయుశ్ శుక్లా 1, అతీక్ ఇక్బాల్ ఒక పరుగుతో అజేయంగా నిలిచారు. ఇక వన్‌డౌన్‌లో వచ్చిన బాబర్ హయత్ 39 పరుగులతో హాంకాంగ్ టాప్ రన్ స్కోరర్‌గా నిలవగా.. కెప్టెన్ యాసిమ్ ముర్తాజా 16 పరుగులు చేయగలిగాడు. అఫ్గన్ బౌలర్ల ధాటికి తాళలేక హాంకాంగ్ బ్యాటర్లు ఇలా పెవిలియన్‌కు వరుస కట్టడంతో.. నిర్ణీత 20 ఓవర్లలో జట్టు తొమ్మిది వికెట్లు నష్టపోయి కేవలం 94 పరుగులు మాత్రమే చేయగలిగింది. అఫ్గన్ బౌలర్లలో ఫజల్‌హక్ ఫారూఖీ, గుల్బదిన్ నైబ్ రెండేసి వికెట్లు కూల్చగా.. అజ్మతుల్లా ఒమర్జాయ్, కెప్టెన్ రషీద్ ఖాన్, నూర్ అహ్మద్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. బ్యాట్‌తో, బాల్‌తో రాణించి అజ్మతుల్లా ఒమర్జాయ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

ఆసియా టీ20 టోర్నీలో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీలు నమోదు చేసింది వీరే..

అజ్మతుల్లా ఒమర్జాయ్ (అఫ్గనిస్తాన్)- హాంకాంగ్ మీద-20 బంతుల్లో

సూర్యకుమార్ యాదవ్ (ఇండియా)- హాంకాంగ్ మీద- 22 బంతుల్లో

రహ్మనుల్లా గుర్బాజ్ (అఫ్గనిస్తాన్)- శ్రీలంక మీద- 22 బంతుల్లో.

### యూట్యూబర్ సప్నాగిల్ వివాదం.. క్రికెటర్ పృథ్వీ షాకు కోర్టు జరిమానా



యూట్యూబర్ సప్నాగిల్‌తో వివాదం కేసులో టీమ్‌ఇండియా క్రికెటర్ పృథ్వీ షాకు షాక్ తగిలింది. ఆయనకు కోర్టు ఫైన్ వేసింది. సప్నాగిల్ దాఖలు చేసిన పిటిషన్‌కు సమాధానం ఇవ్వకపోవడంతో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జూన్ 13న క్రికెటర్ తరఫున న్యాయవాదికి చివరి అవకాశం ఇచ్చినప్పటికీ.. ఆయన ఇంకా స్పందన దాఖలు చేయలేదని పేర్కొంది. ఈ మేరకు రూ.100 ఫైన్ కట్టాలని ముంబై దిండోషి సెషన్స్ కోర్టు ఆదేశించింది. అంతేకాదు, పృథ్వీ షాకు మరో అవకాశం కల్పిస్తూ.. తదుపరి విచారణ డిసెంబరు 16కి వాయిదా వేసింది.

**అసలేం జరిగిందంటే..?**

2023లో ఆంధేరి బార్‌లో పృథ్వీ షా, అతడి స్నేహితుడు అశిష్ యాదవ్‌లు తమతో గొడవ పడ్డారని.. ఇద్దరూ తమపై బేస్‌బాల్ బ్యాటుతో దాడి చేశారని సప్న గిల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరింది. కానీ, పోలీసులు పట్టించుకోలేదు. అయితే.. సప్న అనవసర రాద్ధాంతం చేస్తుందని, తనను కావాలనే ఇరికిస్తోందని షా సైతం ఆమెపై కంప్లైంట్ చేశాడు. దాంతో, సప్న ముంబై కోర్టును ఆశ్రయించింది.

### పక్షవాతం.. నొప్పి భరించలేకపోయా: టీమిండియా స్టార్ క్రికెటర్




గత కొన్నాళ్లుగా భారత క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైన పేరు శ్రేయస్ అయ్యర్ పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో మంచి ఫామ్‌లో ఉన్నా ఆసియా కప్-2025 ఆడే టీమిండియాలో అతడికి చోటు దక్కకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఇదిలా ఉంటే.. 2022-23 మధ్య కాలంలో శ్రేయస్ ఇంతకంటే గడ్డు పరిస్థితులే ఎదుర్కొన్నాడు. క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడ్డాడన్న కారణంతో భారత క్రికెట్ నియంత్రణ మండలి శ్రేయస్ సెంట్రల్ కాంట్రాక్టును రద్దు చేసింది. అదే సమయంలో ఫిట్‌నెస్ సమస్యలు కూడా అతడిని వెంటాడాయి. నాటి పరిస్థితి గురించి శ్రేయస్ అయ్యర్ తాజాగా మాట్లాడుతూ విస్మయకర విషయాలు వెల్లడించాడు. పక్షవాతం వచ్చింది "ఆ సమయంలో నేను నొప్పితో ఎంతగా విలవిల్లాడానో ఎవరికీ తెలియదు. నా కాలుకు పక్షవాతం వచ్చింది. వెన్నెముకకు సర్జరీ జరిగిన తర్వాత.. నడుములో రాడ్డుతో ఎలా మేనేజ్ చేసుకున్నానో నాకే తెలియదు. ఆ ప్లేస్‌లో ఉన్న నరం కూడా దెబ్బతిన్నది. అదెంతో ప్రమాదకరమని వైద్యులు చెప్పారు. ఆ సమయంలో భరించలేని నొప్పి. నా కాలి చిటికిన వేలు వరకు నొప్పి పాకింది. నిజంగా అదొక భయంకర అనుభవం" అని జీక్యూ ఇండియాకు శ్రేయస్ అయ్యర్ తెలిపాడు. కాగా గాయం నుంచి కోలుకున్న తర్వాత శ్రేయస్ అ?య్యర్ ముంబై తరఫున దేశవాళీ క్రికెట్‌లో తనను తాను నిరూపించుకున్నాడు. అదే విధంగా ఐపీఎల్-2024లో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు కెప్టెన్‌గా టైటిల్ అందించాడు. ఈ క్రమంలోనే టీమిండియాలో పునరాగమనం చేయగా.. బీసీసీఐ అతడి సెంట్రల్ కాంట్రాక్టును పునరుద్ధరించింది. వన్డే వరల్డ్‌కప్-2023లో ఆడిన శ్రేయస్ అయ్యర్ భారత్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు.

వాటిని మాత్రమే నియంత్రించగలను

అదే విధంగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025లో టీమిండియాను విజేతగా నిలపడంలో ముఖ్య భూమిక అతడిదే. ఇక ఐపీఎల్-2025లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా, బ్యాటర్‌గా శ్రేయస్ అయ్యర్ గొప్పగా రాణించాడు. జట్టును ఫైనల్‌కు చేర్చాడు. అయినప్పటికీ ఆసియా టీ20 కప్ ఆడే భారత జట్టులో మాత్రం అతడికి చోటు దక్కకపోవడం గమనార్హం. ఈ విషయంపై స్పందిస్తూ.. "నా ఆధీనంలో ఉన్న వాటిని మాత్రమే నేను నియంత్రించగలను. నా నైపుణ్యాలు, బలాలను మరింత మెరుగుపరచుకోవడం మాత్రమే నాకు తెలిసిన పని. అవకాశం వచ్చినప్పుడు రెండు చేతులతో దానిని అందిపుచ్చుకునేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను" అని శ్రేయస్ అయ్యర్ స్పష్టం చేశాడు.




# 'టూమచ్' విత్ కాజోల్ ట్వింకిల్.. ఓటీటీ ప్రేక్షకుల కోసం బాలీవుడ్ నుంచి సరికొత్త టాక్ షో


బాలీవుడ్ అగ్ర తారలు కాజోల్, ట్వింకిల్ ఖన్నా ఓటీటీలోకి అడుగుపెట్టబోతున్నారు. వీరిద్దరూ కలిసి ప్రైమ్ వీడియోలో ఒక కొత్త టాక్ షోకు హోస్ట్‌లుగా వ్యవహరించబోతున్నారు. "టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్" పేరుతో రానున్న ఈ టాక్ షో కాఫీ విత్ కరణ్, బాలకృష్ణ అన్‌స్టాపబుల్ టాక్ షో లాగానే భారతదేశంలోని ప్రముఖ సెలబ్రిటీలతో ఇంటర్వ్యూలు చేయనుంది. మరోవైపు ఈ షోకి షారుఖ్ ఖాన్, అమీర్ ఖాన్, అజయ్ దేవగన్, అక్షయ్ కుమార్ వంటి స్టార్స్ అతిథులుగా రానున్నారని సమాచారం. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ టాక్ షో రాబోతుండగా.. తాజాగా ఈ షో స్ట్రీమింగ్ తేదీని ప్రైమ్ ప్రకటించింది. ఈ షోని సెప్టెంబర్ 25 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించింది.



# క్యూరియాసిటీ పెంచుతున్న 'తెలుసు కదా'

టాలీవుడ్ యంగ్ హీరో సిద్దు జొన్నలగడ్డ ఇటీవల 'జాక్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. కానీ ఈ మూవీ బాక్సాఫీసు వద్ద హిట్ అందుకోలేకపోయింది. అయినప్పటికీ హిట్ ఫ్లాప్ అని ఆలోచించకుండా సిద్దు జొన్నలగడ్డ వరుస సినిమాలు అనౌన్స్ చేస్తున్నాడు. ప్రస్తుతం సిద్దు జొన్నలగడ్డ, శ్రీనిధి శెట్టి, రాశిఖన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'తెలుసు కదా'. వైవా హర్ష కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నీరజ కోన దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీని పీపుల్ మీడియా బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్, టీజీ కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన సాంగ్స్, పోస్టర్స్ మంచి రెస్పాన్స్‌ను దక్కించుకున్నాయి. అక్టోబర్ 17న థియేటర్స్‌లోకి రాబోతున్న ఈ సినిమాకు సంబంధించిన వరుస అప్డేట్స్ రిలీజ్ చేస్తున్నారు మూవీ మేకర్స్. తాజాగా, 'తెలుసు కదా' చిత్రబృందం ఈ చిత్రానికి సంబంధించిన అప్డేట్ రాబోతున్నట్లు ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. ఈ సినిమా టీజర్ సెప్టెంబర్ 11న ఉదయం 11:11 గంటలకు విడుదల కాబోతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా సిద్దు జొన్నలగడ్డ దూరంగా ఉండగా.. రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టి ముగ్గురు బాల్కనీలో నిల్చొని సరదాగా మాట్లాడుకుంటున్న పోస్టర్ షేర్ చేసి క్యూరియాసిటీ పెంచారు. ఈ పోస్ట్‌కు "ప్రేమించడానికి జీవితం నీకు రెండు ఆప్షన్లు ఇస్తుంది.. లవ్ యూ2" అనే క్యాప్షన్ జత చేశారు.

# మాయమై.. మళ్లీ ఇన్నాళ్లకు



ఒక పెద్ద హిట్ ఇచ్చిన దర్శకుడికి.. తర్వాత అవకాశాల విషయంలో అసలే ఇబ్బందీ ఉండదు. కానీ పెట్టుబడి మీద ఐదారు రెట్లు లాభం తెచ్చి పెట్టిన 'డీజే టిల్లు' సినిమాను డైరెక్ట్ చేసిన విమల్ కృష్ణ విషయంలో మాత్రం భిన్నంగా జరిగింది. ఆ సినిమా క్రెడిట్ మొత్తం హీరో కమ్ రైటర్ సిద్ధు జొన్నలగడ్డ ఖాతాలోకి వెళ్లిపోవడంతో విమల్ కెరీర్ ముందుకు సాగలేదు. 'డీజే టిల్లు' సీక్వెల్ తీయాలనుకున్నపుడు విమల్ పక్కకు వెళ్లిపోయాడు. అతడి స్థానంలోకి మల్లిక్ రామ్ వచ్చాడు. 'టిల్లు స్క్వేర్'ను ఎందుకు డైరెక్ట్ చేయట్లేదంటే తనకు వేరే కమిట్మెంట్లు ఉన్నట్లు చెప్పాడు విమల్. కానీ 'డీజే టిల్లు' వచ్చిన మూడేళ్ల వరకు విమల్ మరో సినిమా మొదలుపెట్టలేకపోయాడు. ఐతే ఎట్టకేలకు అతను కొత్త సినిమాను ప్రారంభించాడు. చిన్న చిన్న పాత్రలతో మొదలుపెట్టి లీడ్ రోల్‌లో నటించిన 'సివరపల్లి' వెబ్ సిరీస్‌తో మంచి పేరు సంపాదించిన రాగ్ మయుర్.. విమల్ కృష్ణ కొత్త సినిమాలో హీరోగా చేస్తున్నాడు. ఇటీవల 'పరదా' సినిమాలో అనుపమ పరమేశ్వరన్‌కు జోడీగా నటించిన రాగ్ మయూర్‌ను విమల్ ఒక ఫీచర్ ఫిలింలో ఫుల్ లెంగ్త్ హీరోగా పెట్టి సినిమా తీస్తున్నాడు. అల్లరి నరేష్‌తో 'ఆ ఒక్కటి అడక్కు' సినిమా తీసిన చిలక ప్రొడక్షన్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. థ్రిల్లర్ చిత్రాలతో మంచి పేరు సంపాదించిన శ్రీ చరణ్ పాకాల ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నాడు.




# శివ కార్తికేయన్ సెన్సేషనల్ కామెంట్స్

కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ ఇటీవల 'మదరాసి' మూవీతో వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఈ సినిమా బాక్సాఫీసు వద్ద భారీ కలెక్షన్లు రాబడుతూ రికార్డులు క్రియేట్ చేస్తోంది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శివకార్తికేయన్ సెన్సేషనల్ కామెంట్స్ చేశాడు. "తమిళ సినిమాలు ఆ నంబర్‌కి చేరువలోకి ఉన్నాయని నేను అనుకుంటున్నాను. మరికొన్నేళ్లలో రూ. 1000 కోట్లు కలెక్షన్లు సాధిస్తాయని నమ్ముతున్నాను. చాలా తమిళ చిత్రాలు ఈ మార్క్‌ని అందుకోలేకపోతున్నాయి. స్టోరీలో నాణ్యత లేకపోవడమో లేదా పాన్ ఇండియా సబ్జెక్ట్ కాకపోవడం వల్లనో దీనికి కారణం అనిపిస్తుంది. మూవీ క్వాలిటీ సంగతి పక్కనపెడితే టికెట్ రేట్లు కూడా తమిళనాడులో చాలా తక్కువగా ఉంటాయి. బెంగళూరు ముంబైలో ఉన్నట్లు ఇక్కడ ఉంటే 'జైలర్'కు 800-1000కోట్లు వచ్చి ఉండేవి. అలా అని టికెట్ట్ రేట్లు పెంచమని నా ఉద్దేశం కాదు. మా సినిమాలు ఉత్తరాది ప్రేక్షకుల మనసులు గెలుచుకోవాల్సిన అవసరముందని నా అభిప్రాయం" అని చెప్పుకొచ్చాడు. ఇక ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు రకరకాల కామెంట్లు చేస్తున్నారు. శివకార్తికేయన్‌కు కొందరు సపోర్ట్ చేస్తుంటే మరికొందరు నెగెటివ్‌గా రియాక్ట్ అవుతున్నారు. ఇండరెక్ట్‌గా తెలుగు ఇండస్ట్రీ గురించే మాట్లాడాడని అంటున్నారు.



# క్రిష్-4కు లైన్ క్లియర్.. కానీ

బాలీవుడ్ సూపర్ స్టార్లలో ఒకడైన హృతిక్ రోషన్‌ను త్వరలోనే కొత్త అవతారంలో చూడబోతున్నాం. పాతికేళ్ల కెరీర్లో హీరోగానే కనిపించిన అతను.. తొలిసారిగా దర్శకుడి అవతారం ఎత్తబోతున్నాడు. తాను హీరోగా, తన తండ్రి దర్శక నిర్మాతగా వచ్చిన బ్లాక్ బస్టర్ 'క్రిష్' ఫ్రాంఛైజీలో భాగంగా నాలుగో చిత్రాన్ని స్వయంగా హృతికే డైరెక్ట్ చేయబోతున్నాడు. ఈ ఫ్రాంఛైజీలో తొలి మూడు చిత్రాలు కోయీ మిల్‌గయా, క్రిష్, క్రిష్-3 ఒకదాన్ని మించి ఒకటి హిట్టయ్యాయి. వీటిని డైరెక్ట్ చేసిన రాకేష్ రోషన్ చాలా ఏళ్ల కిందటే క్రిష్-4కు స్క్రిప్ట్ రెడీ చేశాడు. కానీ ఒకవైపు బడ్జెట్ సమస్యలు, మరోవైపు రాకేష్ రోషన్ ఆరోగ్య సమస్యలు ఈ సినిమాకు అడ్డంకిగా మారాయి. క్యాన్సర్ నుంచి కోలుకున్నాక కూడా ఈ సినిమాను పట్టాలెక్కించడానికి చాలా ప్రయత్నించాడు రాకేష్. కానీ ఆయన వల్ల కాలేదు. హృతిక్ మార్కెట్ స్థాయికి మించి ఖర్చు పెట్టాల్సి రావడంతో నిధులు సమకూరలేదు. బడ్జెట్ తగ్గిస్తే సినిమా చెడిపోతుందని రాకేష్ రాజీ పడలేదు. ఈలోపు ఆయనకు వయసు పెరిగి, ఓపిక తగ్గిపోయింది. దీంతో తాను ఆ సినిమాను డైరెక్ట్ చేయకూడదని నిర్ణయించుకున్నాడు. హృతిక్‌కే బాధ్యతలు అప్పగించేశాడు.




# పొలిటికల్ థ్రిల్లర్ స్టోరీతో 'భద్రకాళి'.. ట్రైలర్ రిలీజ్

తమిళ సంగీత దర్శకుడు కమ్ హీరో విజయ్ ఆంటోని వరసపెట్టి సినిమాలు తీస్తూనే ఉంటాడు. ఈ ఏడాది ఇప్పటికే 'మార్గన్' అనే మర్డర్ మిస్టరీ థ్రిల్లర్‌తో వచ్చాడు. ఇప్పుడు పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ జానర్?లో ఓ మూవీ చేశాడు. అదే 'భద్రకాళి'. లెక్క ప్రకారం సెప్టెంబరు 5నే థియేటర్లలోకి వచ్చేయాలి. కానీ 19వ తేదీకి వాయిదా పడింది. తెలుగు, తమిళంలో ఒకేసారి రిలీజ్ కానుంది. ప్రస్తుతం ప్రమోషన్స్ సాగుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా తెలుగు ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్ బట్టి చూస్తుంటే థ్రిల్లింగ్, పొలిటికల్ అంశాలు కనిపిస్తున్నాయి. సమాజంలోని దుష్టశక్తుల ఆటకట్టించే శక్తివంతమైన వ్యక్తిగా విజయ్ ఆంటోని పాత?్ర ఉండనుందని అర్థమవుతోంది. ఈవారం 'మిరాయ్', 'కిష్కంధపురి' లాంటి తెలుగు చిత్రాలు థియేటర్లలోకి రానున్నాయి. వచ్చే వారం రాబోతున్న 'భద్రకాళి'కి పెద్దగా పోటీ లేదు. మరి ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి ఫలితం అందుకుంటుందో చూడాలి?

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com